www.jagritiweekly.com

సంపుటి : 75 సంచిక : 46 పుటలు : 52

జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ నిజ శ్రావణ బహుళ పంచమి

04-10 సెప్టెంబర్ 2023

వెల: ₹20/-

చరిత్రాత్మకం ఈ చంద్రయానం

140 కోట్ల మంది భారతీయుల
గుండె చప్పుళ్లను విన్న క్షణం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

కాశెట్టి వారి వివాహ మహోత్సవ ఆహ్వానం

మా పుత్రిక చి.ల.సౌ. **శ్రీలక్ష్మి** ని చి॥ **శ్రావణ్ కుమార్** కు
ఇచ్చి వివాహము జరుపుటకు శ్రీ వేదమూర్తులైన బ్రాహ్మణోత్తములచే
సుముహూర్తము నిర్ణయించడమైనది. కావున తామెల్లరు సకుటుంబ సపరివార
సమేతముగా విచ్చేసి నూతన విధూవరులను ఆశీర్వదించి, భోజన తాంబూలాదులను
స్వీకరించి మమ్మానందింపచేయ ప్రార్థన...

తేది: 07.09.2023 ఉ. 10.30

కళ్యాణవేదిక:
ఎస్.ఆర్. కన్వెన్షన్ సెంటర్
హన్మకొండ రోడ్, హుజురాబాద్

ఇట్లు
శ్రీమతి కాశెట్టి వసంత
శ్రీ కాశెట్టి కుమార్
సెల్: 9908671999

వాకాటి పాండురంగారావు స్మారక కథల పోటీ

జాగృతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక కోసం సుప్రసిద్ధ కథా రచయిత స్వర్గీయ వాకాటి పాండురంగారావు స్మారక 'కథల పోటీ - 2023' నిర్వహిస్తున్నాం. రచయితలకు ఆహ్వానం..

ప్రథమ బహుమతి : రూ. 12000/-
ద్వితీయ బహుమతి : రూ. 7000/-
తృతీయ బహుమతి : రూ. 5000/-

1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతి, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు జాగృతి పారితోషికం ఉంటాయి.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 3 కథలకు మించి పంపరాదు.
4. కథ తన స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. దీపావళి సంచిక నుంచి ఆరంభించి, వరుసగా ఈ కథలను ప్రచురిస్తాం.
6. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి. చేతి రాత అందంగా, న్యాయనిర్ణేతలకు అర్థమయ్యేలా ఉంటే స్కాన్ చేసి పంపినా పరవాలేదు. కొట్టివేతలు ఉన్నా, సరిగా స్కాన్ చేయకున్నా పోటీకి తీసుకోలేం.
7. కథను పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027 కు పంపొచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
8. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. సంపాదకునిదే అంతిమ నిర్ణయం.

కథలు జాగృతికి చేరడానికి చివరి తేది : 11 సెప్టెంబర్, 2023

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

జాగృతి చందా – సూచనలు

5 సం॥ల చందా రూ.4000, సంవత్సర చందా రూ.850, విడి ప్రతి రూ.20

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

చందా కట్టించే వారికి సూచనలు :

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

చందా పంపవలసిన చిరునామా :

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి	అసోసియేట్ ఎడిటర్
సబ్ ఎడిటర్	**9959991304**

డిజైనర్ : సిహెచ్. కుమార్

బీజేపీ చూపు గగనాన్ని దాటి దూసుకుపోతూ ఉంటే, కాంగ్రెస్ దృష్టి పాతాళం అంచుల కోసం వెంపర్లాడుతోంది. ఈ శతాధిక సంవత్సరాల రాజకీయ పక్షంలో నోటి తీట ప్రవీణులకు ఎప్పుడూ లోటు లేదు. అవతలి వ్యక్తి ఎలాంటి వారని చూడకుండా నోరు పారేసుకునే ఉత్సాహవంతులకు అసలే కొదవ లేదు. దశాబ్దాల పాటు కాంగ్రెస్‌కు సేవలు అందించి ఉండొచ్చు. ఆ పార్టీకి చెందిన ఇందిరాగాంధీకీ, రాజీవ్‌కీ సన్నిహితులే కావచ్చు. ఈ దేశానికి ప్రధానిగా కూడా సేవలు అందించి ఉండవచ్చు. ఆఖరికి ఈ దేశాన్ని ఒక క్లిష్ట పరిస్థితి నుంచి గట్టెక్కించిన ప్రతిష్ట రూపాయి మందాన ఉండొచ్చు. వారు మన మధ్య లేకపోవచ్చు గాక. అయితేనేం! అలాంటి వారి చరిత్ర మీద బురద చల్లకూడదనేమీ లేదు ఆ పార్టీలో. సోనియా గాంధీ ఉండగా తగుదునమ్మా అంటూ ప్రధాని పదవి చేపట్టడం ఏమిటి? ఇది గాంధీ కుటుంబం పట్ల ఘోర అపచారం కాదా! అసలు ఇలాంటి అభిప్రాయం గాంధీ కుటుంబంలోనే గాఢంగా ఉంది. గాంధీజీ సిద్ధాంతాలు గాలికి వదిలేసినా గాంధీ కుటుంబాన్నీ, ఆ పార్టీనీ తనివి తీరా సేవించుకుంటున్న వారు కోకొల్లలు. అందులో మణిశంకర్ అయ్యర్‌ది ప్రథమ స్థానం.

ఈ మధ్య ఈయనో పుస్తకం అచ్చేసి దేశం మీదకి వదిలిపెట్టాడు. పేరు 'మెమోయర్స్ ఆఫ్ ఎ మావెరిక్-ది ఫస్ట్ ఫిఫ్టీ ఇయర్స్'. పుస్తకం రాసిన తరువాత ఆవిష్కరించే పని ఉంటుంది. ఎటొచ్చీ నిలువెల్లా ప్రచార యావ ఉన్నవాళ్లు ఆ ఆవిష్కరణను పురస్కరించుకుని కొంత పైత్యం కూడా పంచుతారు. తన పుస్తక ఆవిష్కరణ వేళనే మణిశంకర్ అన్నాడు, 'పీవీ నరసింహారావు మతవాది అని.' ఆపై 'బీజేపీ తొలి ప్రధాని' అని ముక్తాయించాడు. ఈ మణిపూస రామ్ రహీమ్ యాత్ర ప్రారంభించదలచి పీవీ అనుమతి కోసం వెళ్లాడట. అందుకు పీవీ, 'నీ యాత్రకు నాకేమీ అభ్యంతరం లేదు. కానీ సెక్యులరిజానికి నీవు చెబుతున్న నిర్వచనంతో ఏకీభవించను.' అన్నారట. 'నా నిర్వచనంలో దోషమేమిటి' అని మణిపూస అడిగిందట. అందుకు, 'మణి! ఇది హిందూ దేశమన్న సంగతి నీకు అర్థం కానట్టే ఉంది చూడబోతే' అన్నారట పీవీ.

శాలివాహన 1945 శ్రీ శోభకృత్ నిజ శ్రావణ బహుళ పంచమి

లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం

చరిత్రాత్మకం ఈ చంద్రయానం

6లో

మహిళ

అంతరిక్ష విజయంలో భారతీయ 'శివశక్తి'

12లో



ధారావాహిక నవల

మహా సంకల్పం

– పి. చంద్రశేఖర ఆజాద్

20లో

జాగృతి

సంపాదకీయం

కూర్చున్న కుర్చీలో నుంచి లేస్తూ మణి, 'బీజేపీ సరిగ్గా ఇలాగే అంటుంది' అన్నాడట. కాబట్టి బీజేపీ నుంచి వచ్చిన మొదటి ప్రధాని వాజపేయి కాదు, పీవీ అన్నదే మణి కవి హృదయం.

ఎన్నికలు సమీపిస్తుంటే మణికి పూనకం వస్తుంది, ఇలాంటి చచ్చు ప్రకటనలు చేస్తూ నలుగురి నోళ్లలోను నానేందుకు తంటాలు పడుతూ ఉంటాడని పీవీ మనుమడు ఎన్‌వీ సుభాశ్ వ్యాఖ్యానించారు. గాంధీ కుటుంబీకులు తప్ప ఇంకెవరు ఈ దేశ ప్రధాని పదవిని అధిరోహించినా కాంగ్రెస్ తట్టుకోలేదన్న సంగతి మణిశంకర్ ద్వారా మరొకసారి బహిర్గతం చేయించారని బీజేపీ అధికార ప్రతినిధి

కాంగ్రెస్ మణిపూస

సంబిత్ పాత్రా సరిగానే చెప్పారు. కాబట్టి రాహుల్‌ను తప్ప మరొకరిని ప్రధాని పదవిలో చస్తే కాంగ్రెస్ చూడదని ఈ విధంగా 'ఇండియా' శిబిరానికి హెచ్చరిక పంపారని కూడా పాత్రా గుట్టు విప్పారు.

మావెరిక్ అన్న పదానికి స్వతంత్రుడు, ఎవరికీ తలవంచడు, సంప్రదాయ పంథాలో నడవనివాడు వంటి అర్థాలు ఉన్నా, ముగుతాడు అవసరమైన జంతువు అని చెప్పడానికి కూడా ఈ పదం వాడతారట. మణిశంకర్ విషయంలో రెండోది తూకం వేసినట్టు సరిపోతుందని అనిపిస్తుంది. కాంగ్రెస్ పార్టీలో నిజంగానే ఈయనొక మణిపూస. సరిగ్గా ఎన్నికల ముహూర్తంలోనే పూనడం ఈయన నైజం. 2014లో మోదీని చాయ్‌వాలా అని ఎద్దేవా చేసిన ఘనుడు ఇతడే. ఈ మాట అని బీజేపీని మణే నెగ్గించాడని కాదుకానీ, కాంగ్రెస్‌కి మాత్రం విశ్రాంతి కల్పించడానికి ఆ మాట కాస్త దోహదం చేసిందనే అంటారు. 2017లో గుజరాత్ ఎన్నికల వేళ మోదీ గురించి వాగి పార్టీని నిలువునా ముంచినందుకు ఇతడిని పార్టీ నుంచి గెంటేశారు. 2019లో లోక్‌సభ ఎన్నికలకి మళ్లీ పూనకం. మళ్లీ అవే వ్యాఖ్యలు. పైగా తన వ్యాఖ్యలలో తప్పేమీ లేదని ధంకా బజాయించిన నిస్సగ్గరి ఇతడు.

తన రచనను ఇంకొన్ని రత్నాల వంటి అభిప్రాయాలతో మణి అలంకరించాడు. పాకిస్తాన్‌లో 99.9 శాతం ఉత్తములేనట. అసలు వాళ్ల నుంచి వెల్లువెత్తే ప్రేమను తట్టుకోవడమే కష్టమట. అయితే ఓ సర్వేలో ఈ సంగతిలోని నిజమెంత? ఆ మాటను మీరు ఎలా స్వీకరిస్తారు? అని అడిగితే 56 శాతం మంది వికారం వచ్చినట్టు మొహం పెట్టారట. పాకిస్తాన్‌లో మైనారిటీలను చావగొడుతున్న మాట నిజం అంటూ ఈ మధ్య కూడా నివేదికలు వచ్చాయి. అరెస్టులూ జరిగాయి. చర్చిల మీద దాడి నిందితులని జైళ్లకి పంపారు. అయినా మణి మాట ప్రకారం ఆ ఒక్క శాతమే ఇదంతా చేస్తోంది. మిగలిన వారంతా బంగారుకొండలు. ఏదో కొద్దిమంది వైఖరి వల్ల మనం సంఘౌతా ఎక్స్‌ప్రెస్ రైలును నిలిపివేయడమేనా? 99 శాతం బుద్ధిమంతులే ఉన్న ఆ పొరుగు దేశంతో చర్చలకు వెళ్లకపోవడం మహాపాపం కదా అన్న అభిప్రాయాలను కూడా తన గ్రంథరాజంలో మణి పొదిగారు. భారత్‌లో తిష్ట వేసిన పాక్ ప్రేమికుల బలగానికి తానే పెద్దనని స్వచ్ఛందంగా ప్రకటించుకున్నాడు.

మా కుటుంబమే కనుక అధికారంలో ఉంటే అయోధ్య కట్టడం కూలేది కాదు అంటూ లోగడ ఆ పార్టీ యువరాజు, గాంధీ కుటుంబ వారసుడు రాహుల్ స్వయంగా బొంకలేదా! కానీ ఈ వ్యాఖ్యను ధాన్యంపొల్లు కంటే హీనంగా చూసింది భారతజాతి. ఎందుకంటే, అందులో వాస్తవికత ఎంతో జనానికి తెలుసు. అయినా కానీ అధినాయకుడి మాటను తాను గౌరవిస్తున్నానని కష్టపడి రాసిన తన గ్రంథంలో మణి ప్రకటించాడు. రాహుల్, మణి, దిగ్విజయ్ వీరంతా కాంగ్రెస్‌కు సరైన వారసులు. జాతీయ భావాలను పిసరంత కూడా సహించరు. ఆ క్రమంలో పార్టీ పరువే కాదు, దేశ ప్రతిష్ట మసకబారినా ఫరవాలేదు. ★

కథ

ఒక వర్షాకాలపు సాయంత్రం

- ఎం. రమేశ్‌కుమార్



మనుష్య రూపంలో దైవం దేవకీ తనయుడు (ప్రత్యేక వ్యాసం) - 26
సంపద సృష్టికి సోపానం (ఆర్థిక అక్షరాస్యత అవగాహన) - 28
నెత్తుటి చారికల కింద తడియారని జ్ఞాపకాలు (అమృతోత్సవాలు) - 33
బీఆర్ఎస్ కోవర్టు రాజకీయాలు! (తెలంగాణ) - 34
వేయిపడగలు అంతరార్థము (ప్రత్యేక వ్యాసం) - 36
ఓటు మీద రాజకీయ ముద్ర (వేదిక) - 38
'ఆనంద'డోలికల్లో భారత చదరంగం! (క్రీడ) - 43
జాతీయ సినీ అవార్డులలో మనదే అగ్రస్థానం (సినిమా) - 50



ఈ క్షణం 140 కోట్ల మంది భారతీయుల గుండె చప్పుళ్లను విన్నది. నిజమే ఈ క్షణం కోసమే ఇన్నేళ్లుగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలే కాదు, భారత్ మొత్తం అక్షరాలా కన్నార్పకుండా చూసింది. చంద్రుడిని అందుకోవడానికి అన్ని శక్తి సామర్థ్యాలనూ ధారపోసి, నెలలపాటు ఇంటి ముఖం కూడా చూడకుండా పనిచేసిన శాస్త్రవేత్తల, సాంకేతిక నిపుణుల ఆకాంక్ష నెరవేరుస్తూ.. ఇస్రో స్వప్నం సాకారం చేస్తూ.. అంతరిక్షంలో భారత ప్రతిష్ఠను మువ్వన్నెల జెండాలా ఎగురవేసింది చంద్రయాన్ 3 మిషన్. ప్రపంచ చరిత్రలో విశిష్టఘట్టంగా నిలిచింది. విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా చంద్రుడి (ఆగస్టు 23)పై కాలిడింది. ఆశించినట్టే అది చంద్రుని దక్షిణ ధ్రువంపై సుఖంగా దిగి, చందమామని అందరి ఇళ్లలోకీ తీసుకువచ్చింది. అంతేకాదు, ఇక్కడ అన్వేషణ పూర్తి అయితే, మన పాలపుంత ఆవలి విశ్వ రహస్యాలను కనుగొనేందుకు ఇది ప్రవేశద్వారం కానుంది. మన మిడిమిడి జ్ఞానపు మేధావుల వ్యాఖ్యలలోని అజ్ఞానాన్ని పటాపంచలు చేసి చంద్రుని దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా, కాలిడిన నాలుగవ దేశంగా భారత్

చరిత్రాత్మకం ఈ చంద్ర

చంద్రయాన్ -2 వైఫల్యం సమయంలో నాటి ఇస్రో చైర్మన్ శివన్ తన జీవితంలో అపురూపమైన దానినీ, జీవన్మరణంగా భావించినదానినీ కోల్పోయి నట్టుగా వెక్కి వెక్కి ఏడవడం, అక్కడే ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ అతడిని దగ్గరకు తీసుకుని వీపుతట్టి ఓదార్చిన దృశ్యాలు మనందరం చూశాం. అంతటి ఘోరమైన వైఫల్యాన్ని ఎదుర్కొన్నప్పటికీ, తమకు లభించిన ప్రోత్సాహంతో ఆ నిరాశ నుంచి తేరుకుని, ఆ వైఫల్యం నుంచి పాఠాలు నేర్చుకుని, తప్పులను సవరించుకుని ఈసారి మిషన్‌ను విజయవంతం చేయాలని నాడే శాస్త్రవేత్తల బృందం సంకల్పం చేసుకుంది.

చోదన వ్యవస్థల (ప్రొపల్షన్స్ సిస్టం) నిపుణుల నుంచి ఇస్రో హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ వ్యవస్థాపక డైరెక్టరు వరకు, చంద్రయాన్-2 వైఫల్యం తర్వాత బాధ్యతలు తీసుకున్న మిషన్ డైరెక్టర్ నుంచి మూడు దశాబ్దాలు అనుభవం కలిగి ఇస్రో సీనియర్ల వరకు చంద్రయాన్-3లో పాలుపంచుకుంటూ, మార్గదర్శనం చేసినవారిలో ఉన్నారు. ఈ విశ్వ రహస్యాలను తెలుసుకునేందుకు ఏకాంతంగా వెడుతున్న అంతరిక్ష నౌకకు అత్యున్నత ప్రతిభ కలిగిన వారు మార్గదర్శనం చేశారనడం అతిశయోక్తి కాదేమో! అందుకే, ఇది అంత తేలికైన పని కాదు, కొన్ని సంవత్సరాల కఠిన పరిశ్రమ.. కృషి అని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ పేర్కొన్నారు. చంద్రయాన్ -2 వైఫల్యాన్ని అధ్యయనం చేసి, దానిని నేర్చుకోవడం అన్నది తమకెంతో తోడ్పడిందని చెప్పారు. ఆ పరాజయాల నుంచి తాము నేర్చుకున్న పాఠాల కారణంగానే చంద్రుడిపై మృదువుగా దిగడం సాధ్యమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై దిగిన అనంతరం, దేశానికీ, సహచరులకు అభినందనలు తెలిపేందుకు వచ్చిన సోమ్‌నాథ్ ఈ లక్ష్యాన్ని సాధించడంలో తోడ్పడిన కీలక సభ్యులను మొదటగా పరిచయం చేయడమే కాక వారు మాట్లాడేందుకు అవకాశ మిచ్చారు. ఎవరినీ వదిలిపెట్టకుండా, చంద్రయాన్ -3 విజయం అనేక సంస్థలకు చెందిన వేలాదిమంది ఇంజనీర్లు, సిబ్బంది అందించిన సేవల కారణంగా సాధ్యమైందన్నారు. చంద్రయాన్ 3 విజయవంతం అయ్యేందుకు ముందు మిషన్‌లో కొన్ని మార్పులూ, చేర్పులూ ఇస్రో చేసింది. ఇంతకు ముందు మిషన్‌లో పంపిన ల్యాండర్‌తో పోలిస్తే విక్రమ్ ల్యాండర్ బరువును 280కేజీలు పెంచడం వల్ల, అది గుర్తించిన పథం ద్వారానే చంద్రుడి ఉపరితలాన్ని చేరేందుకు అదనపు ఇంధనాన్ని అందులో ఉంచడం సాధ్యమైందని సోమ్‌నాథ్ వివరించారు.

భారతీయ రెండవ లూనార్ ల్యాండర్ అండ్ రోవర్ మిషన్‌గా పేర్కొంటున్న ఈ ప్రయోగం ద్వారా మూడు లక్ష్యాలను సాధించి, తమ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించాలని ఇస్రో శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. మొదటగా, చంద్రుడి ఉపరితలంపై ఎంతో

చరిత్రకెక్కింది. అంతేనా! ప్రయోగాల కోసం మరొక పెద్ద అడుగు వేస్తోంది. సూర్యవలయానికి ఇస్రో ఉపగ్రహాన్ని పంపుతున్నది. ఈ సంచిక మీ చేతిలో ఉండే సమయానికి ఆదిత్య -ఎల్ 1 ఆ వలయంలో తన పని మొదలుపెట్టి ఉండవచ్చు కూడా. పారిశ్రామిక విప్లవానికి దూరంగా ఉండిపోయి, వందల ఏళ్ల తరువాత ఐటీతో కాస్త కోలుకున్న భారత సాంకేతిక స్థాయి, ఇస్రో ప్రతిభతో అక్షరాలా తారస్థాయికి చేరింది. ప్రపంచాన్ని ఆకర్షించింది. ఈ క్షణం దేశాన్ని ఎంత ఉత్తేజపరిచిందో, చరిత్రలో అదొక మలుపుగా ఆవిష్కృతమయిన తీరును చదువుదాం. ఆ అనుభూతిని పదిలపరుచుకుందాం.

యానం

140 కోట్ల మంది గుండె చప్పుళ్ల సామర్థ్యానిది ఈ క్షణం

విక్రమ్ ల్యాండర్ భూఉపరితలంపై దిగడాన్ని మనంతటి ఉద్విగ్నతతోనే ప్రధాని మోదీ దక్షిణాఫ్రికా నుంచి దృశ్యమాధ్యమంలో వీక్షించారు. అది జరిగీ జరగగానే ఆయన శాస్త్రవేత్తలను అభినందిస్తూ, ఇటువంటి చరిత్రాత్మక ఘటనలు జరిగినప్పుడు జీవితం ధన్యమైపోతుంది. ఇటువంటి చారిత్రక ఘటనలు జాతి జీవనానికి శాశ్వత చేతన అవుతుందన్నారు. ఈ విజయం పట్ల ఉద్వేగంగా మాట్లాడుతూ-ఈ క్షణం విస్మృతి చెందనిది. ఈ క్షణం అనుభూతికి అందనిది. ఈ క్షణం వికసిత భారత శంఖనాదానిది. ఈ క్షణం నూతన భారతావని జయ ఘోషది. కష్టాల కడలిని దాటవలసిన క్షణమిది. గెలిచి చంద్రపథంపై అడుగులు వేయాల్సిన క్షణమిది. 140 కోట్లమంది గుండె చప్పుళ్ల సామర్థ్యానిది ఈ క్షణం. నూతన శక్తి, నూతన విశ్వాసం, నూతన చేతనల క్షణమిది. ద్విగుణీకృతమవుతున్న భారత అదృష్టానికి హామీ ఇచ్చే క్షణమిది.

అమృత్ కాలంలోని మొదటి సంవత్సరంలోనే సఫలత అనే అమృత వర్షం కురిసింది. మనం ఇక్కడ భూమిపై సంకల్పం చేసి, చంద్రుడిపై దానిని సాకారం చేశాం. మన శాస్త్రవేత్తలు కూడా అన్నారు, 'ఇండియా ఈజ్ నౌ అన్ ది మూన్' అని. ఈరోజు అంతరిక్షంలో నూతన భారతం వేగంగా దూసుకు పోవడానికి మనం సాక్షులుగా ఉన్నాం. నేను ఇప్పుడు బ్రిక్స్ సమావేశం కోసం దక్షిణాఫ్రికాలో ఉన్నాను, కానీ ప్రతి భారతీయుడిలాగే నా మనసు కూడా చంద్రయాన్‌పై లగ్నమై ఉంది. కొత్త ఇతిహాసాన్ని లిఖించగానే ప్రతి భారతీయుడూ సంబరాలు జరుపుకోవడంలో మునిగిపోయాడు. ప్రతి ఇంట్లోనూ ఉత్సవం ప్రారంభమైంది. ఎప్పటిలాగే నేను కూడా ఈ భారతీయులు, కుటుంబాలలో వెల్లివిరుస్తున్న ఉల్లాసం, ఉత్సాహంతో అనుసంధానమై ఉన్నాను. నేను టీం చంద్రయాన్‌కు, ఇస్రోకు, దేశంలోని శాస్త్రవేత్తలందరికీ హృదయపు లోతుల్లోంచి అభినందనలను అందిస్తున్నాను... ముఖ్యంగా, ఈ క్షణం కోసం ఏళ్ల తరబడి పరిశ్రమ చేసిన వారిని. ఉత్సాహం, ఉల్లాసం, ఆనందం, భావుకతతో నిండిన ఈ అద్భుత క్షణంలో నేను 140 కోట్ల దేశవాసులకు కూడా కోటి కోటి అభినందనలు తెలుపుతున్నాను.

బెంగళూరులో ప్రధాని మోదీ ఉద్వేగ ప్రసంగం

చంద్రయాన్ 3 విజయవంతంగా దక్షిణ ధ్రువంపై దిగిన రోజు (ఆగస్టు 23)న బ్రిక్స్ సమావేశంలో ఉన్న మోదీ దృశ్యమాధ్యమం ద్వారా తన సంతోషాన్ని పంచుకుంటూ, శాస్త్రవేత్తలను అభినందించినప్పటికీ, భారతదేశానికి తిరిగి రాగానే మొట్టమొదటగా వారినే కలుసుకుంటానంటూ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. తన గ్రీసు పర్యటనను ముగించుకుని నేరుగా బెంగళూరులోని హెచ్ఎఎల్ విమానాశ్రయంలో దిగిన ప్రధాని మోదీ అక్కడ పెద్ద ఎత్తున చేరిన ప్రజలను ఉద్దేశించి 'జై విగ్యాన్, జై అనుసంధాన్' అనే నినాదాన్నిచ్చారు. బెంగళూరులోని ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ మిషన్ కంట్రోల్ కాంప్లెక్స్‌లో శాస్త్రవేత్తలతో సమావేశమైన ప్రధాని మోదీ అత్యంత ఉద్వేగానికి లోనై, ఉద్విగ్నతతో శాస్త్రవేత్తలపై ప్రశంసలు కురిపించారు. 'మీ అంకిత భావానికి నా సెల్యూట్. మీ సహనానికి సెల్యూట్. మీరు కష్టపడి పని చేసిన తీరుకు నా సెల్యూట్, మీ స్ఫూర్తికి నా సెల్యూట్' అంటూ ప్రధాని ఉద్విగ్నంగా శాస్త్రవేత్తలకు సెల్యూట్ చేశారు.

'శరీరాన్నీ, ఆత్మనూ కూడా సంతోషంతో ముంచెత్తే సందర్భాలు అత్యంత అరుదుగా జీవితంలో లభిస్తాయి... ఇంతటి అనందం చాలా అరుదుగా లభిస్తుంది' అని మోదీ అన్నారు. 'మేకిన్ ఇండియా'ను చంద్రుడిపైకి తీసుకు వెళ్లినందుకు శాస్త్రవేత్తలను ప్రశంసలతో మోదీ ముంచెత్తారు. సైన్సులో విశ్వాసముంచే ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ భారత్ సాధించిన విజయంతో భవిష్యత్‌పట్ల ఎంతో ఉత్సాహంతో ఉన్నారని చెప్పారు.

నియంత్రణతో విజయవంతంగా దిగడం, అక్కడి ఉపరితలంపై రోవర్ చరించడం, అంతిమంగా చంద్రుని ఉపరితలంపైనే శాస్త్రీయ ప్రయోగాలను చేపట్టడం.

అత్యంత చౌకగా ఇస్రో ప్రయోగాలు

అంతరిక్ష పరిశోధనలను, ప్రయోగాలను అత్యంత తక్కువ నిధులతో ఇస్రో సంస్థ, అందులోని శాస్త్రవేత్తలు విజయవంతంగా పూర్తి చేయడం వారికి దేశం పట్ల ఉన్న అంకితభావానికి, ప్రేమకు అద్దం పడుతుంది. ఉపగ్రహాల నుంచి ఇంత పెద్ద ప్రయోగాల వరకు దుబారా లేకుండా నిర్మించి, ప్రయోగాలు చేస్తున్నారు. ఇంకా అభివృద్ధి చెందిన దేశాల జాబితాలోకి అధికారికంగా ఎక్కని భారత్ అత్యంత తక్కువ ఖర్చుతో చేస్తున్న అంతరిక్ష ప్రయోగాలను గమనించి ప్రపంచం ముక్కున వేలేసుకుంటోంది.

మొన్న ప్రయోగించిన చంద్రయాన్-3కు అయిన ఖర్చు రూ. 615 కోట్లు (75 మిలియన్ డాలర్లు)

ఈ ఘనత మోదీకే దక్కుతుంది..



చంద్రయాన్ 3 విజయం ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీకే చెందుతుందని ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్ కుండబద్దలు కొట్టి చెప్పారు. మోదీని మీరు ప్రధానిగా, నాయకునిగా ఆమోదించవచ్చు. లేదా వ్యతిరేకించవచ్చు. అది మీ ఇష్టం. కానీ చంద్రయాన్ 3 విజయం ఆయనకే చెందుతుంది అని నంబి అన్నారు. మోదీకి ముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ మీద విశ్వాసం లేదని ఆయన 'న్యూ ఇండియన్' చానల్‌కు చెప్పారు. చంద్రయాన్‌కు ఆ ప్రభుత్వాలు ఏమీ కేటాయించని విషయాన్ని కూడా ఆ మాజీ శాస్త్రవేత్త వెల్లడించారు. ప్రథమ ప్రధాని నెహ్రూ శాస్త్రవేత్తలను విశేషంగా ప్రోత్సహించారని, ఇస్రో ఆయన కాలంలోనిదేనని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో నంబి ఈ వ్యాఖ్యలు చేశారు.

అంతర్గత అన్వేషణ కోసం ఆధ్యాత్మికత, బహిర్గత అన్వేషణ కోసం సైన్స్: సోమ్‌నాథ్

ఇస్రో శాస్త్రవేత్తలు ప్రతి ప్రయోగానికీ ముందు ఆలయానికి వెళ్లి పూజలు చేయించడం ఒక ఆనవాయితీ. రాకెట్ ప్రయోగం ముందు షార్‌కు సమీపంలో గల చెంగాళమ్మ ఆలయంలో నమూనాను కూడా తీసుకు వెళ్లి పూజలు జరిపించడం సంప్రదాయంగా వస్తున్నది. ఈ విషయం బహిరంగ సత్యమే అయినా, చంద్రయాన్ 3 విజయవంతం అయిన తర్వాత శాస్త్రవేత్తలు ఆలయాలకు వెళ్లడమేమిటంటూ పెద్ద ఎత్తున ఉదారవాదులు విమర్శలు ప్రారంభించారు.

దీనిపై ఇస్రో అధిపతి సోమనాథ్ వారికి ధీటైన సమాధానం ఇచ్చారు. తనకు అన్వేషణ అనేది ఎంతో ఆసక్తి కలిగించే అంశమని, అందుకే అంతర్గత అన్వేషణ కోసం ఆధ్యాత్మికను అనుసరిస్తానని, బహిర్గత అన్వేషణ కోసం శాస్త్రవేత్తను అయ్యానంటూ వారికి జవాబిచ్చారు. అంతేకాదు, తాను పుట్టిన కుటుంబానికి ఒక సంస్కృతి ఉంటుందని, దానిని తాను అనుసరించి ముందుకు తీసుకువెడుతున్నానని చెప్పారు. ప్రాచీన గ్రంథాలను చదవడం ద్వారా తాను అనూహ్యమైన విషయాలను కూడా తెలుసుకునేందుకు అవకాశం కలుగుతోందని ఆయన పరోక్షంగా వేదాలకు, సైన్స్‌కు గల సంబంధాన్ని కూడా తెలియచెప్పారు.

మాత్రమే. ఇది అంతరిక్షంపై వచ్చిన ఇంటర్ స్టెల్లార్ అనే హాలీవుడ్ చిత్రానికి వెచ్చించిన 165 మిలియన్ డాలర్లలో సగమే కాదు, మన దేశంలోనే నిర్మించిన విఫల చిత్రం 'ఆది పురుష్' బడ్జెట్ అయిన రూ. 700 కోట్ల కన్నా తక్కువ.

ఇస్రో చేస్తున్న ఈ ప్రయోగాలు సినిమా బడ్జెట్ల కన్నా తక్కువ కావడమే కాదు, అనేకమంది సెలబ్రిటీల, అంబానీ వంటి ప్రముఖుల గృహాలు, వాహనాల కన్నా తక్కువ కావడం ఇక్కడ చెప్పుకోవలసిన అంశం.

మొన్న మొన్ననే చంద్రుడిపైకి వెళ్లి చంద్రుని దక్షిణ ధ్రువంపై దిగడంలో ఘోరంగా విపలమైన రష్యా లూనా-25 నిర్మాణానికి రష్యన్లు చేసిన ఖర్చు భారతీయ రూపాయలలో 1600 కోట్లు. ఇక చైనా చేపట్టిన తొలి చాంగె అన్వేషణ కోసం చేసిన వ్యయం రూ. 1752 కోట్లు. అమెరికా ప్రయోగాల ఖర్చు బిలియన్ల డాలర్లలో ఉండటం గమనార్హం.

అంతరిక్ష పరిజ్ఞానం కోసం ఒక సంస్థ

నాడు వెనుకబడిన దేశంగా ఉన్న భారత్‌లో కూడా మానవాళికి సేవలందించేందుకు అంతరిక్ష సాంకేతికతను ఉపయోగించడం కోసం ఒక అంతరిక్ష సంస్థ ఉండాలనే భావనను డాక్టర్ విక్రమ్ సారాభాయ్ నాటి ప్రధానిలో నాటారు. ప్రపంచంలోని ఏ అంతరిక్ష సంస్థ అజెండా అదికాదు. అభివృద్ధి చెందుతున్న దేశాల అంతరిక్ష కార్యకలాపాలు చేపట్టడంలోని హేతుబద్ధతను కొందరు ప్రశ్నిస్తుంటారు. కానీ మాకు లక్ష్యంలో ఎటువంటి ద్వైదీభావం లేదు. ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలతో చంద్రుడు లేదా గ్రహాలు లేక మూన్‌స్పేస్ ఫ్లైట్‌లలో పోటీపడం. కానీ, మేం కనుక దేశీయంగా లేక అనేక దేశాల నేపథ్యంలో పాత్ర పోషించవలసి వస్తే, అత్యాధునిక సాంకేతికతలను మానవాళికి, సమాజ వాస్తవ సమస్యల పరిష్కారానికి దానిని అనువర్తింపచేయడంలో మనం రెండవవారిగా ఉండకూడదు అన్నది భారత అంతరిక్ష కార్యక్రమ పితామహుడి భావన.

ఇస్రో అవతరణ

అంతరిక్ష పరిశోధనల అవసరంపై 1962లో డాక్టర్ విక్రమ్ సారాభాయ్ సలహా, సూచనలతో నాటి ప్రధాని జవాహర్‌లాల్ నెహ్రూ ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ (ఐఎన్‌సిఒ ఎస్‌పిఎఆర్)ను ఏర్పాటుకు ఆమోదముద్ర వేశారు. ఐఎన్‌సిఒ ఎస్‌పిఎఆర్ వృద్ధి చెంది 1969లో అణు ఇంధన విభాగం (డిఎఇ) ఇస్రోగా ఏర్పడింది. భారత ప్రభుత్వం 1972లో అంతరిక్ష విభాగాన్ని, అంతరిక్ష కమిషన్‌ను ఏర్పాటు చేసి ఇస్రోను దాని పరిధిలోకి తెచ్చింది.

ఎక్కడా తగ్గలేదు

నాసా చంద్రుడిపైకి మనిషిని పంపినప్పుడు ఇస్రో శైశవదశలో ఉన్న ప్రభుత్వ సంస్థ. భారతదేశంలో విజ్ఞాన పరిశోధన అంతగా పెరగని కాలంలోనే ఇస్రో వంటి సంస్థను ఏర్పాటు చేయాలని నాటి ప్రభుత్వం నిర్ణయించడం ఒక సాహసమే. ఆ సమయంలో ఇటు యుఎస్ఎ, అటు యుఎస్ఎస్ఆర్ అంతరిక్ష సాంకేతికత పరిజ్ఞానంతో భారీ ఆవిష్కరణలకు తెర లేపడమన్నది నాటి ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితుల పరిణామం. అమెరికా, సోవియెట్ రష్యా, జర్మనీ, చైనా వంటి దేశాలు అంతరిక్ష సాంకేతికతలను అభివృద్ధి చెందిన దేశాల మధ్య పోటీగా చూశాయే తప్ప మానవాళి ప్రాథమికావసరాలను తీర్చగల సామర్థ్యం వాటికి ఉందని గుర్తించలేదు. సామాన్య మానవుడికి మాత్రమే అటువంటి సాంకేతికతలను ప్రత్యేకంగా ఉపయోగించిన తొలి దేశం భారతదేశమే.

అంతరిక్ష విభాగం కింద ఇస్రోను వేరు సంస్థగా ఏర్పాటు చేసినప్పుడు అది బడ్జెట్‌కు సంబంధించిన, సాంకేతికత, నైపుణ్యాలలో లోపం వంటి అనేక సమస్యలను ఎదుర్కొంది. ఆ సమయంలో డా॥ విక్రమ్ సారాభాయ్, డా॥ ఏపీజే అబ్దుల్ కలాం, డా॥ సతీష్ ధావన్ వంటి

నైపుణ్యం కలిగిన అతికొద్దిమంది శాస్త్రవేత్తలు మాత్రమే ఉన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు అంతరిక్ష సాంకేతికతలను పంచుకోవడానికి గానీ, బదలాయించడానికిగానీ నిరాకరించాయి. ఇది నేటికీ కొనసాగుతున్నది. దీని కారణంగా లాంచ్ పాడ్‌లు, ఉపగ్రహాల నుంచి ప్రతి అంతరిక్ష ప్రయోగానికి సంబంధించిన సాంకేతికతలను ప్రతిదానినీ ఇస్రో స్వయంగా తయారు చేసుకోవలసి వచ్చింది.

పరాజయాలే విజయానికి మెట్లు

అత్యంత సాధారణ నిధులతో ఇస్రో చేపట్టిన అద్భుతాలను చూసి ప్రపంచమే విస్తుపోతున్నది. ప్రతి దశలోనూ పరాజయాలను విజయానికి మెట్లుగా మార్చుకుంటూ, పరాజయం మోపిన నిరాశలో మునిగిపోకుండా అక్కడి శాస్త్రవేత్తలు మొక్కవోని నిబద్ధతతో పనిచేయడం ప్రశంసనీయం. ఉన్న తక్కువ బడ్జెట్‌లోనే ఉపగ్రహాలను, ల్యాండర్లను, రోవర్లను తయారుచేసి, ఇంత తక్కువ ఖర్చులో కూడా అసాధారణ విజయాలను సాధించవచ్చనివారు రుజువు చేశారు. ఆఖరుకు చంద్రయాన్-3లో కూడా వారు ఇంధనాన్ని ఆదా చేస్తూ, రోవర్ ఎక్కువకాలం చంద్రునిపై అన్వేషణ చేసేందుకు వీలుగా ప్రయోగాన్ని రూపకల్పన చేశారు. అందుకే మన ల్యాండర్ చంద్రుడిని చేరుకునేందుకు 40 రోజులు పట్టింది. అయితే ఏమిటి? ఏ దేశమూ చేయలేని ఫీట్‌ని చేసి 'డార్క్ సైడ్ ఆఫ్ ది మూన్' గా పిలిచే చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగి విజయబావుటాను ఎగురవేసింది. ఆ ప్రాంతాన్ని ఎవ్వరూ అన్వేషించక పోవడం, అక్కడ సూర్యుడి కిరణాలు నెలలో 14 రోజులు మాత్రమే పడడం వల్లనే దానిని డార్క్ సైడ్‌గా పేర్కొంటారు. అంటే, మనకు 14 రోజులు, అక్కడ ఒక చాంద్రి దినమన్నమాట.

శాస్త్రవేత్తలకు సాధారణ వేతనాలు

ఇస్రో లేదా డిఆర్‌డిఒ లేదా బార్క్ (బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్)లో పనిచేసే శాస్త్రవేత్తలకు అభివృద్ధి చెందిన దేశాలలో వలె కాకుండా ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించినట్టే సగటు వేతనాలు చెల్లిస్తారు. అయినప్పటికీ మన శాస్త్రవేత్తలు అద్భుతమైన ఫలితాలను అందిస్తున్నారు. చిత్రమేమిటంటే, ఇంత ప్రతిష్ఠాత్మక సంస్థలో పనిచేసే ఇంజినీర్లలో 2శాతం మంది మాత్రమే ఐఐటిలు, ఎన్ఐఐటిల నుంచి వచ్చిన వారు. తమ రంగంలో ఎంతో అధ్యయనం చేసి, డిగ్రీలను పొందిన అనేకమంది 'దేశం మనకేమిస్తోంది?' అని ప్రశ్నించి, దేశం వదిలి వెళ్లే చాలామందివలె కాకుండా, 'దేశానికి మనమేదైనా ఇవ్వాలి' అన్న లక్ష్యంతో ఇక్కడే ఉండి పనిచేయడం ఎంతో ప్రశంసనీయమైన విషయం. మనవలె, కొండకచో మనకన్నా సామాన్య జీవితాలు గడుపుతూ, అసాధారణ విజయాలను సాధిస్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని కొందరు అజ్ఞానులు చేసే విమర్శలు వారు రెట్టింపు పట్టుదలతో పని చేసేందుకు స్ఫూర్తినిస్తున్నాయే తప్ప వారిలో నిరాశను కలిగించక పోవడం వారి గొప్ప వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది. జేబులో 'రేనాల్డ్స్' పెన్నులతో అత్యంత సామాన్య వేషభాషలతో కనిపించే మన ఇస్రో శాస్త్రవేత్తల మేధస్సు మాత్రం అమూల్యమైనదని, దేశంపట్ల ప్రేమ, బాధ్యత మొక్కవోనివని ఈ ప్రయోగం ద్వారా మరొక్కసారి రుజువు చేసుకున్నారు.

నైపుణ్యాలు కలిగిన వారి కొరత

ఇక్కడ మరొక విషయం చెప్పుకోవలసి ఉంది. భారతీయ శాస్త్ర, సాంకేతిక అంశాలు చదువుకుని, ప్రతిభ, నైపుణ్యం కలిగినవారంతా వేతనాల కోసమనో, ప్రతిష్ఠ కోసమనో నాసా వంటి సంస్థలకు సేవలందించే స్థితి దేశంలో ఉంది. దీనితో నైపుణ్యాలు కలిగిన కార్మికశక్తి ఇస్రోకు కొరవడింది. అయితే, ఈ మిషతో వారు ఏ ప్రాజెక్టునూ ఆలస్యం చేయలేదు. ఇందుకు ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకుంది ఇస్రో. చంద్రయాన్, మంగళయాన్ వంటి ప్రధాన ప్రాజెక్టులను పెద్దగా అనుభవం లేని 25-30 ఏళ్లలోపు వయస్కులైన శాస్త్రవేత్తలు, టెక్నీషియన్లు, సూపర్‌వైజర్ల తోడ్పాటుతో పూర్తి చేసింది. ఇటువంటి బృహత్కార్యాలు భారత్‌లో తప్ప మరెక్కడా సాధ్యం కావు.

ఉద్విగ్నతకు లోనైన ప్రతి ఒక్క భారతీయుడు

చంద్రుడి దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ దిగుతుందా? లేక గతానుభవాన్ని ఎదుర్కోవలసి వస్తుందా అన్న సంశయం, ఆశ నడుమ ఈ సన్నివేశాన్ని ఏ మాధ్యమం ద్వారా సాధ్యమైతే ఆ మాధ్యమం ద్వారా దేశంలోని 140 మంది కోట్ల భారతీయులే కాదు, విదేశాలలో ఉన్నవారు కూడా అత్యంత ఉద్విగ్నంగా వీక్షించారు. ఆ క్షణాలలో, ఆ తర్వాతా కూడా వారి మనసులోకి వచ్చిన భావన, నోటి నుంచి వచ్చిన మాటలు, చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన మొదటి దేశం 'మన భారతదేశం' అన్నవే. అంతేకాదు, బ్రిక్స్ సమావేశంలో ఉండి కూడా ఇస్రో శాస్త్రవేత్తల విజయాన్ని తాను కూడా కళ్లారా చూసి, అభినందించిన ప్రధాని పట్ల కూడా సానుకూలంగా స్పందించారు. ఒక సామాన్యుడు కోరుకునేది ఇదే. తాము చేసిన పనికి దేశాధినేత నుంచి గుర్తింపు, ప్రశంస రావాలనే కోరిక ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అంతేతప్ప, బీజేపీ ప్రధాని అయితే ఒకరకంగా, కాంగ్రెస్ ప్రధాని అయితే మరొక రకంగా ఉండదు. బహుశ సోరోస్ సంస్థల నుంచి కోట్లాది రూపాయలు అందుకునే వ్యక్తులకు, సంస్థలకు ఆ భావన ఉండవచ్చేమో కానీ సాధారణ పౌరుడికి ఆ భావన ఉండదన్న విషయాన్ని 140 కోట్లమంది ప్రజలు రుజువు చేశారు.

ఇది చిరస్మరణీయ ఘట్టం

ఇదొక చిరస్మరణీయ ఘట్టం అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వ్యాఖ్యానించారు. విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధృవం మీదకు చేరగానే ముర్ము ఇస్రో శాస్త్రవేత్తలకు, సాంకేతిక నిపుణులకు తన అభినందనలు తెలియచేశారు. చరిత్రలో నమోదయ్యే రోజులు కొన్ని మాత్రమే ఉంటాయి. చంద్రయాన్ 3 మిషన్ విజయంతో మన శాస్త్రవేత్తలు చరిత్రను సృష్టించడమే కాదు, విశ్వం మీది కల్పనకు కూడా కొత్త రూపు ఇచ్చారని ఆమె అన్నారు. యావద్దేశం గర్వించదగిన ఇలాంటి క్షణాలు జీవితకాలంలో ఒక్కసారే వస్తాయి అని కూడా ముర్ము సమున్నతంగా వ్యాఖ్యానించారు.

దాదాపు 12 సంస్థల సహకారంతో చంద్రయాన్ 3 విజయవంతం

చంద్రయాన్ -3 మిషన్ విజయవంతంగా పూర్తి కావడంలో తోడ్పడిన ప్రధాన ఇస్రో కేంద్రాలు/యూనిట్లు అనేకం ఉన్నాయి. ఇస్రో తన వెబ్‌సైట్‌లో ప్రస్తావించిన సంస్థలు –

- యుఆర్ రావ్ శాటిలైట్ సెంటర్, యుఆర్ఎస్‌సి, బెంగళూరు
- విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్, విఎస్ఎస్‌సి, త్రివేండ్రం
- లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్, ఎల్‌పిఎస్‌సి, త్రివేండ్రం, బెంగళూరు
- ఇస్రో శాటిలైట్ ట్రాకింగ్ సెంటర్, ఐఎస్‌టిఆర్ఎసి, బెంగళూరు
- స్పేస్ అప్లికేషన్స్ సెంటర్, ఎస్ఎసి, అహ్మదాబాద్
- లాబొరేటరీ ఫర్ ఎలక్ట్రో- ఆప్టిక్స్ సిస్టమ్స్, ఎల్ఇఒఎస్, బెంగళూరు
- ఇస్రో ఇనర్షియల్ సిస్టమ్స్ యూనిట్, ఐఐఎస్‌యు, త్రివేండ్రం
- ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్, ఐపిఆర్‌సి, మహేంద్రగిరి
- సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, ఎస్‌డిఎస్‌సి- షార్
- నేషనల్ రీమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సి), హైదరాబాద్
- ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ, పిఆర్ఎల్
- స్పేస్ ఫిజిక్స్ లాబొరేటరీ, ఎస్‌పిఎల్

ఈ సంస్థలన్నీ కూడా చంద్రయాన్ మిషన్ -3 భావన, నమూనా రూపకల్పన, అభివృద్ధి, పరీక్ష, దానిని కార్యాచరణలోకి తీసుకువచ్చి మిషన్ సాకారం కావడంలో తోడ్పడ్డాయి.

ఆత్మనిర్భర్ భారత్‌ను సాకారం చేసేందుకు కృషి

చంద్రయాన్-3ను దాదాపుగా దేశీయ కంపెనీల నుంచి సేకరించిన పరికరాలతో నిర్మించింది ఇస్రో. చంద్రయాన్‌లో ప్రయోగించిన రాకెట్ కోసం, ల్యాండర్, రోవర్ వంటి వాటికోసం పలు విడిభాగాలను అంతరిక్ష, ప్రెసిషన్ ఇంజినీరింగ్‌కు సంబంధించిన పలు ఎంఎస్ఎంఇ పరిశ్రమలు తయారు చేసి ఇస్రోకు సరఫరా చేయడం అన్నది ఆత్మనిర్భర్ భారత్‌ను, మేకిన్ ఇండియా స్ఫూర్తిని ప్రతిఫలిస్తోందనడం అతిశయోక్తి కాదేమో. 'మన చేత, మన వల్ల, మన కోసం' అన్నట్టుగా చంద్రయాన్ ప్రయోగం జరగడం మనకు ఎంతో గర్వకారణం. ఈ మిషన్ కోసం విడిభాగాలను, పరికరాలను తయారు చేసిన సంస్థలలో హైదరాబాద్‌కు చెందిన సంస్థలు అనేకం ఉండడం తెలుగువారందరికీ గర్వకారణమైన విషయం.

విక్రమ్ ల్యాండర్, ప్రగ్యాన్ రోవర్

దేశం యావత్ దృష్టినీ ఆకర్షించడమే కాదు, ప్రతి ఒక్కరూ గర్వపడేలా చేసిన చంద్రయాన్-3 మిషన్‌లో ప్రధాన పరికరాలు విక్రమ్ ల్యాండర్, ప్రగ్యాన్ రోవర్‌లు. అంతరిక్ష రంగ ప్రాముఖ్యతను గుర్తించి దేశంలో అందుకు సంబంధించిన సంస్థల ఏర్పాటుకు కారకుడైన విక్రమ్ సారాభాయ్ జ్ఞాపకంగా ల్యాండర్‌కు విక్రమ్ అన్న పేరు పెట్టారు. అది తన పేరును సార్థకం చేసుకుంటూ, తప్పటడుగు వేయకుండా చంద్రుడిపై దిగింది. ఇక చంద్రుడిపై విహరించి, అక్కడి సమాచారాన్ని సేకరించి, మనకు చేరవేసే రోవర్‌కు 'ప్రగ్యాన్' అని ఇస్రో పేరు పెట్టింది. సంస్కృతంలో ప్రగ్యాన్ అంటే జ్ఞానం అని అర్థం. విక్రమ్ ల్యాండర్ నుంచి ప్రగ్యాన్ బయటపడి పడగానే, ప్రగ్యాన్ మూన్‌వాక్‌కి వెళ్లిందంటూ ట్విట్టర్‌లో ఇస్రో సంస్థ ముచ్చటగా ప్రకటించింది. ఆరు చక్రాలు కలిగిన రోవర్, సౌరశక్తి ద్వారా పని చేస్తుంది. దానికి చంద్రుడి ఉపరితలంపై మేళనాలను విశ్లేషించేందుకు రెండు స్పెక్ట్రోమీటర్లను అమర్చారు. తాము దిగిన పరిసరాలలో రోవర్ దాదాపు 14 రోజులు అంటే ఒక చాంద్రమానం రోజు తిరుగుతుంది. చంద్రమాన రాత్రి కారణంగా అక్కడి వాతావరణం అతి శీతలంగా మారడంతో ఈ రెండూ జడంగా మారిపోతాయి. అయితే, ఇక అసలు పని చేయవేమో అని కూడా చెప్పలేం. ఎందుకంటే, మొదటగా వాటిని చంద్రుడిపై వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా తయారు చేశారు, రెండవది మళ్లీ సూర్యోదయం కాగానే, సూర్యకిరణాలు వాటిని తట్టిలేపి, జడ స్థితి నుంచి బయటపడేసే అవకాశం ఉంది. అయితే, ఇస్రో వాటికి 'పన్ వే టికెట్' ఇచ్చి పంపడంవల్ల అవి వెనక్కి తిరిగి రావు. అక్కడే భారత అన్వేషణ స్ఫూర్తికి గుర్తుగా ఉండిపోతాయి.

అన్వేషణ ఎందుకోసం?

చంద్రుడిపై మట్టిలో గల ఉపరితల సమీప ప్లాస్మా (అయాన్లు, ఎలక్ట్రాన్లు) సాంద్రతను ఈ మిషన్ అంచనా వేయనుంది. అదనంగా, చంద్రయాన్ -3 తాము దిగిన చోట సీస్మిక్ యాక్టివిటీ (భూకంపన చర్య)ను పర్యవేక్షిస్తుంది. చంద్రుడి మట్టిలో గల వివిధ రసాయనాలను కనుగొనాలన్నది మిషన్ లక్ష్యాలలో ఒకటి. గుర్తించిన ల్యాండింగ్ ఏరియా, దాని చుట్టు

100మంది మహిళా శాస్త్రవేత్తల కృషి కూడా...

ప్రతి కార్యక్రమం, ప్రాజెక్టులో మహిళా శాస్త్రవేత్తల / ఇంజనీర్ల భాగస్వామ్యం ఉండటం ఇస్రోలో ఆనవాయితీ. చంద్రయాన్-3 మిషన్‌లో రూపకల్పన, నమూనా, నిర్మాణం, పరీక్షించడం వంటి కీలక బాధ్యతలను 100మంది మహిళా సిబ్బంది చేపట్టి ప్రత్యక్ష పాత్రను పోషించారు.

ప్రధానంగా వారు మొత్తంగా అంతరిక్ష నౌక సమగ్రాకృతి, చంద్రయాన్-3 ని సాకారం చేయడం, బృంద నిర్వహణ; అంతరిక్షణ నౌక కూర్పు, సమగ్రం చేసి పరీక్షించడం; చంద్రయాన్ మిషన్ కార్యకలాపాల గ్రౌండ్ సెగ్మెంట్ ఏర్పాటు, అమలు; స్వతంత్రంగా, సురక్షితంగా, మెత్తగా భూమిపై కక్ష్యపై దిగడం కోసం ల్యాండర్ సామర్థ్యాన్ని నిర్ధారించడానికి ల్యాండర్ నావిగేషన్ గైడెన్స్ అండ్ కంట్రోల్ సిమ్యులేషన్స్‌ను నిర్వహించడం; లేజర్ ఆల్టీమీటర్, లేజర్ డాప్లర్ వంటి కీలక సెన్సార్లను అభివృద్ధి చేసి, బట్వాడా చేయడం; కీలక ల్యాండర్ పవర్ డిసెంట్ ఫేజ్ (ల్యాండర్ దిగే కీలక దశ)లో కీలకపాత్ర పోషించే వెలాసి మీటర్, ల్యాండర్ హారిజంటల్ వెలాసిటీ కెమెరా తదితరాల అభివృద్ధి వంటివాటన్నింటిలో మహిళా శాస్త్రవేత్తలు ముఖ్య పాత్ర పోషించడం చెప్పుకోదగిన విషయం. ★

పక్కల గల చంద్రునిపై మట్టి, రాళ్లలో (మెగ్నీసియం, అల్యూమినియం, సిలికాన్, పొటాషియం, కాల్షియం, టైటానియం, ఐరన్ సహా) ప్రాథమిక కూర్పును నిర్ధారించేందుకు ఆల్ఫా పార్టికల్ ఎక్స్-రే స్పెక్ట్రో మీటర్ (ఎపిఎక్స్ఎస్) అనే పరికరాన్ని ఉపయోగించనున్నారు.

దక్షిణ ధ్రువంలోనే అన్వేషణ ఎందుకు?

ఈ ప్రాంతం అందరి దృష్టినీ ఆకర్షించడానికి కారణం ఇక్కడి నీటి ఉనికే కాదు, ఆ నీటిని రాకెట్ ఇంధనంగా ఉపయోగించవచ్చన్న భావన. అంతేనా, చంద్రుడిపై శాశ్వత స్థావరాన్ని ఏర్పాటు చేసుకునేందుకు తోడ్పడడమే కాక, కుజగ్రహం, దాని ఆవలగల అంతరిక్షాన్ని అన్వేషించేందుకు ఇది ఒక ప్రయోగ వేదికగా ఉండాలన్నది ఆకాంక్ష.

చంద్రుడి దక్షిణ ధ్రువ ఉపరితలం లోతైన బిలాలతో కూడి ఉంటుంది. సూర్యుడి కిరణాలు పడే కోణాల కారణంగా, ఈ బిలాలలో అనేకం పూర్తి చీకటిగా ఉంటాయి. కొన్ని వేల లక్షల సంవత్సరాలుగా సూర్యకిరణాలు తాకని ఈ బిలాలలో హైడ్రోజెన్, వాటర్ ఐస్, ఇతర అస్థిర సమ్మేళనాలు ఉంటాయని భావిస్తున్నారు. ముఖ్యంగా ఇవి సౌర వ్యవస్థ తొలి దశ నుంచి ఉన్నవని శాస్త్రవేత్తల భావన. అత్యంత శీతలమైన ఉష్ణోగ్రతల కారణంగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై చిక్కుకుపోయిన పదార్థమేదీ ఎక్కువ మార్పునకు గురికాకపోవడమే కాదు, ఈ విశ్వంపై తొలి జీవనానికి సంబంధించిన ఆధారాలను కలిగి ఉంటుంది. అందుకే, శాస్త్రీయ అన్వేషణలకు ప్రాముఖ్యత కలిగిన కేంద్రంగా ఈ ప్రాంతం ఉంది. సుదూర అంతరిక్ష ప్రయాణంలో ఇంధనం అన్నది అతిపెద్ద సవాలు. రాకెట్లు కూడా పరిమితంగానే ఇంధనాన్ని తీసుకుని, భూకక్ష్యను దాటి అంతరిక్షంలోకి వెడతాయి. ఎంత ఎక్కువ ఇంధనం ఉంటే, రాకెట్ అంత బరువుగా ఉండటమే కాదు, ఖర్చు కూడా అధికంగా ఉంటుంది. ఇక్కడ గల నీటిని ఇంధనంగా ఉపయోగించుకునే అవకాశం ఉంటే, సుదూర అంతరిక్ష యానానికి వెళ్లే రాకెట్లు చంద్రుడిపై ఆగి పెట్రోల్ బంకులో మనం పెట్రోలు పోయించుకున్నట్టుగా అవి ఇంధనాన్ని నింపుకుని ముందుకు

నాసా అధిపతి సంతోషం

చంద్రయాన్ 3 ప్రయోగం విజయం సాధించినందుకు అమెరికాకు చెందిన అంతరిక్ష సంస్థ 'నాసా' అభినందించింది. 41 రోజులు ప్రయాణించి రోవర్ ఆగస్ట్ 23, సాయంత్రం 6.04లకు చంద్రుని దక్షిణ ధ్రువం మీదకు చేరింది. ఈ కార్యక్రమంలో నాసాకు భాగస్వామ్యం ఉన్నందుకు తాము గర్వపడుతున్నామని ఆ సంస్థ అధిపతి బిల్ నెల్సన్ వ్యాఖ్యానించారు. రష్యా వారి లూనా 25 కూలిపోయిన మరునాడే భారత ప్రయోగం విజయవంతం కావడం అమెరికాను సహజంగానే సంతోషపెడుతుంది. జాబిల్లిపై అడుగుపెట్టిన నాలుగో దేశం భారత్‌కు అభినందనలు అని నెల్సన్ ట్వీట్ చేశారు.





రోవర్ ముద్రించిన మూడు సింహాలు

ఇద్దరు ప్రధానుల

పోవచ్చు. ఈ కారణంగా, అంతరిక్ష పరిశోధనలకు ఖర్చు చాలా మేరకు తగ్గుతుంది.

రష్యా లూనార్-25 వైఫల్యం

భారతదేశం చంద్రయాన్-3ను ప్రయోగించి, అది చంద్రుడిపై దిగే రోజు కోసం ఎదురుచూస్తున్న తరుణంలో రష్యా చంద్రుడిపై దిగే అంతరిక్ష నౌక లూనాను ప్రయోగించింది. అయితే, లూనా - 25 అనూహ్యమైన రీతిలో చంద్రుడి ఉపరితలంపై దిగకుండానే కుప్పకూలిపోయింది. సోవియట్ రష్యా చంద్రుడి ఉపరితలంపై కాలిడిన దాదాపు 47 ఏళ్ల తర్వాత అంతరిక్షంలో చంద్రుడికి సంబంధించి చేపట్టిన తొలి మిషన్ ఇదే కావడంతో సహజంగానే రష్యన్లు నిరాశపడ్డారు.

బీబీసీ విలాపం

భారత ప్రధాని నరేంద్ర మోదీ బ్రిక్స్ సమావేశ వేదిక నుంచీ చంద్రయాన్ -3 విజయం ఈ ప్రపంచంలోని ప్రతి ఒక్కరిదీ అని చెప్పడం, ప్రతి ఒక్క దేశాధినేత భారత్ విజయాన్ని అభినందించడం జరుగుతుండగానే ఒకనాటి సామ్రాజ్యవాద దేశంగా ఉన్న బ్రిటన్ ప్రచార అంగం బీబీసీ మాత్రం ఈ విజయాన్ని చూసి తట్టుకోలేకపోయింది. ఇప్పటికే బ్రిటన్ ఆర్థిక వ్యవస్థను అధిగమించి ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించ డాన్ని, చంద్రయాన్ భూమిపై దిగడమే కాదు, ఎవరూ దిగని దక్షిణ ధ్రువ ప్రాంతంలో దిగడమూ వారికి అస్సలు మింగుడు పడడం లేదు. అదే ఆగస్టు 23న బీబీసీలో జరిగిన చర్చలో ప్రతిఫలించింది. భారత్‌ను ఎప్పుడూ నిరుపేద దేశంగా, దానికి ఆర్థికంగా ఇతరత్రా మద్దతు ఇచ్చేది తామేననట్టు ప్రదర్శించే బీబీసీ, ఇప్పుడు కూడా అదే తీరును చూపి, భారత్‌తో పాటు ఇతర దేశాల ప్రజల నుంచి కూడా విమర్శలను ఎదుర్కొంది

ఆ రోజు

భారతీయ అంతరిక్ష కార్యక్రమానికి ప్రోత్సాహాన్నిస్తూ ఆగస్టు15, 2003లో నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చంద్రయాన్ ప్రాజెక్టును ప్రకటించి చందమామ గురించి అందరిలో ఆసక్తి పెంచారు. వాస్తవానికి, చంద్రుడిపై అన్వేషణలకు భారత శాస్త్రీయ మిషన్‌ను పంపాలన్న ఆలోచన ఇండియన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్‌లో జరిగిన ఒక సమావేశంలో ప్రస్తావనకు రావడం, 2000లో ఆస్ట్రోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా దీనిని ముందుకు తీసుకువెళ్లడం జరిగాయి. కొద్దికాలానికే ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఆర్ఒ -ఇస్రో) జాతీయ లూనార్ మిషన్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం, చంద్రుడిపై అన్వేషణకు భారతీయ మిషన్‌ను చేపట్టేందుకు ఇస్రోకు సాంకేతిక నైపుణ్యాలు ఉన్నాయని అది తేల్చడం జరిగిపోయాయి. తర్వాత 2003లో గ్రహ-అంతరిక్ష శాస్త్రాలు, భూమి శాస్త్రాలు, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, ఖగోళశాస్త్రం, ఖగోళ భౌతిక శాస్త్రం, ఇంజనీరింగ్, సమాచారశాస్త్ర రంగాలకు చెందిన 100మంది ప్రముఖ శాస్త్రవేత్తలు చంద్రుడిపై అన్వేషణకు శ్రీకారం చుట్టమంటూ టాస్క్‌ఫోర్స్ చేసిన సూచనను లోతుగా చర్చించి పచ్చజెండా ఊపారు. సరిగ్గా ఆరు నెలల తర్వాత నవంబర్‌లో, భారత ప్రభుత్వం ఈ మిషన్‌కు ఆమోదముద్ర వేసింది.

చంద్రయాన్ 1 : అక్టోబర్ 22, 2008

ప్రభుత్వ ఆమోదముద్రతో ఇస్రో శాస్త్రవేత్తలు అత్యంత ఉత్సాహంతో పథకాన్ని విజయవంతం చేసే పనికి ఉపక్రమించారు. తొలిదశలో లూనార్

ప్రోత్సాహం

ఆర్బిటర్ (చంద్ర కక్ష్యలో పరిభ్రమించే యంత్రం)ను రూపొందించిన ఇస్రో 22 అక్టోబర్ 2008లో పిఎస్ఎల్వి-ఎక్స్ఎల్ రాకెట్ ద్వారా చేసిన చంద్రయాన్-1 ప్రయోగం ఘన విజయాన్ని సాధించింది. అందులోని మూన్ ఇంపాక్ట్ ప్రోబ్ తొలిసారి చంద్రునిపై నీటి ఆనవాళ్లను కనుగొనడమే కాకుండా, చంద్రుడిని మ్యాపింగ్, దాని వాతావరణాన్ని ప్రొఫైలింగ్ వంటి పనులను కూడా చేపట్టి, ఇస్రోకు బోలెడు సమాచారాన్ని అందించింది.

చంద్రయాన్ 2: జూలై 14, 2019

ఈ విజయం ఇచ్చిన స్ఫూర్తితోనే 2008 సెప్టెంబర్ 18న మన్మోహన్ సింగ్ తొలి కేబినెట్ సమావేశం చంద్రయాన్-2కు ఆమోద ముద్రవేసింది. ప్రభుత్వాల ప్రోత్సాహంతో ఇనుమడించిన ఉత్సాహంతో ఇస్రో శాస్త్రవేత్తలు పనిని ప్రారంభించినప్పటికీ, వారికి ఈ మిషన్‌లో అడుగడుగునా ఆటంకాలు ఎదురయ్యాయి. ఈ ప్రయోగం 2013 జనవరిలో చేయాలని నిర్ణయించినప్పటికీ, ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించకపోవడం, సరైన సమయంలో ల్యాండర్‌ను తయారుచేసి ఇవ్వడంలో రష్యా విఫలం కావడంతో దానిని 2016కు వాయిదా వేశారు. అయితే, 2015 నాటికి కూడా రష్యా దానిని అందచేయలేకపోవడంతో స్వతంత్రంగా దానిని తామే తయారు చేసుకోవాలని భారత్ నిర్ణయించుకుంది. మొత్తం మీద జులై 22 ,2019న చంద్రయాన్-2 మిషన్‌ను ఎల్‌విఎం3 రాకెట్ ద్వారా ప్రయోగించారు. నెలరోజులలోపే అంతరిక్ష నౌకను చంద్రుని కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టినప్పటికీ, సెప్టెంబర్ 6, 2019న చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగుతున్న సమయంలో కొన్ని సాంకేతిక కారణాల వల్ల ల్యాండర్‌తో అనుసంధానం తెగిపోయింది. కాగా, ఆర్బిటర్ ఇంకా శాస్త్రీయ డాటాను సేకరిస్తూ పని చేస్తూనే ఉండటమే కాదు మరొక 7.5 ఏళ్ల పాటు పనిచేస్తూనే ఉంటుందని అంచనా. కొన్ని వారాల కింద రష్యా పంపిన లూనా-25కి కూడా ఇటువంటి అనుభవమే ఎదురైనట్టు తెలుస్తోంది.

చంద్రయాన్ 3: జూలై 14, 2023

చంద్రయాన్ -2లో ల్యాండర్‌తో సంబంధాలు తెగిపోవడానికి కారణమైన కొన్ని సవాళ్లను ఇస్రో శాస్త్రవేత్తలు పరిష్కరించి, చంద్రయాన్ -3ని పకడ్బందీగా రూపొందించారు. డార్క్ సైడ్ ఆఫ్ ది మూన్‌గా ప్రాచుర్యం పొందిన, అత్యంత కఠినమైన చంద్రుడి దక్షిణ ధ్రువం ప్రస్తుతం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందుకు కారణాన్ని సరళంగా చెప్పాలంటే, చంద్రుని దక్షిణ ధ్రువంపై మంచు పరమాణువులు ఉన్నాయని భారత్ ప్రపంచానికి వెల్లడించడమే. భవిష్యత్‌లో గ్రహాల అన్వేషణలలో నీటి ఉనికి అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకోవచ్చు. నీటి జాడ ఎక్కడ ఉంటుందో అక్కడ ఎన్నో కార్యకలాపాలు సాధ్యం అవుతాయి. గొప్ప గొప్ప నాగరికతలన్నీ విలసిల్లింది నదీతీరాలలోనే అని మనం మరచిపోకూడదు.

చంద్రయాన్-1బడ్జెట్ రూ.385 కోట్లు కాగా, చంద్రయాన్-2 మిగిలిన వాటితో పోలిస్తే కొంచెం ఎక్కువ అనిపిస్తుంది. చంద్రయాన్-2 కోసం చేసిన వ్యయం రూ.978 కోట్లు. ★

చర్చకు ప్రధాన యాంకర్‌గా ఉన్న పాట్రిక్ క్రిస్టీస్, భారత్ వంటి నిరుపేద దేశంలో నిధులను రాకెట్ ప్రయోగాల కోసం ఖర్చు చేసే బదులు దరిద్రంలో కొట్టుమిట్టాడుతున్న ప్రజలను అందు లోంచి బయటపడేసేందుకు చేయవచ్చు కదా అంటూ ఉచిత సలహా ఒకటి పారే శారు. అంతేకాదు, 2016 - 2021 నడుమ తమ దేశం ఇచ్చిన 2.3 బిలియన్ పౌండ్లను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయడం అతడి జాత్యహంకారాన్నే కాదు కుళ్లు మోతుతనాన్ని కూడా బయటపెడుతోంది. పైగా, భారత్‌లో ఇంకా 700 మిలియన్ల మంది బహిర్గత మల విసర్జన చేస్తారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అతడి అజ్ఞానానికి అద్దం పట్టేవిగానే ఉన్నాయి.

వాస్తవానికి, బీబీసీ ఏడుపును మనం విస్మరించ వచ్చు. ఎందుకంటే, మన వారి కన్నా ఇప్పుడు ఉన్నత స్థాయిలో ఉన్నాం. కానీ ఆనంద్ మహేంద్ర మాత్రం ఊరుకోలేకపోయారు. మహేంద్ర గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహేంద్ర ట్విట్టర్‌లో దీనిపై తీవ్రంగా స్పందిస్తూ, భారత్ దరిద్రంలో కూరుకుపోవడానికి కారణం మీ దోపిడీనే అంటూ ధ్వజమెత్తారు. అంతేకాదు, భారత్ బంగారు చిలుక అని తెలిసే వచ్చిన బ్రిటిష్ దోచుకున్న సంపదలో అత్యంత విలువైనది కోహినూర్ వజ్రం కాదని, భారతీయుల 'ఆత్మగౌరవాన్ని, మా సామార్థ్యాల పై మాకు గల నమ్మకాన్ని' అంటూ తీవ్రంగా సమాధానం చెప్పారు. తాము దోచుకున్నవారు హీనులన్న భావనను కల్పించడమే సామ్రాజ్యవాద దేశ లక్ష్యంగా ఉంటుందని, అందుకే తాము అటు టాయిలెట్ లోనూ, ఇటు అంతరిక్ష పరిశోధనలోనూ పెట్టుబడి పెడుతు న్నామని, ఇది వైరుధ్యం కాదని ఆయన

జవాబిచ్చారు. చంద్రుడిపైకి వెళ్లడమన్నది మా ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పునరుద్ధరించుకోవడానికే, విజ్ఞానం ద్వారా పురోగతి సాధ్యమన్న భావనను అది సృష్టిస్తుంది. అంతేకాదు, అతి గొప్ప దారిద్ర్యం 'భావ దారిద్ర్యం, ఆకాంక్షలు లేకపోవడం' అని ఎడాపెడా పాట్రిక్‌ను వాయించేశారు.

ఇక సాధారణ ప్రజలు అయితే, భారత్ నుంచి దోచుకున్న 45ట్రిలియన్లకు పైగా సంపదతో దేశాన్ని నిర్మించుకున్నప్పటికీ, వారి దేశంలో పెరుగుతున్న దారిద్ర్యం, ఆరోగ్య వ్యవస్థలు తిరోగమనం, అక్కడి గ్రూమింగ్ గ్యాంగ్స్, మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న అత్యాచారాలను పట్టి చూపుతున్నారు. అంతేనా? ఇక్కడి దేశ సంపదను దోచుకుని సంపన్నులైనా, బీబీసీ వంటి సంస్థలు భారత్‌లో పన్ను ఎగవేసి మర్యాదస్తుల వలె చెలామణి అవుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఆరోపణల, విమర్శల వర్షం కురిపించారు.

విదేశాలు సరే, స్వదేశంలోనూ
విపక్షాల అసంతృప్తి

తప్పని తద్దినం అన్నట్టుగా చంద్రయాన్ 3 విజయాన్ని అభినందిస్తూనే మన ప్రతిపక్షాలు దాన్ని రాజకీయచేయడం ప్రారంభించాయి. ఇదంతా, ప్రథమ ప్రధాని నెహ్రూ చలవ వల్లే జరిగింది తప్ప అటు శాస్త్రవేత్తలకు కానీ, ఇటు వారిని ప్రోత్సహించిన ప్రభుత్వానికి గానీ ఎటువంటి గొప్పదనాన్ని ఆపాదించడానికి వీలులేదన్నట్టుగా వారి మాటల సరళి ఉంది.

నిజమే, నెహ్రూ ఇస్రో సంస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కానీ, అది ఆయనకు స్వయంగా వచ్చిన ఆలోచన కాదు కదా? మానవాళికి సేవలందించేందుకు అంతరిక్ష సాంకేతికతను ఉపయోగించడం కోసం ఒక అంతరిక్ష సంస్థ ఉండాలని డాక్టర్ విక్రమ్ సారాభాయ్ పోరగా ఏర్పడిన సంస్థ ఇది. అలా అంతరిక్ష సాంకేతిక ద్వారా సామాన్యులకు కూడా ప్రయోజనం చేకూర్చవచ్చన్న ఆలోచనను ఇచ్చింది విక్రమ్ సారాభాయ్ కనుకనే, ఈసారి ల్యాండర్‌కు 'విక్రమ్' అని పేరు పెట్టారు. అయితే, పక్కవారి గొప్పతనాన్ని, ప్రతిభను ఓర్వలేని కాంగ్రెస్ పార్టీ నెహ్రూ జపాన్ని ప్రారంభించింది.

ముత్తయ్య వనిత, రీతు కరిదాల్, కల్పన కె.

ఇంతటి గొప్ప ఘట్టాలు జరిగినప్పుడు, దానిని రాజకీయ కోణం నుంచి కాక దేశ ఔన్నత్యం, వైభవం కోణం నుంచి చూడటం మన ప్రతిపక్షాలు నేర్చుకోవాలి. ప్రధాని మోదీ పట్ల తమకుగల గుడ్డి ద్వేషాన్ని దేశానికే వ్యతిరేకంగా అనువర్తింప చేస్తుంటే ప్రజలు గమనించరనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. ప్రతి పౌరుడూ భారత్ సాధించిన విజయానికి గర్వ పడుతున్న వేళ, ప్రతిపక్షాలు ఇటువంటి రాజకీయాలు చేయడం చౌకబారుతనం, నేలబారుతనమే అవుతుంది.

మూడవ వరుస నుంచి మొదటి వరుసకు

నేడు వాణిజ్యం నుంచి సాంకేతికత వరకు భారత దేశాన్ని మొదటి శ్రేణిలో ఉన్న దేశంగా ప్రపంచం పరిగణిస్తోందని ప్రధాని అన్నారు. మూడవ వరుస నుంచి మొదటి వరుసకు చేసిన ప్రయాణంలో, 'ఇస్రో' వంటి సంస్థలు భారీ పాత్రను పోషించాయంటూ ప్రధాని మోదీ ఆ సంస్థను, అందులో పని చేస్తున్న శాస్త్రవేత్తలను ప్రశంసించారు.

ఆగస్టు 23 జాతీయ అంతరిక్ష దినోత్సవం

ఇంతటి ఘనవిజయం సాధించిన రోజైన 'ఆగస్టు 23ను జాతీయ అంతరిక్ష దినోత్సవం'గా ప్రకటించారు ప్రధాని. ఆ రోజున చంద్రుడిపై భారతదేశం తన జాతీయ జెండాను ఎగురవేసింది. కనుక, ఇప్పటి నుంచీ అది భారత్‌లో జాతీయ అంతరిక్ష దినోత్సవం అని ప్రధాని అన్నారు.

శివశక్తి పాయింట్

అలాగే, విక్రం ల్యాండర్ దిగిన ప్రదేశానికి 'శివశక్తి పాయింట్' అని ఆయన నామకరణం చేశారు. 'శివ్ కీ బాత్ హోతీ హై తో శుభం హోతా హై ఔర్ శక్తి కీ బాత్ హోతీ హై తో మేరే దేశ్ కె నారీ శక్తీ కీ బాత్ హోతీ హై' (శివుడిని తలచుకుంటే శుభం జరుగుతుంది, శక్తిని తలచుకుంటే నా దేశపు నారీ శక్తిని గురించి తలచుకోవడం జరుగుతుంది) అంటూ చంద్రయాన్ 3లో మహిళా శాస్త్రవేత్తలు కీలక పాత్ర పోషించడాన్ని పట్టి చూపుతూ వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ శివశక్తి పాయింట్ అన్నది భవిష్యత్ తరాలు ప్రజా సంక్షేమం కోసం సైన్సును ఉపయోగించేందుకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. ప్రజా సంక్షేమమే తమ అత్యున్నత నిబద్ధత అని పీఎం మోదీ స్పష్టం చేశారు.

ప్రపంచానికి వెలుగునిచ్చేందుకే...

చంద్రుడి చీకటి కోణంగా భావించే దక్షిణ ధ్రువ ప్రాంతంపై చంద్రయాన్ 3 దిగడాన్ని ప్రస్తావిస్తూ, భారత్ ఎప్పుడూ ప్రత్యేకంగా ఆలోచించి, ప్రపంచాన్ని ప్రకాశింప చేసేందుకు ఇటువంటి అంధకార ప్రదేశాలకు వెడుతుందని మోదీ అన్నారు. వినూత్నంగా, ప్రత్యేకంగా ఆలోచించడమే భారత విశిష్టత అని అన్నారు. ప్రపంచమంతా వెలుగును



ప్రసరింపచేస్తూ ప్రకాశాన్నిచ్చేందుకు అంధకారమైన ప్రదేశాలకు వెళ్లే దేశం భారతదేశమని అన్నారు.

వైఫల్యమే అంతిమం కాదు

చంద్రుడి ఉపరితలంపై చంద్రయాన్ 2 కుప్పకూలి, తన జాడలను వదిలిన ప్రదేశానికి ప్రధాని 'తిరంగా' అని పేరుపెట్టారు. వైఫల్యమే అంతిమం కాదనే విషయాన్ని అది మనకు గుర్తు చేస్తుందని అన్నారు. 2019లో ప్రయోగించిన చంద్రయాన్ 2 మిషన్ చంద్రుడిపై కుప్పకూలడంతో పూర్తిగా విజయవంతం కాలేదు. ఒకరకంగా చెప్పాలంటే, ఇది పాక్షికంగా విజయవంతమైంది. దాని ఆర్బిటర్ చంద్రుడి కక్ష్యలో విజయవంతంగా నిలువగలగడమే కాక ప్రస్తుతం విక్రం ల్యాండర్‌కు సంబంధించిన డాటాను భూమికి పంపడంలో తోడ్పడుతోంది. వాస్తవానికి చంద్రయాన్ 3 మిషన్ చంద్రుడి ఉపరితలంపై కాలిడే ముందే, చంద్రయాన్ 2 దానిని పలకరించడంతో శాస్త్రవేత్తలు ఉద్వేగానికి గురైన విషయం తెలిసిందే.

ప్రధాని ఇస్తున్న ప్రోత్సాహంతో ఆనందంతో తల మునకలవుతున్న శాస్త్రవేత్తలు 'మిషన్ గగన్‌యాన్'కు తాము సిద్ధంగా ఉన్నామంటున్నారు. ఇప్పటికే గగనయాన్ కోసం పని జరుగుతోందని, ఈ ప్రయోగం కోసం ఉపయోగించే ఉపగ్రహం మార్క్ 3 సిద్ధమవుతోందని, దానిని మరింత బలోపేతం చేసే ప్రక్రియ కూడా సాగుతోందని, అన్ని వ్యవస్థలను అభివృద్ధి చేశారని, గగన్‌యాన్‌కు కూడా అందరి తోడ్పాటునూ కోరుతున్నామంటూ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

రోవర్‌కు తప్పిన ప్రమాదం

ప్రస్తుతం చంద్రుడి మీద పరిశోధనలు చేస్తున్న రోవర్ ఆగస్ట్ 28న చిన్న గండం నుంచి గట్టెక్కింది. ల్యాండర్ నుంచి విడులైన రోవర్ ఒక బిలంలో పడబోయి తృటిలో తప్పుకుంది. దాదాపు నాలుగు మీటర్ల వెడల్పయిన బిలాన్ని గుర్తించింది. ఆ బిలానికి మూడు మీటర్ల దూరంలో ఉండగానే రోవర్ గుర్తించింది. ఇస్రో నుంచి వచ్చిన ఆదేశాల మేరకు బిలాన్ని తప్పించుకుని మరొక మార్గంలోకి రోవర్ మళ్లింది.

ఇప్పుడు సురక్షితమైన బాటలో ముందుకు నడుస్తున్నది. మొత్తం 14 రోజులు అక్కడ ఇది పరిశోధన చేస్తుంది.

ఇది అద్భుతం

చంద్రయాన్-3 విజయం అంటే అంతరిక్ష అన్వేషణలో భారత్ సాధించిన పురోగతికి ఇది నిదర్శనమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ వ్యాఖ్యానించారు. ఈ విజయం శాస్త్ర, సాంకేతిక రంగాలలో భారత్ సాధించిన అద్భుత పురోగతికి కూడా అద్దం పడుతుందని ఆయన అన్నారు. ఇంతటి విజయం సాధించినందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీలకు అభినందనలు అన్నారు పుతిన్.



కొసమెరుపు

చంద్రుడి మీదకు ఆగస్ట్ 23న రోవర్‌ను పంపించిన ఇస్రో వారం రోజులకే సూర్యుడి గురించి పరిశోధనలకు శ్రీకారం చుట్టబోతున్నది. సౌర వాతావరణం గురించిన అధ్యయనం కోసం సెప్టెంబర్ 2, 2023నే ఆదిత్య-ఎల్ 1ఉపగ్రహాన్ని శ్రీహరికోట నుంచి ప్రయోగించబోతున్నది. ఆ రోజు ఉదయం 11.50 నిమిషాలకు ఆ ఉపగ్రహం తన ప్రయాణం ప్రారంభిస్తుంది. పీఎస్ఎల్వి-సీ 57 రాకెట్ ద్వారా ఈ ప్రయోగం జరుగుతుంది. ఆదిత్య ఎల్ 1ను మొదట జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి పంపుతారు. తరువాత భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న లాంగ్ రేంజియన్ పాయింట్ 1(ఎల్ 1) లోకి మళ్లిస్తారు. భూమి నుంచి లాంగ్ రేంజ్ పాయింట్‌కు చేరడానికి 175 రోజులు పడుతుంది. దీని సాయంతో సౌర కొరోనాతో పాటు సూర్యుడి నుంచి ప్రసరించే అతి శక్తిమంతమైన కాంతి కిరణాల ప్రభావం, సౌర మండలంలోని గాలులపైనా అధ్యయనం చేస్తారు. ఆదిత్య ఎల్ 1 కూడా పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో రూపొందించారు.

దాదాపు 1500 కిలోల బరువు ఉండే ఈ ఉపగ్రహంలో ఏడు పేలోడ్లు ఉంటాయి. దీనిని బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ ఆధ్వర్యంలో విజిబుల్ ఎమిషన్ లైన్ కొరోనాగ్రాఫ్ పేలోడ్‌ను తయారు చేసింది. పుణేలోని ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ అస్ట్రానమి అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ శాస్త్రవేత్తలు సోలార్ అల్ట్రా వయోలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్‌ను తయారు చేశారు. సూర్యుడి ఉపరితలం మీద 6 వేల డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత ఉంటుంది. అయితే కొరోనా వద్ద 10 లక్షల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు ఉంటాయి. అక్కడి ఆ ఉష్ణోగ్రతలలోని వ్యత్యాసానికి ఉన్న కారణాలను ఈ పరిశోధన అన్వేషిస్తుంది.

చంద్రుడు, సూర్యుడు పంచభూతాలలో కీలకమైన వ్యవస్థలు. అటు ఆధ్యాత్మికంగా, ఇటు పర్యావరణ పరంగా వాటి ఉనికి, ప్రాధాన్యం ఎనలేనివి. అందుకే వాటి గురించి పరిశోధన చేయాలన్న తృష్ణ బయలుదేరింది. ఇలాంటి ప్రయత్నం ఏ విధంగా చూసినా సాహసోపేతమైనది. కానీ పరిశోధన చేయాలి. అందులో భాగమే ఇదంతా.

★

శివశక్తి.. ప్రపంచమంతటా మారుమోగిన భారతీయ వనితాయుక్తి. శాస్త్ర సాంకేతిక పరమోన్నతికి యోగత్వ జోడింపు! మనందరికీ తెలిసిందే. 'శివ' అనేది శుభసూచిక. శక్తి అనే పదాన్ని నారీ లోకానికి వర్తింపచేస్తున్నాం. అందుకే చంద్రయాన్-3 దిగిన ప్రదేశానికి 'శివశక్తి' పేరును సూచించారు ప్రధాని నరేంద్రమోదీ. చందమామ దక్షిణధ్రువం మీద ల్యాండర్ దిగిన ప్రదేశమంతా ఇక నుంచి ఆ విధమైన ప్రఖ్యాతినే అందుకుంటుందన్నారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సాధించిన పరమాద్భుత విజయానికి గుర్తుగా ఏటా ఆగష్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవ శోభ వెల్లివిరియాలన్నదీ ఆయన అంతరంగ భావం. సంస్థకు చెందిన టెలిమెట్రీ ట్రాకింగ్ - కమాండ్ నెట్‌వర్క్ సెంటర్ (బెంగళూరు)లోని శాస్త్రవేత్తలతో సమావేశమైనప్పుడు, తనతో పాటు ఆ అందరిలోనూ ఎంతో భావోద్విగ్నత. శాస్త్ర సాంకేతిక సంబంధమైన ప్రతీ ఆలోచనకీ కుడి ఎడమల దన్నుగా నిలవాల్సింది సాహస ప్రవృత్తి, మానవతా అభవ్యక్తి. వాటి ఆధారంతోనే నవభారత జయపతాక కీర్తి సంపన్నత నింగినంటిందంటూ వేదికపైన, ఎదురుగానూ కరతాళధ్వనుల హోరు. ప్రత్యేకించి మహిళా శాస్త్రవేత్తలూ, సిబ్బందీ తమ నిబద్ధతకు ఎంత గుర్తింపునందుకున్నారో అనిర్వచనీయం. 'ప్రాజెక్టు ఘనాతిఘన ప్రశంస సాధించడానికి మీరందరూ మూలకారకులు' అంటూ ప్రధాని చేతుల మోడ్చినప్పుడు, ఆ సమావేశ ప్రాంగణమంతా ప్రతిధ్వనించిన నినాదం 'జై విజ్ఞాన్'. ఆ వెంటనే వినవచ్చిన నాదం 'జై అనుసంధాన్.'

అంతరిక్ష విజయంలో

వివిధ అర్థాల సమాహారం 'శివ'. గ్రహ యోగం. వేదం, తారాజువ్వ. వీటి ప్రత్యేకతలను మేళవించి చూసినప్పుడు, మూడింటికీ భారతీయతతో ఉన్న అనుబంధం మరింత ప్రస్ఫుటమవుతుంది. ప్రాచీన గ్రంథాలను, పరిశోధన అంశాలను సమీక్షించి చూసుకుంటే ఖగోళ విశిష్టత మన ఎదుట ప్రత్యక్షమై తీరుతుంది. ప్రయోగాల సత్ఫలితాలు దేశ వ్యవసాయ, వైద్య, విద్యా రంగాలకు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి సాధనకు అవే బంగరు బాటలు వేస్తాయి. మరీ ముఖ్యంగా ల్యాండర్ పేర్లలోనే విక్రమ్, ప్రజ్ఞాన్ - రెండూ ఉన్నాయి. నామకరణాలే వీటి విశిష్టతను తేటతెల్లం చేస్తున్నాయి. ప్రయోగ క్రతువుకు పరిశ్రమించినవారిలో సంస్థ డైరెక్టర్ల పరంగా కల్పన ఒకరు. ఈమెది చిత్తూరు పరిసర ప్రాంతాల్లోని తడుకుపేట. చెన్నైలో ఉన్నత విద్యాభ్యాసం. ఇస్రోలో చేరి దాదాపు పాతికేళ్లు. మొదట శ్రీహరికోటలోనే బాధ్యతల నిర్వహణ. అటు తర్వాత బెంగళూరుకు బదిలీ. మునుపు చంద్రయాన్-2లో కూడా తనదే కీలకపాత్ర. మరొక శాస్త్రజ్ఞురాలు నందిని. కర్ణాటక వాస్తవ్యురాలు. చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియ నిర్వహణను చేపట్టినవారిలో ఒకరు. వేరొకరు సుమన సైతం కర్ణాటక ప్రాంతీయురాలు. బాల్యం నుంచీ అంతరిక్ష పరిజ్ఞానం అలవరచుకుని వేగంగా పెంపొందించుకున్నారు. నాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం నుంచి 'యువశాస్త్రవేత్త ప్రత్యేక పురస్కారం' అందుకున్న రీతూ సైతం ఇప్పుడు తనవంతు పాత్రను సమర్థంగా పరిపోషించారు. వీరందరిలోనూ ఐదు ఉపగ్రహాల రూపకల్పనలో భాగస్వామ్యం వహించిన కల్పనకు విశిష్ట పురస్కృతి లభించింది. మధ్య తరగతి కుటుంబంలో పుట్టి, శాస్త్రీయ దృక్పథం మీద ఎంతో మక్కువ పెంచుకుని, సమున్నతంగా రాణించిన రీతూకి సీనియర్ ఉన్నతాధికారుల ప్రశంసలు విశేషంగా లభించాయి. వృత్తిగత విజయాలకు మూలబలం కుటుంబమే అని సభాముఖంగా ప్రకటించారు ఆ 'రాకెట్ విమెన్.'

ఎందరెందరో మహిళామణులు

ఇస్రోలోనే స్పేస్ సైన్స్ ప్రోగ్రామ్ డైరెక్టరుగా విధులు నిర్వర్తించిన వారు సీతా సోమసుందరం. అంకితభావం, నిబద్ధత సహజ సిద్ధంగానే పడతులకు ఉంటాయని ఎప్పుడూ చెప్తుంటారు. ఇదివరలో ఒక ప్రాజెక్టు డైరెక్టరుగా పనిచేసిన అరుణ అనుభవం

భారతీయ 'శివశక్తి'

ప్రకారం – స్త్రీలదే దీక్షాదక్షత. ఒక్క మిషన్ అనే కాదు – నేవిగేషన్, కమ్యూనికేషన్, కంట్రోల్ సిస్టమ్, స్పేస్ క్రాఫ్ట్ డిజైన్ వంటి మేజర్ ఏరియాల్లోనూ నారీమణులు ప్రభావశీలపాత్ర పోషిస్తున్నారని ఆమె విపులీకరించారు. అదేవిధంగా మాధురి. ఆమె షార్‌లోనే డిప్యూటీ మేనేజర్. రాకెట్ ప్రయోగ సమయాల్లో వివరణాత్మక వ్యాఖ్యానాలు ఆమెవే! అందరికీ వినిపించే స్వరం. ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్‌లో ఇంజనీరుగా ఉంటున్న 'వనిత' గతంలోనూ పలు అంతరిక్ష మిషన్లలో సహాయ సహకారాలు అందించివారే. నావిగేషన్ అంశాల అభివృద్ధి, విస్తరణ ప్రక్రియల్లో కీలక పాత్రధారిణి. టీమ్ ఆఫ్ ఎక్సలెన్స్ బహూకృతి విజేత. మునుపటి కాలంలో జీశాట్ శ్రేణి కమ్యూనికేషన్ ఉపగ్రహాల విధుల నిర్వాహకు రాలు. ఎలక్ట్రికల్ ఇంజనీరు హోదాలోని అనురాధకు రెండు దశాబ్దాల వృత్తి అనుభవముంది. డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గానూ పనిచేశారు, విస్తృత కృషిని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. మొత్తంమీద చంద్రయాన్-3 మిషన్‌లో ఉన్న మహిళామణులు యాభైమందికి పైమాటే. ఎవరు ఏ హోదాలో ఉన్నా, ఏ స్థాయిలో పనిచేస్తున్నా వృత్తిపట్ల పూర్తిస్థాయి గౌరవం, ఆదరం, అభిమానం. తెలుగు శాస్త్రవేత్తల్లో సీనియర్లతో పాటు యువ నిపుణులూ అనేకమంది. వారిలోని చందన గతంలో ఇస్రో నిర్వహించిన పోటీ ప్రవేశ పరీక్షల విజేత. ఇప్పుడు బెంగళూరులోని శాటిలైట్ కేంద్రంలో ల్యాండర్ డిజైనర్ విభాగ రూపకర్తల్లో ఒకరిగా ఉంటున్నారు. సహచరుల అందదండలు, ఉత్సాహ ప్రోత్సాహాలతో ఎన్ని విజయాలైనా సులభ సాధ్యాలే అంటున్నారీమె. పలు ఉదాహరణలనీ సభల్లో ప్రస్తావిస్తున్నారు.

కలలకు సాకారం

అంతరిక్ష రంగం గురించి విశదీకరించాలంటే, లలితాంబిక పేరును తప్పకుండా చెప్పి తీరాలి. ఇదివరలో భారతీయ వ్యోమగాములను రూపుదిద్దిన మిషన్‌కి ఈమె డైరెక్టర్. ఇస్రోలో చేరడానికి ముందు విక్రమ్ స్పేస్ సెంటర్‌లో పనిచేసిన అనుభవముంది. అక్కడ ఉన్నప్పుడే నియంత్రణ, మార్గదర్శక విభాగాల పనులను పర్యవేక్షిస్తూ వచ్చారు. మేక్ ఇన్ ఇండియా పరిశోధనల్లో మేటిగా ఉంటున్న మౌమిత ప్రత్యేక

జంధ్యాల శరత్‌బాబు
సీనియర్ జర్నలిస్ట్

నిపుణురాలు. రెండు కీలక మిషన్లు (మార్స్ ఆర్బిటల్, చంద్రయాన్-3) ఈమె నిరంతర కృషితోనే పరివ్యాప్తమయ్యాయి. అనేక వత్సరాల ప్రయోగాల అనుభవశాలిని నందిని అంచెలంచెలుగా హోదాలు అందుకుంటూ వస్తున్నారు. డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్, ప్రాజెక్టు మేనేజర్, మిషన్ డిజైనర్... మరెన్నో బాధ్యతలు వహించినవారు. అసోం ప్రాంతీయురాలు నాజిన్ యాస్మిన్ –రాడార్ ట్రాకింగ్ అనుభవజ్ఞురాలు. ఎంతెంతో కఠినమైన ఎంపిక పరీక్షల్లో విజయాలు సాధించిన ప్రతిభాశాలిని. తొలి నుంచీ చదువుల్లో ముందుండేవారు. అత్యధిక మార్కులతో ప్రథమశ్రేణులు సంపాదించిన విజ్ఞురాలు. మునుపు వివిధ శాస్త్రీయ సంస్థల్లో ప్రైవేటు ఉద్యోగాలు చేసిన వ్యక్తి. విశ్వవిద్యాలయాల నిధుల సంఘం నిర్వహించిన జాతీయ స్థాయి అర్హత పరీక్షల్లోనూ మేటితనం కనబరచారు. అంతే కాకుండా, భారత ప్రభుత్వం నుంచి 2 రీసెర్చి ఫెలోషిప్ యోగ్యత అందుకున్నారు. ఇస్రో శాస్త్రకారిణుల్లో పలువురు... తొలి మహిళా వ్యోమగామి కల్పన గురించే సంభాషించుకుంటూ ఉంటారు. ఆ లలన స్ఫూర్తిగా తాము కూడా కీర్తిశిఖరాలు చేరుకోవాలని కలలు కంటుంటారు. వాటిని సాకారం చేసుకునేందుకు నిత్యమూ ప్రయత్నించడమే అలవాటుగా మలచుకున్నారు వీరంతా.

సృజన కల్పన

అప్పటికీ ఇప్పటికీ సాటిలేని మేటి కల్పనాచావ్లా. వ్యోమనౌక యంత్ర నిపుణ. వందల గంటలపాటు అంతరిక్షంలో గడిపిన సాహసి. రెండోసారి అంతరిక్షంలోకి వెళ్లేముందు, ఒక సమావేశంలో 'మహిళలకు నా విన్నపం ఒక్కటే. మీకు నిర్దేశించిన పనిని శాస్త్ర సాంకేతికపరంగా మనసుపెట్టి మరీ చేయండి. లక్ష్యం కోసం పనిచేయడంలో సంతృప్తి, సంతోషం రెండూ ఉంటాయి. కేవలం నిర్దేశించుకుంటే సరిపోదు. అది ఆచరణకు వచ్చేలా పరిశ్రమించాల్సిన బాధ్యత వనితలమీదనే ఉంటుంది. అలాకాకుండా, కేవలం ఆశించడంవల్ల ఎటువంటి ప్రయోజనమూ సిద్ధించదు. ఆశయాన్ని నెరవేర్చుకునే సహజశక్తిని స్త్రీలు వినియోగించుకోవాలి' అన్న ఆమె మాటలను గుర్తుచేసుకోవడం నేడు ఎంతైన సందర్భోచితం.

ఈ వాక్యాలనే ఇస్రో వనితాశాస్త్రవేత్తల ప్రత్యేక సదస్సులో ఇటీవల ప్రదర్శించడం తెర వెలుగునింపింది. ఆ అక్షరాల తళతళలతో వేదిక మరింత శోభాయమానంగా రూపుదిద్దుకుంది. తెర ముందూ వెనకా కూడా సమర్థపాత్ర నిర్వర్తించే ఇస్రో శాస్త్ర వేత్తలందరూ శివశక్తికి ప్రతీకలు. వారి నిర్వరామ కృషి కొనసాగింపుతోనే జాతికి, విక్రమం, ప్రజ్ఞానం. వారందరిని 'జై విజ్ఞాన్, జై అనుసంధాన్' అంటూ మనమూ ఈ శుభసందర్భాన సంభావిద్దాం! ★

పాపానికి పరిహారం 'అహల్య' శాపం

రామాయణంలో కొన్ని పాత్రలు కొద్దిసేపే కనిపిస్తాయి. అయితే వాటి ప్రభావం మాత్రం కావ్య మంతటా కనిపిస్తుంది. అటువంటి వాటిలో అహల్య పాత్ర కీలకమైనది. ఎంతటి వారైనా పొరబాటు చేస్తే శిక్షార్హులనడానికి ఈ పాత్రను ఉదాహరణగా చెబుతారు.

ఈ పాత్ర మీద ఉన్నన్ని కల్పనలు, వాస్త వావస్తవాలు మరే పాత్రలోనూ కనిపించవంటే అతిశయోక్తి కాదు. కొందరు అహల్యదే తప్పంటే, జరిగిన దానిలో ఆమె దోషం లవలేశమంతయినా కనిపించదని మరికొందరంటారు. అంటే...ఆయా రచయితలను దృక్కోణాలను బట్టి ఆయా గుణ దోషాలు ఆపాదించారని అర్థమవుతోంది. అందరికీ తెలిసినది, కాల్పనిక సాహిత్యంలో కనిపించేదీ రాముని పాదధూళి సోకి రాయి అహల్యగా మారిందనే. దీనికి సమర్థింపుగా మొల్ల రామా యణంలో కూడా గుహుడు రాముడిని పడవలోకి ఆహ్వానిస్తూ 'క్షాళయామి తవపాద పంకజం' అంటాడు. 'నీ పాదధూళి సోకితే నా పడవలోని రాళ్లూరప్పలూ కూడా స్త్రీలుగా మారిపోతే, ఇక నా గతి ఏంగాను' అనే చమత్కృతి అందులో కనిపిస్తుంది. తిండీనీళ్లూ నిద్రా వంటివేమీ లేకుండా, లోకంలోని మంచి చెడులను గుర్తించలేకుండా పాషాణం పడి ఉండమని మాత్రమే గౌతముడు తన సతి అహల్యను శపించాడని, రాముని గాలి సోకడంతోనే ఆమె తిరిగి జీవం పోసుకుంటుందని మరో రామాయణ గాథ వివరిస్తుంది.అహల్యా శాపవిమోచనంలోని పూర్వాపరాలను అవలోకిస్తే....

దేవకార్యం కోసం ఇంద్రుడు అహల్యను చేరాడు. గౌతముడు కోపించాడు శపించాడు. రామచంద్రుడు, ఉద్ధరించాడు. తపించిన అహల్య అగ్నిశిఖలా ప్రజ్వరిల్లింది. ఇందులో వాల్మీకి మహర్షి ఆంతర్యం అత్యంత నిగూఢం. అతి పవిత్రం కూడా.

'హల'మనగా నాగలి. సీత నాగేటి చాలు. అనగా నాగలిచే ఏర్పడింది. అహల్యా గౌతముల పునస్స మాగమం తర్వాతే సీతారామ కళ్యాణం జరగాలన్నది ఆదికవి ఆంతర్యం కావచ్చు.

యాగ సంరక్షణ కోసం విశ్వామిత్రుని వెంట రామలక్ష్మణులు అడవులకు బయలుదేరారు. మార్గాయానం లేకుండా విశ్వామిత్రుడు వారికి

❋ పెరటి బంగారం ❋

ఆరోగ్యానికి అండ దొండ

'పెరటిచెట్టు వైద్యానికి పనికిరాదన్న సామెతను పక్కన పెడితే, మన పెరడులో పండే కూరగాయల్లో, ఆకుకూరల్లో, తీగజాతి మొక్కల్లో ఎన్నో ఔషధగుణాలు న్నాయని ఆయుర్వేద శాస్త్రం చెబుతోంది. అలాంటి పెరటి చెట్లలో దొండతీగ ఒకటి. పూర్వం ఇంచుమించు ప్రతి ఇంటిలోనూ దొండపాదు లేదా దొండ తీగ ఉండేది. పథ్యానికి దొండ మంచి మందు. బాలింతలకు, జబ్బుపడి తగ్గిన వారికి కూడా దొండకాయ కూర చేసిపెడతారు పెద్దలు. పూర్వం పసికందులకు కూడా దొండాకు పసరు తాగించేవారు. దానివల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగు తుందని, వాతవ్యాధులు సోకవని వారి నమ్మకం. అందుకే 'కొట్టానం టే చిన్నప్పుడు తాగిన దొండాకు పసరు కూడా కక్కుకుంటావు' అనే తిట్టు కూడా ఉంది. ఆకాశరాజు సోదరుడు తొండమాన్ చక్రవర్తి దొండపాదులో పుట్టాడని దొండమాను అని పేరు పెట్టారు. అదే క్రమేణా తొండమానుగా మారింది.



దారిపొడుగూతా అనేక కథలు, గాథలు చెబు తుంటాడు. రామలక్ష్మణులు తమకు కుతూహలం కలిగించిన ప్రదేశాలు, పరిసరాల గురించి ఆ మునిని అనేక ప్రశ్నలడుగుతుంటారు. ఆ కథలు, కబుర్లతోనూ, ప్రశ్నలతోను దారితరిగి పోతూ... కాలం గడచిపోతూ ఉంటే మిథిలోపవన ప్రాంతానికి చేరతారు. వన్నెతరిగిన బంగారంలా, మేఘావృతమైన చంద్రబింబంలా, మాసిన అద్దంలోని ప్రతిబింబంలా అణగారిన కాంతితో ప్రకాశిస్తున్న గౌతమాశ్రమాన్ని చూచి, ఆ ఆశ్రమ గాథ ఏమిటని విశ్వామిత్రుని ప్రశ్నించాడు శ్రీరామచంద్రుడు. విశ్వామిత్రుడు ఒక నిట్టూర్పు విడుస్తాడు. ఇంతలోనే ఆ ఆశ్రమంలో కాలుపెడతారు ఆ ముప్పురూ. అంతే!

శ్రీరాముని పాదధూళి సోకడంతోటే పాషా ణంలా పడి ఉన్న అహల్యకు అసలు రూపం వస్తుంది. గౌతమాశ్రమంలో కలకూజితాలు ధ్వనించాయి. ఫలవృక్షాలు చిగిర్చి పుష్పించి, ఫలవంతాలు కాగా పూబాలలు శిరసులూపి అతిథులను ఆహ్వానిస్తున్నాయి. ఉగ్ర తేజస్సంపన్నుడైన గౌతమ మహర్షి ఆశ్రమంలోకి ప్రవేశించాడు. ఆ పుణ్యదంపతులకు పాదాభి వందనం చేసి, వారి ఆశీస్సులను పొంది, మిథిలకు ప్రయాణమయ్యారు రామలక్ష్మణులు.

మిథిలలో ప్రవేశించిన రాముడు శ్రీరాముడై కళ్యాణ రాముడైనాడు. గౌతమాశ్రమంలో దంపతీ పూజ చేయించి పెళ్లికొడుకుగా రాముని మిథిలా నగరంలోకి ప్రవేశింపజేశారు వాల్మీకి. ఇది ధర్మయుత ఆర్షసంస్కృతికి చిహ్నంగా భాసించింది. తన తల్లిదండ్రులను కలిపిన పరంధాముడు రాముడిని పూజించాడు శతానందుడు (గౌతమ, అహల్యల కుమారుడు). సీతను రామునకిచ్చు నట్లుగా ఏర్పరచి దైవరుణం తీర్చుకున్నాడు. రఘు రాముడు సీతారాముడు కాగా లక్ష్మణుడు ఊర్మిళాపేతుడు అయినాడు. ఇది వాల్మీకి మహర్షి రచన.ఎవరికైనా ఉండవలసిన నైతికవర్తనను, దానిపై సమాజానికున్న బాధ్యతను తెలియజెప్పడానికి ధర్మ ప్రబోధాత్మకంగా అహల్యా వృత్తాంతాన్ని రాశారు. అహల్యాజారుడైన ఇంద్రుని శపించి, అహల్యను సైతం "వాయుభక్షా నిరాహారా తప్యంతీ భస్మశాయినీ" అంటూ అదృశ్యగా పెక్కేండ్లు తపించి, రామచంద్రుని పాదస్పర్శచే పవిత్రీకృతగాత్ర కావలసిందని వాల్మీకంలో గౌతముని ఆజ్ఞ. కానీ, అధ్యాత్మిక రామా యణం అహల్య రాయిగా మారినట్లు పేర్కొంది.

శాపగ్రస్థ అయిన అహల్యను తిరిగి మామూలు మనిషిని చేయడంలో రాముని మహిమను, ఔన్నత్యాన్ని వర్ణిస్తూ పురాణ గాథలనేకం ఉన్నాయి. ఏది ఏమైనా బ్రహ్మమానస పుత్రికయైనా, మహర్షి పత్నియైనా తప్పుచేస్తే శిక్ష తప్పదన్న హెచ్చరిక, ధర్మ ప్రకటన మహర్షి ఉద్దేశ్యం. ★

దొండకాయలో ఎన్నో ఔషధ గుణాలున్నాయని ఆయుర్వేద వైద్య శాస్త్రం చెపుతుంది. దొండలో విటమిన్లు, ఖనిజాలు, పీచు పదార్థాలు పుష్కలంగా ఉంటాయి.

వీటిలో గల యాంటీ బ్యాక్టీరియల్ గుణాల వల్ల జలుబు, దగ్గు దరిచేరవు. ఇందులోని బి-విటమిన్ నాడీవ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. ఆందోళన, మూర్ఛ వ్యాధులతో బాధపడేవాళ్లకి ఇది బాగా పనిచేస్తుంది. రిబోఫ్లేవిన్ ఎక్కువగా ఉండే దొండ మనసును ప్రశాంతంగా ఉంచి, డిప్రెషన్ తగ్గడానికి దోహదపడుతుంది. రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గించేందుకూ దోహదపడతాయి. ఈ కాయల్లోని కాల్షియం మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా రక్షిస్తుంది. ఎముక సాంద్రత పెరిగేందుకూ తోడ్పడుతుంది. దీని ఆకుల పేస్టును రోజూ మాత్రల్లా వాడితే బ్యాక్టీ రియాతో ఏర్పడే చర్మ సమస్యలు ఉండవు. ఆకులు లేదా ఈ ఆకుల రసాన్ని 30 గ్రాముల మోతాదులో ప్రతిరోజూ తీసుకోవడం వలన మధుమేహం పూర్తిగా తగ్గిపోతుంది. ఇది పిత్త వ్యాధులను, రక్తపోటును, వాత వ్యాధులను నియంత్రి స్తుందని ఆయుర్వేదం చెపుతోంది.

ఇన్ని ప్రయోజనాలున్న దొండతీగను పెంచుకోవడం కూడా చాలా సులువు. ఇది చాలా మొండిది. అంటే తెగుళ్లను తట్టుకుని కూడా బతకగలదు. దొండ వేరు దుంపను తెంచుకుని, కుండీలో నాటుకుని తీగల సాయంతో పాకిస్తే కూరకు కొదవ ఉండదు. ★

'ఓ... అలాగా!?'

ఓ సాధువు తన శిష్యుడిని పిలిచి "ఓ రోజంతా నువ్వు రాజుగారి కోటలో ఉండి పాఠం నేర్చుకురా" అని ఆదేశించారు. 'ఆశ్రమంలో నేర్చుకోని పాఠాన్ని రాజుగారి కోటలో ఏం నేర్చుకుంటాను' అని మనసులో అనుకున్నా గురువుగారి ఆజ్ఞగా శిష్యుడు సరేనని రాజుగారి కోటకు వెళ్లాడు. ఆ శిష్యుడు రాజుగారి ఆస్థానానికి వెళి గురువుగారి మాట చెప్పాడు. 'అలాగా' అని రాజుగారు ఆ శిష్యుడికి ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా సకలమర్యాదలతో చూసుకున్నాడు. అయితే ఇవేవీ అతనికి నచ్చలేదు. అయినా మనసును నియంత్రించుకుని పగలంతా కోటలో గడిపాడు. రాత్రి కాగానే నిద్రపోయాడు. మరుసటి రోజు తెల్లవారుజామునే రాజు ఆ యువకుడిని పిలిచి దగ్గర్లోనే ఉన్న కోనేటిలో స్నానం చేసి వద్దాం రమ్మన్నాడు. సరేనంటూ ఆ యువ సన్యాసి రాజును అనుసరించాడు. ఇద్దరూ కలిసి కోనేటి వరకూ వెళ్లారు. స్నానం చేయడం మొదలు పెట్టారు. ఇంతలో ఉన్నట్లుండి రాజుగారి కోటలో అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు చూపించాడు రాజు. ఆ యువకుడు స్నానం మానేసి కోట వైపు వెంటనే పరుగెత్తాడు. అక్కడ ఉంచేసిన తన

కౌపీనం తగలబడి పోకుండా కాపాడుకుని దానిని తీసుకుని యువకుడు కోనేటి వద్దకు చేరుకున్నాడు. అప్పటికీ రాజుగారు అక్కడే నింపాదిగా స్నానం చేస్తూ కనిపించారు. 'కోట ఓ పక్క అగ్ని ప్రమాదంలో చిక్కుకోగా ఈ రాజు ఏ మాత్రం దిగులుపడకుండా ఇలా జలకాలాడు తున్నాడేమిటి చెప్మా' అనుకున్నాడు మనసులో ఆ యువకుడు. అదే సందేహాన్ని రాజుని అడిగాడు. అప్పుడు రాజు చెప్పాడు.

"ఈ కోట నాదనే తలపు ఉండి ఉంటే నేనూ పరుగెత్తే వాడిని, అది ఒట్టి కోటే. నేను నేనే. అంతే తప్ప కోట నాదెలా అవుతుంది. నేను చనిపోయిన తర్వాత కూడా ఆ కోట అక్కడే ఉంటుంది. కౌపీనం నీదని, కోట నాదని నువ్వు అనుకున్నావు కనుకే పరుగెత్తుకుని వెళ్లి నీ కౌపీనాన్ని మాత్రం తెచ్చుకున్నావు... కోట సంగతి వదిలేశావు. కానీ నేనలా అనుకోలేదు. కనుకే పరుగెత్తలేదు. మనిషి తన మనసు ఇష్టాయిష్టాలకు దాసోహమవుతున్నాడు. ఇష్టాయిష్టాలను వదులుకున్నవాడే ఇందులోంచి విముక్తి పొందుతాడు" అని రాజు చెప్పేసరికి కౌపీనం కోసం పరుగు తీసినందుకు తనను తాను తిట్టుకుంటూ సిగ్గుపడ్డాడు ఆ యువకుడు. అంతేకాదు, గురువు తననెందుకు ఓ రోజు కోటలో ఉండి పాఠం నేర్చుకోమన్నాడో గ్రహించి, మౌనంగా రాజుకు నమస్కరించాడు. ★

"ఫోన్ ఎందుకు స్విచ్ఛాఫ్ అయింది" అన్నాడు.

"సాంతం ఇంట్లోకి రానీయకుండానే ప్రశ్నలు మొదలు పెట్టారా?"

''అడిగిందానికి సమాధానం చెప్పటం నేర్చుకో..."

"నేను వెళ్లింది ఫెస్ట్‌కి. అక్కడ ఫోన్స్ అనుమతించరు. ఎవరికి వాళ్లు ఫోన్లు మాట్లాడుకోవటానికి కాదు అక్కడికి వెళ్లింది. కొత్త విషయాలు నేర్చుకోవటానికి".

"రాత్రి కూడా ఫోన్ ఓపెన్ చెయ్యవా?"

"రాత్రి కూడా ఫోన్ ఓపెన్ చేయలేదని మీరు ఎలా అంటున్నారు. పడుకునే ముందు నేను మెసేజ్‌లు చూసుకున్నాను. వాట్సప్ చూసాను. మీ దగ్గర నుండి నాకు సింగిల్ మెసేజ్ రాలేదు".

"ఇంటి నుండి వెళ్లే ముందు నువ్వు అమ్మతో ఏం మాట్లాడావు?"

"నేను ఇంటి నుండి వెళ్లటం కాదు. జైపూర్ వెళ్తున్నాను అన్నాను. నాకెందుకు చెబుతున్నావు అంది".

"ఆ మాట అందని నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడతావా? అమ్మ అనే గౌరవం నీకు లేదా? పదేపదే నేను ఈ ఇంట్లో నుంచి వెళ్లిపోతాను" అనే మాట ఎందుకు వస్తోంది".

"మా మధ్య ఏ సంభాషణ జరిగిందో మీకు పూర్తిగా తెలియదు. ఈ ఇంటి నుంచి వెళ్లిపోవటం నాకు ఇష్టం కాదు. అయితే ఇక్కడున్న ప్రతి నిమిషం ఏదొక సాకుతో సాధించాలి అనుకుంటే మాత్రం నేను ఉండలేను. ఇంతకు ముందు ఇదే విషయం మీతో కూడా చెప్పాను".

"అంటే నేను దుర్మార్గురాలిని. మీ అందరినీ సాధించటానికే నేను పుట్టాను. అదేగా ఆద్య గారు అంటున్నది".

"నన్ను గారూ అని పిలవనవసరం లేదు"

"మీరు చాలా పెద్ద వారయిపోయారు కదా!" అంది అఖిల.

"ఇలాంటి వ్యంగ్యాలు నాకు నచ్చవు నాన్నా... ఇక్కడ ఉండాల్సిన బంధం ఇది కాదు".

"ఇంత త్వరగా నీలో ఈ మార్పు ఎందుకు వచ్చింది?"

"త్వరగా రాలేదు. ఎప్పుడో ఇది మొదలయింది. నా అలవాట్ల మీద, నేనేం తినాలి? ఏ బట్టలు కట్టుకోవాలి, ఏ చదువులు చదవాలి, ఎవరితో స్నేహం చేయాలి, ఎవరితో మాట్లాడాలి, ఎవరితో మాట్లాడ కూడదు, ఇవన్నీ అమ్మ నిర్ణయిస్తోంది. శ్రుతి మించినంతకాలం భరించాను. అందుకే ఈ మధ్య నేను గట్టిగా మాట్లాడాను".

"ఆవిడగారు ఏమందో తెలుసా? నేను మిమ్మల్ని కూడా భరించలేనంట. అందర్నీ దూరం చేసుకుని ఒంటరిగా బతుకుతానంట".

"అమ్మను ఇలా అనవచ్చా?"

"ఇలాంటి ధోరణి మార్చుకోకపోతే నువ్వు ఒంటరిగా మిగలాల్సి వుంటుంది అన్నాను. ఇప్పుడు కూడా అదే అంటున్నాను".

"అర్థమయిందిగా దాని పొగరు".

"అమ్మా... మాట్లాడాల్సి వస్తే నేనూ చాలా మాట్లాడగలను".

"మాట్లాడు".

"ఎప్పుడు ఏం మాట్లాడాలో నాకు తెలుసు. ఓ పక్కన నేను ట్రావెల్ చేసి వచ్చాను. అలసిపోయాను. ఇంట్లోకి శత్రువు వచ్చినా మంచి నీళ్లు ఇవ్వటం మర్యాద. ఇలా వాకిట్లోనే యుద్ధం మొదలవుతుందని నాకు తెలియదు. మీకు నా గురించి అంత ఆరాటం ఉంటే ఒక్క మెసేజ్ అయినా ఎందుకు పెట్టలేదు?"

"మేమూ అదే అడుగుతున్నాం".

"ఇక్కడ నుండి నేను తగాదా పడి వెళ్లాల్సి వచ్చింది. నన్ను ప్రేమగా పంపించ లేదు. మీ వ్యతిరేకత ఎంత వరకు వుందో చూద్దామనుకున్నాను".

ఇద్దరూ మాట్లాడలేదు.

"ఇది ఇంతటితో అయిపోయిందా? రోజూ ఇలా బాగోతం నడుస్తుందా?"

"బాగోతమా! ఇదీ మనకిచ్చే గౌరవం".

"ఎవరు ఎవరికి ఎంత గౌరవం ఇస్తారో నేను చాలా కాలం నుండి చూస్తున్నాను".

''ఇంకో మాట మాట్లాడితే చెంప పగల గొడతాను. శ్వేత ఇలానే మాట్లాడుతోందా?"

ఎండివై రామమూర్తి స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన

16

"స్వప్న పెద్దమ్మ కూడా నీలా మాట్లాడదు".

"మాటకి మాట సమాధానం ఇస్తోంది. నేను భరించలేను" అంది అఖిల.

"నన్ను మీరు భరించాల్సిన అవసరం లేదు. నేనే కొంత కాలం తప్పుకుంటాను. ఇప్పుడు నేను ప్రశాంతంగా చదువుకోవాల్సిన సమయం. ఇప్పటి కిప్పుడు బయటకి వెళ్లమన్నా నేను వెళ్లిపోతాను. లేదంటే రేపు వెళ్తాను".

"ఎక్కడికి వెళ్తావ్... చూసే వాళ్లు ఏమనుకుంటారు?"

"అలాంటివి పట్టించుకోవటం ఎప్పుడో మానేసాం నాన్నా... అయినా ఏమనుకుంటారు? మనం ఇంకొకరికి చెబితే కదా తెలిసేది. ఇంటి దగ్గర చదవటం కష్టమని హాస్టల్లో చదువుకుంటున్న వారు చాలా మంది ఉన్నారు" అని తన గదికి వెళ్లి పోయింది.

అఖిల కేసి చూసాడు ఆదర్శ్ . తన ముఖం జేవురించి ఉంది. "ఇప్పుడేం చేద్దాం అఖిలా?"

"వెళ్లమనండి. ఎంతకాలం మనకి దూరంగా ఉంటుందో అదీ చూద్దాం" అంది. ఆదర్శ్ చిన్నగా తలూపాడు.

* * *

రామకృష్ణ ముందు ఓ డమ్మీ కాపీ ఉంది. అది పరిశీలిస్తున్నాడు. అతని ముందు గోవింద్, రిత్విక్ ఉన్నారు. అన్ని పేజీలు చూసాక ఆయన తలెత్తి వారిని చూసాడు.

"మంచి ప్రయత్నం జరిగింది బుద్ధా... ముందు మనం పత్రికకి మంచి పేరు పెట్టాలి. తర్వాత మిగతా పనులుంటాయి కదా... డిక్లరేషన్ తీసుకోవాలి. ఎంత సమయం పడుతుంది?"

"మనం అవసరం అనుకుంటే వేగంగానే పనులు పూర్తి అవుతాయి".

"దానికి ముందు ఇంకో పని చేయాలి బుద్ధా... నేను ఓ ట్రస్ట్ ఏర్పాటు చేయాలనుకుంటున్నాను".

"ఇప్పటికే ఉంది కదా".

"అది కంపెనీ పేరు మీద ఏర్పాటు చేసాం. ఇది పూర్తిగా నా స్వంతం. అందుకు కావలసిన ఫార్మాలిటీస్ కూడా పూర్తి చేయించు. ఈ ట్రస్ట్ ద్వారా పత్రిక వస్తుంది. అది ఆగిపోకుండా ఫిక్స్‌డ్ డిపాజిట్స్ చేయిద్దాం. ఇంక అందులో ఓ కమిటీని ఫామ్ చేద్దాం. అది పత్రికకు చెందిన సలహా మండలి. అందులో ఎవరెవరు ఉండాలో నువ్వు సజెస్ట్ చెయ్యి. ఇంక ట్రస్టీల గురించి, ఆ విషయం మనం మాట్లాడుకుందాం".

"ఇందుకు మొత్తం ఎన్ని నిధులు సేకరించాలంటున్నారు?"

"ఎందుకు అలా అడిగావు బుద్ధా".

"ఇందులో నా కంట్రిబ్యూషన్ కూడా ఉండాలని".

ఆయన కొద్ది క్షణాలు కళ్లు మూసుకున్నాడు.

రిత్విక్ ఆయననే చూస్తున్నాడు. ఆయన కళ్లు తెరిచాడు.

"నువ్వు అలా అనటం నాకు చాలా సంతోషం కలిగించింది. నీ హృదయం నాకు తెలుసు. ప్రపంచం దృష్టిలో నువ్వు నేనూ కేవలం వ్యాపారవేత్తలం. అది నిజమే. అలా లేకుంటే ఈ స్థితికి వచ్చే వాళ్లం కాదు. కానీ మనం అంతా నాకే అని ఎప్పుడూ అనుకోలేదు" అన్నాడు.

అప్పుడు రాజన్ టీ అందించివెళ్లాడు.

"మళ్లీ నేను మరిచిపోతాను. ఈ రాజన్ ఎవరి వాడు... ఎక్కడి వాడు... నన్ను నమ్ముకుని వచ్చాడు. నాతోనే ఉన్నాడు. అయిన వాళ్లందరూ దూరంగా జరిగిపోయారు. నన్ను వదలంది రాజన్ ఒక్కడే. అతనికి డబ్బుతో పని లేదు. లక్ష రూపాయలు ఇవ్వబోతే నేనేం చేసుకోను సార్ అంటాడు. ఇలాంటి మనుషుల్ని మన ఊర్లో చిన్నప్పుడు చూసాను. ఇంట్లో కూరగాయలు పండుతాయి. పొలంలో బియ్యం వస్తాయి. చిన్నదయినా స్వంత ఇల్లు. ఇద్దరే వుంటారు. పిల్లలు డబ్బులు పంపిస్తానంటే మేం ఏం చేసుకోవాలి అనేవారు. అందరికీ సహాయం చేసే వారు. వారికి డాక్టర్లు ఫీజులు తీసుకోరు. రిక్షావారు డబ్బులు తీసుకోరు. అలా ఎలాంటి జబ్బు



పి. చంద్రశేఖర ఆజాద్
9246573575

లేకుండానే ప్రశాంతంగా వెళ్లిపోయారు".

"అదృష్టవంతులు" అన్నాడు బుద్ధ.

"నేనున్నా లేకపోయినా, రాజన్‌కి ఎలాంటి లోటు రాకూడదు. అతని పేరు మీద ఓ కోటి రూపాయలు డిపాజిట్ చేయాలి నాకు ఒరిస్సాలో కొన్ని భూములున్నాయి అది మా వాళ్లకు తెలి యదు".

"రాజన్‌గారు ఒప్పుకుంటాడా?" అన్నాడు రిత్విక్.

"అది అతనికి ఎవరు చెబుతారు రిత్విక్... నేను చనిపోయిన రోజున ఆ డాక్యుమెంట్ రాజన్‌కి చేరుతుంది. తర్వాత అతను ఏం చేసుకుంటాడనేది మనకు అనవసరం".

"బాగుంది సర్" అన్నాడు రిత్విక్.

"మన పత్రికలో కొన్ని ఆటో బయోగ్రఫిలు ప్రచురించాలి. అది బహుశా నాతో మొదలు పెడదాం. అలాగే విశ్వం గురించి బుద్ధా చెప్పాడు. నాకు పరిచయం ఉన్న ఇంకొందరు ఉన్నారు. అలాంటి వారితో పాటు రాజన్ లాంటి వారిని మీరు గుర్తించాలి. రాజన్‌కి భార్య లేదు. చనిపోయింది. పిల్లలు లేరు. వారికి పిల్లలు లేరని చాలా బాధలు పడేవారు రిత్విక్. ఓసారి అతనేమన్నాడో తెలుసా..."

ఇద్దరూ ఆయన్ని చూస్తున్నారు.

"మీకు పిల్లలున్నారు.. అందరూ వున్నారు.. మీరు అదృష్టవంతులా? నేను అదృష్టవంతుడ్నా" అన్నాడు. అని నవ్వాడు.

"మీరంటే అంత వినయంగా, భయంగా ఉంటాడు. అలా ఎలా అన్నాడు."

"మీకు మా బంధం గురించి తెలియదు. ఎవరూ లేనప్పుడు మా ఇద్దర్నీ చూడాలి. నన్ను చాలా క్రిటిసైజ్ చేస్తాడు. మీరు ఇలా మాట్లాడకుండా ఉండటం మంచిది కాదంటాడు. రాజన్ గొప్ప సబ్జెక్ట్. మంచి నవల రాద్దువు గాని".

"మీరు చాలాసేపటి నుంచి మాట్లాడుతున్నారు. మనం మళ్లీ మాట్లాడుకుందాం సర్" అన్నాడు బుద్ధ.

"మా బుద్ధా అంతే చిన్నప్పుడు నేను తనకి ఇన్సిు రేషన్. ఇప్పుడు నాకు బుద్ధా ప్రేరణ. అందుకే ముంబైలో మావాడిదగ్గర ఉన్నాను. బుద్ధా ఇంకా ఎక్కువసేపు మాట్లాడను. నా ఆరోగ్యం గురించి నువ్వు వర్రీ కావద్దు. నాకు కోట్లకు కోట్లు సంపా దించటం గమ్యం కాదు. ఒక దశ దాటాక డబ్బుకి విలువ లేదు".

రిత్విక్‌కి అది నిజం అనిపించింది.

"నీ అవసరానికి మించింది ఒక్క నయా పైసా అయినా ఎక్కువే. ఇంక కోట్లు ఏం చేసుకుంటాం..." అని రిత్విక్ కళ్లల్లోకి చూస్తూ...

"ఈ రోజు నుంచి నిన్ను రచనలు మానేయ మంటాను. మానేస్తావా?"

"ఇంకా అలాంటి సంతృప్త స్థాయిని నేను అందుకోలేదు సర్".

"అంటే నువ్వు క్రియేట్ చేయవలసింది ఏదో

"మా బుద్ధా అంతే చిన్నప్పుడు నేను తనకి ఇన్సిు రేషన్. ఇప్పుడు నాకు బుద్ధా ప్రేరణ. అందుకే ముంబైలో మావాడిదగ్గర ఉన్నాను. బుద్ధా ఇంకా ఎక్కువసేపు మాట్లాడను. నా ఆరోగ్యం గురించి నువ్వు వర్రీ కావద్దు. నాకు కోట్లకు కోట్లు సంపాదించటం గమ్యం కాదు. ఒక దశ దాటాక డబ్బుకి విలువ లేదు".

ఉంది. మా గమ్యం అదే. కొత్త పరిశ్రమ పెట్టాలంటే ముడిసరుకు కావాలి. అందుకు ఎన్నో ప్రయోగాలు చేయాలి. అప్పుడు ప్రకృతి గురించి అర్థం అవుతుంది. నేను కొన్ని పరిశ్రమలు పెట్టటానికి ఎంత రిస్క్ తీసుకున్నానంటే-అప్పటి వరకు సంపాదించింది పోయి రోడ్డు మీద నిలబడాలి.

ఆ రోజుల గురించి చెబితే థ్రిలింగ్‌గా వుంటాయి. నీకు వివరంగా చెబుతాను. మేం సైంటిస్టులం కాకపోవచ్చు. కొన్ని మేం ఆవిష్కరించాం. ఇప్పుడు నన్ను చచ్చిపొమ్మన్నా ఆనందంగా చచ్చి పోతాను. యస్... నాకు ఆ తృప్తి ఉంది" అన్నాడు.

* * *

రూమ్ లోకి అడుగు పెట్టిన ఆద్యను చూసి ఆశ్చర్య పడింది జూలీ. "వెల్ కమ్" అంది.

తనకు చెందిన పుస్తకాలు, డ్రెస్‌లూ రెండు సూట్ కేసుల్లో తెచ్చుకుంది. మరికొన్ని వున్నాయి. అవన్నీ కదిలించలేదు. జూలీ ప్రత్యేకంగా గది తీసుకుని ఉంటోంది. జూలీకి తన గదిని ఇంకొకరితో షేర్ చేసుకోవటంనచ్చదు. అందుకని ముందుగా అడిగింది ఆద్య.

"ఎగ్జామ్స్ అయ్యే దాకా నీ రూమ్‌లో ఉండాలను కుంటున్నాను. ఇప్పటికిప్పుడు హాస్టల్ అంటే కష్టం. నీకు ఇబ్బంది లేకపోతేనే. అంతగా అయితే నేను ఇంకో రూమ్ తీసుకుంటాను".

"నీకు తెలుసు. నేను అందరు ఆడపిల్లల్తో ఎటాచ్ కాలేను. ఇది నా స్పేస్ అనుకుంటాను. నీతో రూమ్ షేర్ చేసుకోవటానికి నాకు ఇబ్బంది లేదు. ఎప్పుడు వస్తున్నావ్?"

"ఎనీ మూమెంట్" అంది ఆద్య.

గదిలో అన్నీ సర్దుకున్నాక అడిగింది జూలీ.

"మీ పేరెంట్స్‌తో తగాదా పడి వచ్చావనుకుంటాను".

"అది తగాదా అనుకోను. చిన్న అభిప్రాయ భేదాలు".

"అవిలేకుండా ఎలా ఉంటాయి. అయినా నీకు కుటుంబం అంటే ఇష్టం. దాని గురించే ఎక్కువ మాట్లాడుతుంటావు. నువ్వు ఇలా నీ ఫ్యామిలీని బ్రేక్ చేస్తావనుకోలేదు!"

"ఇది బ్రేక్ చేయటం కాదు జూలీ... నేను నా వ్యక్తిగత స్వేచ్ఛ కోసం ఇంటి నుండి బయటకు రాలేదు. మా ఫ్యామిలీ రీయూనియన్ కోసం వచ్చాను".

"నిజమా... అందుకోసం కూడా ఫ్యామిలీ నుండి బయటకు వస్తారా!"

"ముందు మన గురించి మనకు క్లారిటీ వుండాలి. మనం ఏంచేయాలను కుంటున్నామో క్లారిటీ వుంటే మనం ఎలాంటి పద్ధతుల్నయినా అనుసరించవచ్చు జూలీ" అంది ఆద్య.

* * *

అఖిల స్వప్నకు ఫోన్ చేసింది.

"అక్కా ఆద్య వెళ్లిపోయింది".

"వెళ్లిపోవటంఅంటే నువ్వుసరిగ్గా చెప్పు అఖిలా".

"ఇంటి నుండి వెళ్లిపోయింది"

"జైపూర్ నుండి ఎప్పుడు వచ్చింది? ఎప్పుడు వెళ్లింది? ముందు జరిగింది చెప్పు" అంది కాస్త ఆందోళనగా ... అంతా విన్నాక అడిగింది.

"ఇందులో ప్రేమ కోణం ఉందా?"

"అదింకా తెలియదు. ప్రస్తుతం జూలీ అని తన ఫ్రెండ్ రూమ్‌లో వుంది అని ఆదర్శ్ చెప్పాడు. ఆ అమ్మాయిని ఓ సారి ఇంటికి తీసుకు వచ్చింది. నాకు ఆ అమ్మాయి నచ్చలేదు. నువ్వు జూలీతో స్నేహం చేయటం నాకు నచ్చలేదు అన్నాను. ఎందుకో చెప్పు... నీకు జూలీ గురించి ఏం తెలుసు. తనో జీనియస్ అంది".

"ఇంతకూ జూలీ ఎవరు?"

"తెలియదు. తను విడిగా రూమ్ తీసుకుని వుంటోంది. అంత వరకు మాత్రం తెలుసు".

"ఆదర్శ్ ని ఓ సారి వాళ్ల ఫ్యామిలీ గురించి తెలుసుకోమను అఖిలా...."

"అలాగే..."

"ఇంటి నుండి వెళ్తున్నప్పుడు ఆదర్శ్ డబ్బులు యిచ్చాడా?"

"ఆద్యకు డబ్బులతో అవసరం ఉంటే ఇంత అహంకారం వచ్చేది కాదు. ఇంటి దగ్గరే ఉండేది. మనం చెప్పిన మాటలు వినేది. తన ఎకౌంట్‌లో చాలా డబ్బులు ఉన్నాయి".

"ఈ కాలం పిల్లల గురించి మనం త్వరపడి ఓ నిర్ణయానికి రాకూడదు అఖిలా. తన దగ్గర డబ్బులు లేకపోయినా ఇంటి నుంచి వెళ్లి ఉండేది. అలాంటి పరిస్థితి రాకుండా ఉండాల్సింది".

అఖిల ముఖంలో ఫీలింగ్స్‌మారాయి.

(సశేషం)

డి. అరుణ

బహుళ ధ్రువ ప్రపంచం దిశగా...

ఆర్థిక, భౌగోళిక, రాజకీయ రంగాలలో తాము సాధించిన విజయాలతో నూతన ఉత్సాహాన్ని నింపుకున్న బ్రిక్స్ (బిఆర్ఐసిఎస్- బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణ ఆఫ్రికా) కూటమి ఏకధ్రువ ఆధిపత్య గుప్పిట నుంచి ప్రపంచాన్ని తప్పించి, బహుళధ్రువ ప్రపంచానికి పునాదులు వేసేందుకు కృషి చేస్తూ మరో ఆరు దేశాలను తమ కూటమిలోకి ఆహ్వానించింది. దక్షిణాఫ్రికాలో జరిగిన బ్రిక్స్ 2023వ సదస్సు అర్జెంటీనా, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ ఆరబ్ ఎమిరేట్స్‌కు వచ్చే ఏడాది నుంచి సభ్యత్వం ఇచ్చింది.

రిజర్వు కరెన్సీగా డాలరు ఆధిపత్యాన్ని, దాని అండతో అమెరికా ఆంక్షల పేరుతో చెలరేగిపోతున్న విధానాన్ని చూసిన ప్రపంచ దేశాలకు సహనం నశించిపోయింది. ఇప్పటివరకూ ముడిచమురు, పెట్రోలు వంటి ఇంధనాల కోసం అమెరికా ఏదో ఒక సాకు చూపి అవి ఇబ్బడి ముబ్బడిగా ఉన్న దేశాలపై ఏదో ఒక సాకుతో యుద్ధాన్ని చేసి, అక్కడి ఆర్థిక వ్యవస్థలను ధ్వంసం చేయడం, అందుకు నాటో పేరుతో ఐరోపా దేశాలు సహకరించడం మనం చూశాం. అందుకే ఇప్పుడు ఐరోపాయేతర ఖండాలు, దేశాల రహితంగా బ్రిక్స్ కూటమి పని చేయాలని నిర్ణయించింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ తనను ఆహ్వానించాలని కోరినా, వాటికన్ సిటీ తనకు పరిశీలకుని హోదా ఇవ్వమని అడిగినా బ్రిక్స్ నిర్ద్వంద్వంగా నిరాకరించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ అయితే, ఐరోపా దేశాలకు తమ కూటమిలో చోటు లేదని ఉపన్యాసంలో స్పష్టం చేశారు.

నూతన ప్రపంచ క్రమానికి నాంది పలుకుతున్న సమయంలో బ్రిక్స్ సభ్య దేశమైన భారత్ ఆగస్టు 23న ఇంతకు ముందు ఎవ్వరూ మోపని ప్రాంతంలో చంద్రునిపై కాలు మోపి తమ సత్తా ఏమిటో చాటుకోవడమే కాదు, లా సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోదీ దీన్ని ప్రపంచ విజయంగా, అందరికీ ఉప యోగపడేదిగా అభివర్ణించడం ద్వారా తమ కార్యశైలి ఎలా ఉండబోతోందో చెప్పకనే చెప్పారు. ఈసారి బ్రిక్స్ సమావేశం దక్షిణ ఆఫ్రికా ఆధ్వర్యంలో జరిగింది. ఏకధ్రువ ప్రపంచంలో రిజర్వు కరెన్సీగా చెలామణి అవుతున్న డాలర్ స్థానంలో తమ తమ స్థానిక కరెన్సీలను ప్రవేశపెట్టేందుకు మార్గాలను సమావేశం అన్వేషించింది. కాగా, ఐరోపా యూనియన్ ప్రవేశ పెట్టిన 'యూరో' వంటి కరెన్సీని ప్రవేశపెట్టేందుకు దేనితో దానిని ముడిపెట్టి విలువను నిర్ణయించాలనే విషయం ఇంకా శైశవ దశలోనే ఉన్నది.

అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ కూటమి అధికార ప్రతినిధి కావడమే కాదు, ప్రపంచంలో 40% జనాభాకు, ప్రపంచ జీడీపీలో 25%కి పైగా ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత పాత్ర ఉండాలన్న కీలక ఆకాంక్ష, లక్ష్యాలను బ్రిక్స్ కలిగి ఉండటం వల్లనే దాదాపు 50 దేశాల అధినేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశాల రెండవ రోజున కొత్తగా ఆరు దేశాలను ఇందులోకి చేర్చుకుంటున్నట్టు బ్రిక్స్ ప్రకటించింది. కూటమిని ఏర్పరచిన పదమూడేళ్ల తర్వాత కొత్త సభ్యులు ఇందులో భాగములయ్యారు.

కొవిడ్ మహమ్మారి అనంతరం మారిన పరిస్థితులలో 15వ బ్రిక్స్ సమావేశపు జొహెన్నాస్‌బర్గ్ ప్రకటన ఎంతో ప్రాముఖ్యం సంతరించుకుంటోంది. ఉద్భవిస్తున్న మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు అంతర్జాతీయ సంస్థలలో మరింత

ప్రాతినిధ్యం ఉండాలని, అభివృద్ధి చెందుతున్న దేశాలతో ప్రపంచ వాణిజ్య సంస్థ భిన్నంగా వ్యవహరించకూడదని కోరుతూ, ఏకపక్ష నిర్బంధ పద్ధతుల పట్ల బ్రిక్స్ ఆందోళన వ్యక్తం చేసింది. అనేక దేశాలలో పెరుగుతున్న వడ్డీ రేట్లు రుణ దుర్బలత్వాన్ని ఉధృతం చేసిన అంతర్జాతీయ సంస్థను పట్టి చూపుతూ, అంతర్జాతీయ రుణ/ బాకీ అంశాలను తగిన రీతిలో పరిష్కరించాలని కోరింది. బ్రిక్స్ ఉమ్మడి ప్రయోజనాల ఐక్యతను లక్ష్యాలు ప్రదర్శించాయి. జనాభా పరంగా, జీడీపీ పరంగా చెప్పుకోదగిన బలాన్ని కలిగి ఉన్నందున, అంతర్ బ్రిక్స్ సహకారానికి సమావేశం ప్రాధాన్యం ఇచ్చింది. అభివృద్ధి చెందుతున్న దేశాలు, ఉద్భవిస్తున్న మార్కెట్ల మధ్య చర్చల ద్వారా చెల్లింపుల పద్ధతులు, అందులో స్థానిక కరెన్సీలకు ప్రాధాన్యం ఇచ్చింది. బ్రిక్స్ ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్ఎండి లేదా బ్రిక్స్ బ్యాంక్) అత్యంత

చక్కగా రూపొందించిన పాలనా వ్యవస్థతో పటిష్టమైన విజయాన్ని సాధించిందనే చెప్పాలి. ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన నిధులతో పోల్చి చూస్తే ఎన్‌డీబీ కేటాయింపులు స్వల్పమే అయినప్పటికీ భవిష్యత్ ఆశాజనకంగా కనిపిస్తోంది.

పర్యావరణ మార్పు యుగంలో నిలకడైన వృద్ధిని సాధించడం గురించి, అంతర్జాతీయ పాలనా సంస్కరణలు, స్థానిక కరెన్సీలలో వ్యాపారాన్ని క్రమబద్ధంగా పెంచుకుంటూ పోయే ప్రక్రియ గురించి సమావేశం చర్చించింది. అభివృద్ధి పథంలో ఉన్న ఆర్థిక వ్యవస్థలు డాలరేతర కరెన్సీలలో వ్యాపారాన్ని చేయడానికి మార్గాలను అన్వేషిస్తున్నాయి. ఈ పరిణామం రష్యాపై ఆంక్షల అనంతరం ఊపందుకుంది.

కాగా, ఇప్పటికీ డాలరే ప్రపంచ రిజర్వ్ కరెన్సీ హోదాను కలిగి ఉన్నప్పటికీ, అభివృద్ధి చెందుతున్న దేశాలు దాని ఆధిపత్యాన్ని తిరస్కరించడం పెరిగిపోతున్నది. ఈ విషయాన్ని అనేకమంది ఆర్థిక నిపుణులు, యుఎస్ సీనియర్ అధికారులు గుర్తించడమే కాదు, తన విదేశీ విధానాన్ని అమలు చేయడం కోసం ఎడాపెడా ఆర్థిక ఆంక్షలను విధించుకుంటూ పోతే, భవిష్యత్తులో డాలర్ తన ఆధిపత్యాన్ని కోల్పోతుందని కూడా హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలోనే డీడాలరీకరణ ప్రచారం ఊపందుకుంటోంది.

ఈ నేపథ్యంలో బ్రిక్స్ కూడా ఐరోపా యూనియన్ లాగానే బ్రిక్స్ కరెన్సీని ముద్రిస్తామని ప్రకటిస్తుందనే వాదనలు వినిపించాయి. తమ సభ్య దేశాల మధ్య సీమాంతర వాణిజ్యం కోసం ఉమ్మడి కరెన్సీగా బ్రిక్స్ దీనిని తీసుకువస్తుందని అన్నారు. అయితే అటువంటి దేమీ ఈ సమావేశం సందర్భంగా చోటు చేసుకోలేదు. అయితే, భవిష్యత్తులో అది జరగదనే హామీ కూడా లేదు. బ్రిక్స్ దేశాలన్నింటికీ సౌకర్యవంతమైన బాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ మిగులు ఉన్నప్పటికీ, అందుకు అవసరమైన సంస్థాగత నిర్మాణం, దానిని నిలుపుకునే స్థాయిలో సుస్థిరత లేవు. పైగా, ఈ కరెన్సీ అంగీకరించేందుకు అన్ని దేశాలూ ఒక తాటి మీదకు రావడం, ఒక ఎక్స్‌చేంజ్ రేటు పద్ధతిపై అంగీకారానికి రావడం వంటి అనేకానేక అంశాలను రూపొందించుకోవలసి ఉంటుంది. కనుక బ్రిక్స్ కరెన్సీ ఇప్పుడప్పుడే రాకపోయినప్పటికీ, స్థానిక కరెన్సీలలో ఏకపక్ష వాణిజ్యం పుంజుకునేందుకు వేదిక సిద్ధమైంది.

భారత్ పాత్ర

కోవిడ్ నేపథ్యంలో దేశాల ఆర్థిక పరిస్థితులు అతలాకుతలం కావడం, ఆ సమయంలోనే భారత్ ఆరోగ్యం నుంచి ఆర్థికం వరకూ తన జనాభాను కాపాడు కోవడమే కాక, ఇతర దేశాలకు కూడా తోడ్పడి ప్రత్యేకతను సంతరించుకొని, నాయకత్వ లక్షణాలను ప్రదర్శించింది. అన్నింటికన్నా ప్రధానమైనవి భారత దేశ ప్రయోజనాలే అన్న లక్ష్యంతో ప్రధాని మోదీ అన్ని దేశాలతోనూ సమానంగా సంబంధాలను కొనసాగిస్తున్నారు. ఇటీవల హిరోషిమాలో జరిగిన జి7 సదస్సులోనూ, అనధికారికంగా జరిగిన క్వాడ్ సదస్సులోనూ పాల్గొనడంతో భారత్ యుఎస్ వైపు మొగ్గుతున్నదా అనే భావన వచ్చిన కొద్దిరోజులకే, పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకమని భావించే బ్రిక్స్‌లో చురుకైన పాత్ర పోషించి అందరినీ ఆశ్చర్యపరిచారు. బ్రిక్స్ పాశ్చాత్య వ్యతిరేక కూటమిగా ఉండాలన్నది చైనా కోరిక. కానీ, భారత్ మాత్రం బ్రిక్స్ 'పాశ్చాత్యేతర కూటమి'గా ఉండటమే మేలని సూచిస్తోంది. అటు రష్యాతోనూ ఇటు చైనాతో సమస్యలున్నప్పటికీ, షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఒ)లో భాగంగా భారత్ వారితో సంబంధాలు కొన సాగిస్తోంది.

ప్రపంచానికి ఒక వృద్ధి ఇంజన్‌గా భారత్ ఉంటుందని, అందుకు కారణం విపత్కర పరిస్థితులను కూడా భారత్ ఆర్థిక సంస్కరణలుగా మార్చుడమేనని ప్రధాని మోదీ చెప్పారు. గత కొద్ది ఏళ్లలో వ్యాపారం చేయడం సరళీకృతం అయిందని, తాము ప్రజాసేవల బట్వాడా, సుపరిపాలనపై దృష్టి పెట్టామన్నారు. నేడు భారత్‌లో అన్ని స్థాయుల్లోనూ యుపీఐను ఉపయోగిస్తున్నారని, ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో డిజిటల్ లావాదేవీలను నిర్వహిస్తున్నది భారతదేశమేనని ఆయన చెప్పుకొచ్చారు.

దానితోపాటుగా ప్రపంచంలోనే అతిపెద్ద 3వ స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ భారత్‌లో ఉందని, అందులో 100 యూనికార్న్స్ ఉన్నాయని బ్రిక్స్ బిజినెస్ ఫోరం నాయకులతో చర్చ సందర్భంగా చెప్పారు.

లాభపడనున్న భారత్, చైనా

భారత్, చైనాలకు రక్షణపరంగా భిన్నమైన లక్ష్యాలు, ప్రయోజనాలు ఉన్నప్పటికీ, స్థానిక కరెన్సీలలో వాణిజ్యం కారణంగా ఈ రెండు దేశాలూ బాగా లాభపడనున్నాయి. ఇప్పటికే బ్రిక్స్‌లోని కొన్ని దేశాలు ద్వైపాక్షిక వాణిజ్య చెల్లింపుల కోసం తమ స్వంత కరెన్సీలను ఉపయోగిస్తున్నాయి. అలాగే, సౌదీ అరేబియా కూడా చమురు లావాదేవీలకు సంబంధించిన చెల్లింపులను రెన్‌మిన్‌బీలో చేసేందుకు ఒప్పందం చేసుకుంటుండగా, భారతదేశం బ్రిక్స్ కూటమి బయిటున్న దేశాలతో కూడా ద్వైపాక్షిక వాణిజ్య చెల్లింపులను స్థానిక కరెన్సీలలో చేసుకోవడాన్ని విస్తరింపచేస్తోంది. వాణిజ్య చెల్లింపులను రూపాయలలో చేసేందుకు దాదాపు ఇరవైకి పైగా దేశాలను ప్రత్యేక వోస్ట్రో బ్యాంకు ఖాతాలను తెరవవలసిందిగా భారత్ ఆహ్వానించింది. అందరినీ ఆశ్చర్యపరుస్తూ ఈ నెల మొదట్లో యుఎఇకి తొలి చమురు చెల్లింపులను రూపాయలలో చేసింది.

జి7 కూటమికి పోటీగా బ్రిక్స్

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఈ కూటమి జి7కు భౌగోళిక రాజకీయ ప్రత్యర్థిగా ఉండాలని ప్రతిపాదించారు. అయితే భారత్ మాత్రం ఇందుకు

అంగీకరించక, సమరసంగా, అందరూ లాభపడేలా ముందుకుపోవాలని చెప్తోంది. ముందు వెనుకలు ఆలోచించకుండా, పద్ధతీ పాడూ లేకుండా సభ్యులను చేర్చుకుని, పోటీ కోసం బ్రిక్స్‌ను విస్తరించడం వల్ల ఉపయోగం లేదని మెత్తగా హెచ్చరిస్తోంది. పెరుగుతున్న బ్రిక్స్ ప్రాబల్యాన్ని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మొత్తం 40 దేశాలకు పైగా బ్రిక్స్ పట్ల ఆసక్తి ప్రదర్శించగా, 23 దేశాలు తమను కూడా ఇందులో చేర్చుకోవలసిందిగా దరఖాస్తులు సమర్పించాయి. కాగా, బ్రిక్స్ నాయకులు సంప్రదించుకుని ఆరు దేశాలను ఎంపిక చేశారు. అవి – అర్జెంటీనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ ఆరబ్ ఎమిరేట్స్ (యుఎఇ). ఈ దేశాలు కూడా 2024 జనవరి నుంచి అధికారికంగా బ్రిక్స్ సభ్యులు కానున్నాయి.

బహుళ ధ్రువ ప్రపంచానికి అడ్డంకారాదు

ప్రస్తుతం తనకున్న ఆర్థిక సామర్థ్యం, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా రష్యా వంటి అగ్ర దేశం తనపై ఆధారపడి ఉండటం, తన ఆర్థిక శక్తితో ఇతర సభ్య దేశాలను ప్రభావితం చేయగల సామర్థ్యాన్ని చైనా కలిగి ఉండటం కూడా బ్రిక్స్ విస్తరణకు భారత్ బ్రేకులు వేయడానికి కారణమని అంటున్నారు. బ్రిక్స్‌ను వేగంగా విస్తరించనిస్తే, చైనా దానికి పాశ్చాత్య వ్యతిరేక వాసనలు పులుముతుందని, ఇది బహుళ ధ్రువ ప్రపంచాన్ని సాధించాలన్న లక్ష్యం నెరవేర నివ్వదని భారత్ భావిస్తోంది. ఈ కూటమిలో సభ్యుల మధ్య సమానత్వమన్నది ప్రాథమిక లక్షణంగా ఉంటూ వస్తోంది, విస్తరణ ఎక్కువగా ఉంటే అది సమతుల్యతను దెబ్బతీసి, భారత్‌ను, చైనాను రెండు వర్గాలుగా విడదీయగల శక్తిని కూడా కలిగి ఉంటుంది. కనుక, బ్రిక్స్‌ను విస్తరిస్తే తన భౌగోళిక రాజకీయ అజెండాను అనుసరిం చేందుకు, అభిప్రాయాలను రుద్దేందుకు చైనాకు ఒక వేదికను ఇచ్చినట్టు అవుతుంది.

ఒకవేళ భారత్, చైనాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు గల్వాన్ అనంతరం ప్రతికూల స్థితికి చేరకపోయి ఉంటే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెడుతున్న తరుణంలో గ్లోబల్ సౌత్‌లో ప్రాంతీయ సమగ్రతకు, ఆర్థిక సంస్థలు అభివృద్ధికి కృషి చేసి ఉండేవి. ఇంకా అపరిష్కృతంగా ఉన్న సరిహద్దు వద్ద సైనిక సమీకరణ కారణంగా, విశ్వాస రాహిత్యం వల్ల బ్రిక్స్‌లో పోటీ దృక్పథాలు కనిపిస్తాయి. పైగా, అమెరికాతో సత్సంబంధాలను నెరపుతున్న భారత్‌కు మాత్రం చైనా, యునైటెడ్ స్టేట్స్ మధ్య చిక్కుకుపోవడం ఇష్టపడడం లేదు. అందరితో సమానమైన సంబంధాలను కలిగి ఉండాలని కోరుకుంటోంది.

ఆఫ్రికాతో మరింత వాణిజ్యం

2023లో జరిగిన బ్రిక్స్ సమావేశాలు ఆఫ్రికా దేశాలతో వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడం గురించి చర్చించాయి. ఈ క్రమంలో ఆఫ్రికా ఖండంలో ఇప్పటి వరకూ స్పృశించని మార్కెట్లను అన్వేషించేందుకు బ్రిక్స్ దేశాలు సిద్ధం అవుతున్నాయి. ఇప్పటికే ఆఫ్రికాకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా చైనా ఉంది. దానితో 2030 నాటికి వారి మధ్య 500 బిలియన్లను దాటనుంది.

బ్రిక్స్ ఏర్పాటుకు దారి తీసిన కారణాలు

1990వ దశకంలో సోవియట్ రష్యా పతనానంతరం, అమెరికా బాహుబలి అయిపోయింది. తనను సవాలు చేయడానికి ఏశక్తీ లేని ఏకధ్రువ ప్రపంచంలో యుఎస్ తాను ఆడింది ఆట, పాడింది పాటగా సాగుతూ, అన్ని అంతర్జాతీయ సంస్థలను గుప్పిట్లో పెట్టుకుని ప్రపంచం మీద పెత్తనం చెలాయిస్తూ వస్తోంది. దీనంతటికీ కారణం, డాలరు రిజర్వు కరెన్సీ కావడం వల్ల ఏ దేశం కూడా దాని శక్తికి అడ్డుకట్ట వేయలేకపోయింది. అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ ప్రయోజనాలను పరిరక్షించుకోవడం కోసం 'బ్రిక్' సంస్థను 2006లో ఏర్పాటు చేసుకున్నాయి. తొలుత బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో ఏర్పడిన ఈ కూటమి తొలి సమావేశం 2009లో రష్యాలోని యెకటెరిన్‌బర్గ్‌లో జరిగింది. మరు ఏడాదే బ్రిక్ నాయకుల ఏకాభిప్రాయంతో దక్షిణ ఆఫ్రికా చేరడంతో అది 'బ్రిక్స్'గా మారింది. కొత్తల్లో ఆర్థిక, వాణిజ్య, పెట్టుబడి భాగస్వాములుగా ఉన్న ఈ కూటమిలోని దేశాలు అనంతరం కాలంలో మరింత బహుముఖీయంగా, బహుజాతీయంగా తమ కార్యకలాపాలను విస్తరించాయి.

కొత్త దేశాల వల్ల ఉపయోగం

అమెరికా తనకు, తన 13 మిత్ర దేశాలకు కీలక ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు అనుసరించిన ఖనిజ భద్రతా భాగస్వామ్య పద్ధతి (ఎంఎస్‌పి) వంటి పద్ధతినే బ్రిక్స్ అనుసరించనుంది. దక్షిణ అమెరికాలో మూడవ లిథియం రిజర్వులు గల దేశమైన అర్జెంటీనాకు సభ్యత్వం ఇవ్వడంతో లిథియం సరఫరాలకు లోటు ఉండదు. కీలక ఖనిజాల సరఫరా లంకెలో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను బ్రిక్స్ పెంచనుంది. బ్రెజిల్‌లో లిథియం, కీలక ఖనిజాలలో ఇప్పటికే సౌదీ అరేబియా విశేషంగా పెట్టుబడులు పెడుతోంది.

అంతేకాదు, ప్రపంచ చమురు సరఫరాలో 42శాతాన్ని కలిగిన అతిపెద్ద చమురు ఎగుమతి దారులైన సౌదీ అరేబియా, యుఎఇ, ఇరాన్‌లు బ్రిక్స్‌లో ఉం డటం అన్నది ఆ కూటమికి విలువను ఆపాదించే విషయమే. వెనిజులా, ఇరాన్‌పై పాశ్చాత్య ఇంధన ఆంక్షల గురించి అనేక సంవత్సరాలుగా ఒపెక్+దేశాలు ఫిర్యాదు చేస్తున్నాయి. దీనివల్ల పెట్టుబడులు, ఎగుమతి సరఫరాలు దెబ్బతింటున్నాయన్నది వారి ఆందోళన. అయితే, అతిపెద్ద చమురు, సహజవాయు దిగుమతిదారులైన చైనా, భారత్ బ్రిక్స్‌లో ఉండడం మరొక ప్లస్ పాయింటే, రష్యాను లక్ష్యంగా చేసుకున్న ధరల నియంత్రణ సంకీర్ణంలో చేరేందుకు ఈ రెండు దేశాలూ అంగీకరించని విషయం తెలిసిందే. ఇంధన ఆంక్షలు పెరిగిపోతుండడంతో, ద్వైపాక్షిక ఇంధన ఒప్పందాల సంఖ్య కూడా పెరిగిపోతున్నది. అది కూడా చైనా రెన్‌మిన్‌బీ లేదా భారతీయ రూపాయలలో కుదుర్చుకుంటున్నారు.

ప్రపంచ సంక్షేమం కోసం బ్రిక్స్ చేస్తున్న కృషి ఇంకా శైశవ దశలోనే ఉంది. ఆ కూటమి లక్ష్యాలు, కార్యాచరణ వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలే కాదు పేద దేశాలు కూడా లాభపడతాయి. 'వసుధైక కుటుంబం' అన్న భారత భావనను నిజం చేయడంలో ఈ కూటమి తనవంతు దోహదం చేస్తోంది. ★

'కార్టూన్ పోటీ - 2023'లో తృతీయ బహుమతి పొందినది



సెప్టెంబర్ 7 కృష్ణాష్టమి

మనుష్య రూపం దేవకీ తనం

మహాభారతానికి నాయకుడు. దుష్టులకు ప్రళయకాలరుద్రుడు. సజ్జనులకు ఆశ్రయస్థానం.. మహోయశస్వి.. జ్ఞాని.. కూట నీతిజ్ఞుడు, స్థితప్రజ్ఞుడు. సర్వగుణాలు మూర్తీభవించిన పూర్ణావతారుడు. ఆగర్భ శత్రువులు సైతం పులకాంకితులై వినమ్రతతో మోకరిల్లే సౌశీల్య సౌజన్యమూర్తి. చేపట్టిన కార్యం క్లిష్టతరమైనా, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా మార్గాన్ని సుగమం చేసుకోగల వివేకి. కష్టాలు, సమస్యలు ఎదురైనప్పుడు మానసిక ధైర్యంతో ముందడుగు వేసి, మానవాళికి దిశానిర్దేశం చేసిన 'గీతా'చార్యుడు. గోపాలన నుంచి రాజసూయంలో అగ్రతాంబూలం అందుకునేవరకు, కుచేలుడితో మైత్రి నుంచి గీతోపదేశం వరకు షోడశకళా ప్రపూర్ణుడిగా సాక్షాత్కరిస్తాడు. పరమయోగులకే అంతుపట్టని దివ్యత్వం ఆయన సొంతం. ఆయన జీవితం ఆద్యంతం మానవాళిని 'జాగృతి' పరిచేదే. శ్రీకృష్ణలీలల గురించి అనేక గాథలు ఉన్నాయి. కానీ, ఆయన ప్రదర్శించిన సామాజిక ఆదర్శాలు మాత్రం అంతగా ప్రస్తావనకు రావు. ఆధునిక జీవితంలో సర్వ సంక్షోభ నివారణకు 'కృష్ణతత్వమే' సరైన జవాబు అని వ్యక్తిత్వ వికాస నిపుణులూ అంటున్నారు.

'కృష్ణ' అనే పదానికి గల అనేకార్థాలలో కష్టాలను పోగొట్టేవాడు, ఆకర్షించేవాడు అనేవీ ఉన్నాయి. 'వస్తూని కోటి శస్సంతు పావనాని మహీతలే! నతాని తత్తులాం యాంతి కృష్ణ నామాను కీర్తనే!! (ధరాతలంపై గల పవిత్ర వస్తువులన్నింటినీ కలిపినా శ్రీకృష్ణనామ సంకీర్తనకు సాటిరావు) అని శ్రీకూర్మ పురాణం పేర్కొంటోంది. యదువంశంలో క్షత్రియ కుటుంబంలో చెరసాలలో పుట్టాడు. మేనమామ కంసుడి దురాగతాల వల్ల అక్కడి నుంచి మాయమై కన్నవారికి దూరంగా పెరిగాడు. అడుగడుగునా గండాలైనా ఎదిరీది నిలిచాడు. అయినా అందరివాడై ప్రేమానందాలు పంచాడు. 'గోవిందుడు అందరి వాడు' అనిపించుకున్నాడు. భాగవతంలోని కృష్ణయ్య అమాయక బాలుడు, సున్నిత స్వభావుడు. మహాభారత కృష్ణుడు దార్శనికుడు, రాజకీయ చతురుడు, వ్యూహకర్త.

మరోవంక, దుర్మార్గులను, దుర్మార్గాలను పెంచిపోషించే వారిని శిక్షించడంలో సామాన్య రక్షణ ధర్మాలు పాటించనవసరంలేదన్నది శ్రీకృష్ణ 'మతం'. 'ధర్మాత్ములైన వారు యుద్ధం అనివార్యమైనప్పుడు యుద్ధనీతి, ధర్మాలు పాటించాలి తప్ప దుర్మార్గాలకు ప్రతినిధుల వంటి దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, జరాసంధ, శిశుపాల, సైంధవుడు వంటి వారి విషయంలో ఆ అవసరంలేదు. సహజ నియమాలకు విరుద్ధంగా ప్రవర్తించేవారు జీవించే హక్కును కోల్పోతారు. అలాంటి వారిని ఏ మాయోపాయంతో సంహరించినా పాపకార్యం కాదు' అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించినట్లు ఆయన చర్యలు, వ్యూహాన్ని బట్టి అవగతమవుతుంది. అయినా అలాంటి వారిలో మార్పు కోసం అనేక అవకాశాలు ఇచ్చాడు. 'తా పట్టిన కుందేటికి..' సామెతలా వ్యవహరించేవారిని, కారణాంతరాల వల్ల వారిని బలపరిచేవారిని రణరంగంలో ఊచకోత కోయించాడు. 'కృష్ణ పథం'ను అనుసరించి ధర్మ ప్రతిష్ఠాపన, స్వరాజ్య స్థాపనలో చంద్రగుప్త విక్రమాదిత్య, శివాజీ మహరాజ్ లాంటి వారు కృతకృత్యులయ్యారు..

ప్రకృతి హితైషి

శ్రీకృష్ణుడు ప్రకృతి ప్రియుడు. ప్రకృతి కోసమే పుట్టాడు. సమస్త ప్రాణులలో నివాసం ఉండడం, దేవతలు ఆయనలో కొలువుదీరడం వల్ల వాసుదేవ (వాసనాత్ సర్వభూతానాం వసుత్వాత్ దేవ యోనితః) అని పేరు వచ్చిందని వ్యాస భారతం పేర్కొంటోంది. గోవులను కాశాడు. లేగదూడలతో ఆడుకున్నాడు. కొండలు, గుట్టలు ఎక్కాడు. జతగాళ్లతో చల్దులు ఆరగించాడు. మన్ను తిన్నాడు. వనమాల, శిఖిపింఛంధరించి గ్రామాలలో (స్థానికంగా)దొరికే వస్తువులనే ఉపయోగించాలనే సందేశాన్ని ఇచ్చాడు. స్వావలంబనం ముఖ్యమని చాటిచెప్పేలా వెదురుతో మురళి తయారు చేశాడు... తన ఊరిలో దొరికిన వెన్న, మీగడ తిన్నాడు. పల్లెలోని జతగాళ్లకు పెడుతూ తానూ ఆరగించాడు. ఇలా ఆయన బాల్యం గ్రామత్వాన్ని చాటుతుంది. గోకులాన్ని వదిలి ద్వారకకు చేరినా 'అటుకుల' రుచిని మరువలేదు.

గ్రామంలోని పశుపక్ష్యాదులను, నదులను, పర్వతాలను ప్రేమించాడు. కళ్ల ముందున్న ప్రకృతిని కాదని 'ఇంద్రపూజ' చేయడాన్ని నిరసించాడు. 'మన కోసం మన పక్కనే వెలసి, అన్నీ ఇచ్చే గోవర్ధనం ఉండగా ఎక్కడో ఉన్న ఇంద్రుడికి పూజలు ఎందుకు? ఈ 'గిరి' పశువులకు గ్రాసం, పక్ష్యాదులకు నీడ, మనిషికి ఫలపుష్పాలు, ఓషధులు వంటివి ఇస్తుంది. గోవు అమ్మలాంటిది. సమస్త దేవతలకు నిలయం. ఇంతకు మించిన ప్రత్యక్ష దైవాలు ఏముంటాయి? ఎక్కడ ఉంటాయి?' అంటూ ఆనాదిగా వస్తున్న 'ఇంద్రపూజ'కు స్వస్తి చెప్పి 'గోవర్ధనపూజ'కు శ్రీకారం చుట్టాడు. అది ప్రకృతి ఆరాధనే కానీ దైవ ధిక్కారం కాదు. ఆధునిక కాలంలో ప్రకృతి విధ్వంసకులకు, గో హింసాత్మకులకు దేవదేవుడి సందేశం ఓ పాఠం లాంటిది.

నాయకత్వ లక్షణాలు

'చిన్ని' కృష్ణుడిగానే నాయకత్వ లక్షణాలు ప్రదర్శించాడు. నాయకుడు అంటే మార్గదర్శనం చేస్తూ, కడకంటూ పోరాడాలి తప్ప పలాయనం చిత్తగించకూడదని సూచించాడు. ఇంద్రుడి ప్రతాపాన్ని అడ్డుకుని గోకులాన్ని రక్షించేందుకు గోవర్ధన గిరిని చిటికెన వేలిపై నిలిపిన సంఘటనే అందుకు ప్రథమోదాహరణ. చక్రటి వ్యూహం ఉంటే ఆయుధం పట్టకుండా కదనాన్ని నడిపించవచ్చని కురుక్షేత్రంలో నిరూపించాడు. 'వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి' అన్నట్లు అధర్మాన్ని అవసరమైతే అధర్మయత్నాలతోనే జయించి ('అశ్వత్థామ హతః కుంజరః' లాంటిది) ధర్మాన్ని రక్షించడమే కృష్ణావతార ధ్యేయం. లోకరక్షణ, ధర్మం విషయంలో బంధువులు, స్నేహితులు, వృద్ధులు, గురువులు...లాంటి వ్యత్యాసాలు లేవు. లోక కల్యాణం కోసం వ్యక్తిగత ప్రేమానురాగాలను, మానవమానాలను, సుఖదుఃఖాలను, భయ క్రోధాలను లెక్కచేయకపోవడం కృష్ణతత్వం. శక్తి సామర్థ్యాలు ఉన్నా ఏలికల అత్యాచారాలను ప్రతిఘటించకుండా పరోక్షంగా బలపరిచిన వారందరి శిక్షలకు కారకుడయ్యాడు. వ్యక్తి/వృత్తిగతంగా ఎంతో సచ్ఛీలురు, పరాక్రమ వంతులైనా లోకధర్మ రక్షణకు ముందుకురాని వారినీ కురుక్షేత్ర సంగ్రామంలో వైరి రాజులతో పాటు సంహరించ నిశ్చయించాడు. మంచి మాటలు చెవికెక్కని దుర్మార్గులు వారు 'వారి పాపాన వారే పోతారు' అనే వాదనకు తావివ్వక వారిని సమూలంగా

లో దైవం
ుడు

డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి

అంతమొందించి నాటి భారత్‌ను వారి రక్తంతోనే క్షాళన చేశాడు.

ఉత్తమ రాజనీతిజ్ఞుడు

మహాభారతాన్ని రాజకీయ కోణంలో పరిశీలిస్తే కృష్ణుడిదే కీలక పాత్ర. అక్రమ వర్తనులు, ప్రజాకంటకులు అయిన రాజులను అంతం చేసి, దేశాన్ని నిష్కంటకం చేసి ప్రజలకు సుఖశాంతులు ప్రసాదించాడు. సమర్థ పాలకుల చేతిలోనే రాజ్యం ఉండాలనే భావనతో ధర్మరాజుతో రాజసూయ యాగం చేయించి ఏకచ్ఛత్రాధి పత్యాన్ని కల్పించాడు. ఎందరో రాజులు పాదాక్రాంతులయ్యారు. ఎన్నో సింహాసనాలు దక్కాయి. కానీ ఆది నుంచి 'సమ్రాట్ నిర్మాత' (కింగ్ మేకర్)గా ఉండాలనుకున్నాడే కాని రాజు కావాలని, రాజ్యాలు ఏలుతూ రాజభోగాలు అనుభవించాలని ఉవ్విళ్లూరలేదు. పదవుల కోసం పాకులాడకుండా, అన్యాయార్జితానికి పథకాలు వేయకుండా ధర్మరక్షణ, సుపరిపాలన కోసం రాజకీయాన్ని రసవత్తరంగా నడిపిన దురంధరుడు. కంస వధానంతరం, మగధ రాజ్యాధిపత్యం స్వీకరించవలసిందిగా వృద్ధుడైన ఉగ్రసేనుడు కోరాడు. 'కంసవధతో విజేతగా రాజ్యం నీకు (కృష్ణుడి) సంక్రమించినట్లే. పైగా వృద్ధాప్యంతో అశక్తుడైన నేను రాజ్యపాలనకు అనర్హుడిని' అని తాత ఉగ్రసేనుడు పలికాడు. దానికి కృష్ణుడు 'నహి రాజ్యేన మే కార్యం/నాప్యహం నృప కాంక్షితః/ న చాపి రాజ్యలబ్ధేన/మయా కంసో నిపాతితః' (నాకు రాజ్యకాంక్ష ఎన్నడూ లేదు. కంసుడిని చంపింది రాజ్య లోభంతో కాదు)అని బదులు ఇచ్చాడు. 'అహం స ఏవ గోమధ్యే/గోపై స్సహ వనే తరః' (నేను గోవుల మధ్య అడవుల్లో తిరిగేందుకు పోతాను) అని విన్నవించాడు. ఇలాంటి స్థిత ప్రజ్ఞత్వం, నిస్వార్థం వల్లనే, రాజ్య సింహాసనం ఎక్కకపోయినా ప్రజా హృదయ పీఠాన్ని అధిష్టించగలిగాడు.

ఎదిగినా ఒదిగొదిగి...

కృష్ణయ్య బాల్యం నుంచీ అహంభావత్వాన్ని త్యజించాడు. గోకులంలో ఎంత చిన్నవారితోనైనా ప్రేమగా మెలగేవాడు. భావికాలంలో నరుడు అర్జునుడి రథానికి ఈ నారాయణుడు 'సారథి'గా మారాడు. తన అల్లుడు కంసుడిని వధించినందుకు మగధరాజు జరాసంధుడు కృష్ణుడిపై ప్రతీకారంతో మధురపై పదహారుసార్లు దాడిచేశాడు. తనపై గల వ్యక్తిగత కక్ష ప్రజలకు శాపంగా మారకూడదని, తనవల్ల వారు ఇక్కట్లపాలు కాకూడదనే భావనతో వేరే నగరాన్ని (ద్వారక) నిర్మించుకుని దూరంగా ఉన్నాడు. నరకాసురుడి చెరలోని పదహారు వేలమంది మహిళలను ఆదుకుని గౌరవ జీవితం ప్రసాదించాడు. ఈ వృత్తాంతంపై '16 వేలమంది భార్యలను పోషించిన అపర నిజాం' అని కొందరు ఆధునిక మేధావులు వ్యాఖ్యానించారు. తార్కికంగా ఆలోచిస్తే... ఆ మహిళల (నరకుడి చెరలోని) యుక్తవయస్సు దాదాపు అక్కడే గడిచిపోయింది. విముక్తిపొందిన తమను కన్నవారు కానీ, ఇతరులుకానీ ఆదరించరని మొర పెట్టుకోగా వారికి 'భర్త'గా ఉంటూ సమాజంలో గౌరవ ప్రతిపత్తులు కల్పించాడు. ఇక్కడ 'భర్త'పాత్ర అంటే కేవలం అండదండలు ఇవ్వడమే కాని కురచ మనస్తత్వంతో ఆలోచించే సంసార సుఖం కాదని ప్రవచనకర్తలు, ఆధ్యాత్మికవేత్తలు చెబుతారు. ఏడున్నర దశాబ్దాల క్రితం దేశవిభజన నేపథ్యంలో ఎందరు మహిళలు విగత భర్తృకలై అవమానాల పాలయ్యారు? సమాజం ఎందరిని ఆదరించింది? అనే దానినిపై ఆత్మపరిశీలన చేసుకుంటే అలాంటి వ్యాఖ్యాలకు ఆస్కారం ఉండేది కాదు.

విశ్వశాస్త్రం 'గీత'

మానవ మస్తిష్కాలపై చెరగని ముద్ర వేసిన భగవద్గీత విశ్వశాస్త్రంగా మన్ననలు అందుకుంటోంది. గీతోపదేశంతో శ్రీకృష్ణ స్వరూపం ఉన్నత శిఖరాన్ని అందుకుంది. 'నాకు విజయంపై కోరికలేదు. విజయం సాధించడం నాకు పరమార్థం కాదు. రక్తసిక్తమైన విజయంతో భోగభాగ్యాలను అనుభవించ లేను' ('న కాంక్షే విజయం కృష్ణా...')అని ఆత్మ స్థయిర్యం కోల్పోయిన అర్జునుడిలో మనోధైర్యం నింపాడు. 'అధర్మం పెచ్చరిల్లి ధర్మం మసకబారి నప్పుడు ధర్మసంస్థాపన కోసం నన్ను నేనే సృష్టించు కుంటాను. నీవు నిమిత్త మాత్రుడివి. 'చేసేది, చేయించేది నేనే' అనినర్వభారం తనపైనే వేసుకున్నాడు. యోగీశ్వరుడైన కృష్ణుడు, ధనుర్ధారి అయిన అర్జునుడు ఉండే చోట విజయం' తథ్యమని ('యత్రయోగీశ్వరః కృష్ణో....') చెలికాడికీ సమాన కీర్తిని కట్టబెట్టాడు.

'గీత' భగవానుడు ప్రసాదించిన అద్భుత గ్రంథరాజమని, అదే లేకపోయి ఉంటే ప్రపంచ వాఙ్మయం పరిపూర్ణమయ్యేది కాదని జ్ఞానులు, మేధావులు శ్లాఘించారు. భగవద్గీత'లోని ఒక్క శ్లోకాన్నయినా గురు ముఖతః అధ్యయనం చేసిన వారుధన్యులవుతారని జగద్గురువు శంకర భగవత్పాదులు ఉద్బోధించారు.

కర్మకు, జీవితానికి ఉండే సంబంధం ఏమిటి? కర్మను ఏ విధంగా అచరిస్తే మానవుడు అంతిమ ధ్యేయం సాధించగలుగుతాడు? మొదలైన ప్రశ్నలకు పరిష్కార కావ్యమది. అది స్వదేశీయులను, విదేశీయులకు, తత్వజ్ఞులకు, మాతృదేశ విముక్తి పరులకు కర్తవ్యబోధ చేసింది

స్థితప్రజ్ఞతకు ప్రతీక

జననం నుంచి అవతార పరిసమాప్తి వరకు పలు సందర్భాలలో మానవాతీతుడిలా లీలలు ప్రదర్శిస్తూనే, సామాన్యుల మాదిరిగా కష్టనష్టాలను ఎదుర్కొన్నాడు. అయితే, స్థితప్రజ్ఞత ప్రదర్శించాడు. తాను ఆచరించిన దానిని మానవాళికి 'గీత'రూపంలో సందేశం ఇచ్చారు. అధర్మవర్తనులైన దుర్యోధనాది ధార్తరాష్ట్రులను పట్టించుకోకుండా, ధర్మమార్గాన్ని అనుసరించే కౌంతేయులవైపు మొగ్గి పాండవ 'పక్షపాతి'అనే నిందను ఆనందగానే భరించాడు. రాజసూయ సభలో అగ్రతాంబూలం స్వీకరణ సందర్భంబంగా అవమానాలు ఎదుర్కొన్నా, ఇష్టంగా నిర్మించుకున్న ద్వారకానగరం సాగరగర్భంలో కలిసిపోతున్నా అదే స్థితప్రజ్ఞత. 'మునుల, పతివ్రతా శిరోమణి గాంధారి శాపాల కారణంగా ముసలం పుట్టి యదుక్షయానికి కారణమవుతుంది. నేటికి ఏడవ రోజున సముద్రుడు ద్వారకను ముంచేస్తాడు. యుగసంధి ఆసన్నమైంది. కలియుగం ఆరంభమవు తుంది' అని ఉద్ధవునికి బోధిస్తాడు. అన్న బలరాము డిని మహాప్రస్థానానికి సిద్ధం చేసి, తాను అడవిలో విశ్రమించిన వేళ బోయ వాడి శరాఘాతంతో మహానిర్యాణంతో వైకుంఠ ధామం చేరాడు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

సంపద సృష్టికి సోపానం

'ధనం మూలం ఇదం జగత్' అనే ఆర్యోక్తిని మనం అనుదినం మననం చేసుకోవాలి. ఆధునిక సాంకేతికత పురోగమిస్తున్న తరుణంలో ద్రవ్యం– దాని విలువ, ప్రాముఖ్యం, సక్రమంగా ఎలా వినియోగించుకోవాలి, ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు– మదుపు, సంపద సృష్టి, ఆర్థికంగా పురోగతి సాధన తదితర అనేక అంశాలపై అవగాహన పెంపొందించుకోవలసిన ఆవశ్యకత ఉంది.

మనిషి పుట్టినప్పటి నుంచి మరణం వరకు నిత్యం తీసుకొనే నిర్ణయాలు అనేకం. అంటే వస్తుసేవల ఉత్పత్తి, పంపిణీ, కొనుగోళ్లు, అమ్మకాలు, బేరసారాలు, చెల్లింపులు, అప్పులు, తిరిగి చెల్లింపులు మొదలైనవి. ఈ అంశాలన్నీ ఆర్థిక అవగాహనపై ఆధారపడి ఉంటాయి. సమాజంతో అన్ని రకాల మానవ సంబంధాలకు మూలం ద్రవ్యం. ఆర్థిక అక్షరాస్యత అంటే ఏమిటి? మన వద్ద ఉన్న డబ్బును తెలివిగా ఎలా వినియోగించుకోవాలి అనే విషయ పరిజ్ఞానాన్ని కలిగి ఉండటం. అనేకమంది జీవితంలో సరైన ఆర్థిక అక్షరాస్యత లేకపోవటంవల్ల ఆ కోణానికి సంబంధించి అనేక తప్పుడు నిర్ణయాలు తీసుకొని వ్యయాలను పెంచుకొని అప్పుల పాలవు తుంటారు.

నిబంధన 1: ఎప్పుడూ డబ్బు పోగొట్టుకోకు.

నిబంధన 2: నిబంధన 1ని ఎప్పుడూ మరచిపోకు.

– వార్నర్ బఫెట్

(అమెరికా వ్యాపార దిగ్గజం, దాత. బెర్క్‌షైర్ హాత్‌వే సీఈఓ)

తాను మంచివాళ్ల చేతులలోనే ఉన్నానని ధనం గ్రహిస్తే అది ఆ చేతుల లోనే ఉండి పోవాలని అనుకుంటుంది. అంతేకాదు, మరింత పెరగాలని కూడా అనుకుంటుంది.

– ఇదపు కొయెనికన్

(అమెరికా ఆర్థిక వ్యవహారాల నిపుణుడు, 'వెల్త్ ఫర్ ఆల్ ఆఫ్రికన్స్' పుస్తక రచయిత)

దైనందిన, కుటుంబ వ్యయ రాబడుల బడ్జెట్‌ను రూపకల్పన ఎలా చేసుకోవాలనే అంశాలతో పాటు చాలా ఆర్థిక నిర్ణయాలతో ద్రవ్యాన్ని తెలివిగా గరిష్ఠ ప్రయోజనం కలిగే విధంగా కేటాయింపులు చేసుకొని సక్రమమైన మార్గాలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా దీర్ఘకాలంలో ఆస్తిపాస్తులను సమకూర్చుకునే దిశగా ప్రయాణించగల సామర్థ్యాన్ని సమకూర్చుకోవడాన్ని ఆర్థిక అక్షరాస్యత అని చెప్పవచ్చు.

ఆర్థిక అక్షరాస్యతతో కుటుంబ బడ్జెట్ రూపకల్పన, వ్యయాలపై అదుపు, సక్రమ వినియోగంతోపాటుగా పొదుపు ఎలాచేయాలి, వడ్డీ రేట్లపై అవగాహన, క్రెడిట్ స్కోర్సు, పెట్టుబడి వ్యూహాలు మొదలైన అంశాలపై తగిన పరిజ్ఞానాన్ని పొందడంగా వ్యవహరించవచ్చును.

కేవలం విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకొనే అంశంగా ఆర్థిక అక్షరాస్యతను పరిగణించరాదు. అన్ని దశలతో ప్రతి వ్యక్తికి నిత్యం అవసరమైన అవగాహన 'ఆర్థిక అక్షరాస్యత'. అన్ని వర్గాల వ్యక్తులకు, సంస్థలకు, అధికారులకు, యాజ మాన్యాలకు, నిర్వాసితులకు, ఆర్థికపరమైన అవగాహనను అందించేది ఆర్థిక అక్షరాస్యత. ఏ వ్యక్తి అయినా నిత్య జీవితంలో ఆర్జించే రాబడులు, కుటుంబ వ్యయాలు, గృహ నిర్మాణం, పొదుపు– పెట్టుబడులు, షాపింగు, బీమా పాలసీలు, రిటైర్ మెంటు పథకాలు, స్టాక్ మార్కెట్ కార్యకలాపాలు వంటి అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవలసి ఉంది. కేవలం వ్యాపార వాణిజ్యవేత్తలకు, ధనికులకే కాదు, ప్రతి వ్యక్తి ఆర్థిక అంశాలపై కనీస అవగాహన



శక్తి కలిగి ఉండాలి. భవిష్యత్ అవసరాలకు బ్యాంకులలో పొదుపు ఖాతాలతో ద్రవ్య నిల్వ చేయటంవల్ల దీర్ఘకాలంలో ద్రవ్యం విలువ, కొనుగోలు శక్తి ఎలా మారుతుంది? ద్రవ్యాన్ని ఏఏ మార్గాలలో మదుపు చేయాలి? ఆర్థిక ప్రణాళిక, ఆర్థిక నిర్వహణ సామర్థ్యాలను ఎలా పెంచుకోవాలి? ఇలాంటివి ఆర్థిక అక్షరాస్యత నేర్పుతుంది.

ఆర్థిక విద్య అంటే?

ఒక వ్యక్తి ఆర్థిక శ్రేయస్సుకు అనుకూలంగా ప్రభావితం చేసే ఎంపికలకు సంబంధించిన విద్య 'ఆర్థిక విద్య.'

ద్రవ్యాన్ని ఎలా వినియోగించుకోవాలి? ఎలా పొదుపు, మదుపులు జేయాలి? వ్యక్తి దీర్ఘకాలిక అవసరాలకు అనుగుణంగా ఎలా ముందుకు సాగాలి? ఆర్థిక చైతన్యం, పరిజ్ఞానం, ప్రణాళికల రూపకల్పన, అమలు ద్వారా ఆర్థిక అవరోధాలను అధిగమించడానికి ఉపయోగపడే సోపానమే ఆర్థిక విద్య.

ఆర్థికపరమైన సమస్యలు లేదా ఆర్థిక అనిశ్చిత స్థితి తట్టుకోవాలంటే వ్యక్తికి ఆర్థిక ప్రణాళిక

అత్యవసరం. ప్రస్తుతం ఎంత ఆదాయం సమకూరుతున్నది? కుటుంబ వ్యయాలు ఎలా పెరుగుతున్నాయి? రాబోవు కాలంలో పెరుగనున్న ఆదాయ, వ్యయాలు ఎలా ఉండబోతున్నాయి? అందుకు అనుగుణంగా ఎలాంటివి ఆర్థికచర్యలు తీసుకోవాలి అనే పలు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన విజ్ఞానం 'ఆర్థిక విద్య' ద్వారా సమకూరుతుంది. 'పదవీ విరమణ' తప్పదు కనుక, రిటైర్మెంట్ తదనంతర జీవన మనుగడకు అవసరమైన ఆర్థిక వనరులు ఎలా సమకూర్చుకోవాలి? దీనికి సమాధానం పదవీ విరమణకు ముందుగానే అందుకు చర్యలు తీసుకోవాలి.

మానవుల ఆర్థిక జీవనయానంలో సప్త మార్గాలు

ఉన్నాయి. ఒక మనిషి తాను పురోగమించేందుకు అతని ఆలోచనలు, సంకల్పబలం, సాధించాలనే తపన, సక్రమ ప్రణాళికలు, జాగరూకత వంటి అంశాలు దోహదం చేస్తాయి.

ఆర్థిక విద్య సముపార్జనలో అనేక రకాల అంశాల మిళితమై ఉన్నాయి. కేవలం జ్ఞానంతో ఎలాంటి ప్రయోజనమూ కలగదు. ఆ జ్ఞానాన్ని తన జీవిత అవసరాలకు అన్వయించి సక్రమ ప్రణాళిక ద్వారా ముందుకు సాగాలి. ఫలితాలు మాత్రం దీర్ఘకాలంలో సమకూరుతాయి.

కనుక, ప్రతి వ్యక్తీ ఆర్థిక అక్షరాస్యత సాధించాలి.

ద్రవ్య నిర్వహణ ఓ కళ

ఎంత మొత్తంలో ధనార్జన చేస్తున్నాం అనే ప్రశ్న కన్నా, సంపాదించిన ధనాన్ని ఎలా ఖర్చుచేస్తున్నాం అనే అంశం చాలా విలువైనది.

తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్ మంచి జీవన ప్రమాణాలు కలిగి ఉండాలని కష్టించి వారిని ఉన్నత విద్యల వైపు, వృత్తి నైపుణ్యాల పెంచే దిశగా చదివించి పెద్ద పెద్ద ఉపాధి స్థాయిలలో నిల్పుతున్నారు. అయితే, నేటి మన విద్యా వ్యవస్థలో అర్థశాస్త్ర పరిజ్ఞానం అందించగలిగే అవకాశం ఎక్కువగా లేకపోవటం, ద్రవ్యం దాని స్వరూప స్వభావాలు, ఎలా సక్రమ మార్గాలలో ఖర్చుచేయాలి అనే విషయాన్ని విద్యార్థులు పొందలేకపోవటం వల్ల వారు అనేక పర్యవసానాలను ఎదుర్కొంటున్నారు.

(ఎ) మనం ఎంతమేరకు మన దగ్గరున్న 'డబ్బు'ను సక్రమ మార్గంలో ఖర్చు చేయగల్గుతున్నాం?

(బి) కేవలం 'ధనం' ఎక్కువ మొత్తంలో సముపార్జన చేయటం వల్లనే 'సంపద' సృష్టి జరుగుతుందా!

(సి) నేటి 'ధనికవర్గం'లోని వారు పుట్టుకతోనే, వారసత్వం వల్ల ధనికులుగా కొనసాగుతున్నారా?

(డి) ద్రవ్య నిర్వహణ ఎలా చేయాలి?

ప్రతి వ్యక్తీ తన జీవితకాలంలో వివిధ మార్గాలలో ధనార్జన చేసి కుటుంబ జీవనం, మనుగడ సాగిస్తున్నారు. మానవుల మనుగడ, భద్రత, అవసరాలు, సౌకర్యాలు, విలాసాల కోసం ఎంత మొత్తంలో ధనం అవసరం ఉంటుంది?

కొంతమంది జీవితం అంటేనే 'డబ్బు'ను కూడ బెట్టడం, సంపదను సృష్టించటం అనే ఆలోచనతో అధికశ్రమకు లోనై, వివిధ మార్గాలలో శక్తికి మించి ద్రవ్యాన్ని సంపదిస్తున్నారు. మరికొందరు జీవిత కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని 'పేదరికం'తో ప్రగ్గుతున్నారు.

అయితే, శ్రమజీవనం, సామాజిక జీవనానికీ మధ్య సౌకర్యవంతమైన జీవన పనిముట్ల కోసం పోరాటమే జీవిత గమ్యం కావాలి కానీ లక్ష్యం కారాదు.

నిరాడంబరమైన జీవనశైలితో, ఉన్నతమైన ఆలోచనలతో, చైతన్యం కలిగి ఉండి సక్రమ మార్గాలతో చట్టబద్ధమైన మార్గాలలో ద్రవ్య సముపార్జన చేయాలి.

కె. గోపీకృష్ణ

విశ్రాంత ఉపన్యాసకులు

అదేవిధంగా ఖర్చులపై నియంత్రణ అవసరం. 'కుటుంబ బడ్జెట్'ను రూపకల్పన చేసుకొని రాబడి, వ్యయాలపై తగిన శ్రద్ధపెట్టి, ఆర్థికభద్రత కోసం ఆదాయంలో కనీసం 10శాతం 'పొదుపు'గా భవిష్యత్ వ్యయాల కోసం నిల్వ చేయాలి.

విలాసవంతమైన జీవన అవసరాలతో, పోటీ ప్రపంచంతో పరుగులు తీస్తూ 'జీవిత లక్ష్యాల'ను మరచి, 'డబ్బు'తోనే జీవితం అనే 'భ్రమ'తో మానసిక ప్రశాంతతకు దూరంగా జీవించటంవల్ల కలిగే ప్రయోజనం శూన్యం.

ఆర్థిక అక్షరాస్యత ఎందుకు అవసరం?

ఆర్థికాంశాలపై చేసే నిర్ణయాలకు కావలసిన నైపుణ్యాలను పెంపొందించడంలో 'ఆర్థిక అక్షరాస్యత' సహాయకారిగా ఉంటుంది.

వివిధ రకాల ఆర్థిక స్థితిగతులను, రాబోయే కాలంతో జరుగబోయే ఆర్థిక పరిణామాలను అంచనా వేసేందుకు, ఆర్థిక అంశాలపట్ల అవగాహన మెరుగుపర్చటంలో ఆర్థిక అక్షరాస్యత తోడ్పాటును అందిస్తుంది. అంటే, కుటుంబ బడ్జెట్, పొదుపు, పెట్టుబడులు, వ్యక్తిగత రుణ నిర్వాహణా సామర్థ్యం తదితర అనేక వ్యక్తిగత ఆర్థికాంశాలతోపాటు వ్యవస్థల స్థితిగతులు, దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలను అర్థం చేసుకోగలుగుతారు.

తగిన సమాచారంతో కూడిన విశ్లేషణతో సరైన సమయంలో తగిన రీతిని ఆర్థికాంశాలతో నిర్ణయాలను తీసుకోగల్గి సమర్థతను ఆర్థిక అక్షరాస్యతవల్ల వ్యక్తులు పొందుతారు.

ఆర్థిక అక్షరాన్యతవల్ల ఆర్థికాంశాలలో సక్రమంగా ఎంపికలు చేయగలుగుతారు. లాభ నష్టాలను సక్రమంగా అంచనా వేయగలరు. ఊహించని జీవిత సమస్యలను సమర్థంగా పరిష్కరించుకోగలుగుతారు. ఆర్థిక ప్రణాళికల రూపకల్పన, వనరుల కేటాయింపు, ఎంపిక, దీర్ఘకాలిక ఆర్థిక భద్రత ఏర్పాట్లు, రుణాల నిర్వహణ, వడ్డీరేట్లతో హెచ్చుతగ్గుల వర్యవసానాలను అంచనావేయగలిగే సామర్థ్యాలు 'ఆర్థిక అక్షరాస్యత' వల్ల సమకూరుతాయి. కనుక 'ఆర్థిక అక్షరాస్యత' కాదనలేనిది.

(సశేషం)

బుర్రకథ

నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలు

చరిత్రకు ఛాయ సాహిత్యం. సృజనాత్మక సాహిత్య ప్రక్రియతో అక్షరబద్ధమైన చారిత్రకఘట్టం త్వరగా జనం గుండెలను తాకుతుంది. దీనిలో తేదీలూ, కార్యకారణ సంబంధాలూ కంటే వైయక్తిమైన అనుభవాలకు చోటు ఎక్కువ. దానికి జనాన్ని కదిలించే శక్తి అధికం. ఇక ప్రదర్శన కళ అయితే చెప్పేదేముంది? అడ్లూరి అయోధ్యరామ కవి 'పోలీసు చర్యలు' బుర్రకథ అలాంటిదే. 1922లో వరంగల్ జిల్లా, తాడికొండలో జన్మించిన అయోధ్యరామ కవి పత్రికా నిర్వాహకుడు, కవి, రచయిత. నైజాం విముక్తి పోరాట యోధుడు కూడా. ఆయన బుర్రకథలు, పద్యాలు, గేయాలు, నాటికల ద్వారా హైదరాబాద్ విలీనం చరిత్రను ప్రజలకు అందించారు. ఇందులో 'పోలీస్ చర్యలు' బుర్రకథ బాగా ప్రాచుర్యం పొందింది. బుర్రకథ ప్రక్రియలో ముగ్గురు కళాకారులు ఉంటారు. కథకుడు, ఇద్దరు వంతలు. బుర్రకథ రాజకీయ, ఉద్యమ స్పర్శ ఉన్న గాథలను జనం దగ్గరకు చేర్చడానికి ఉపయోగపడే బలమైన మాధ్యమం. ఆట, పాట, ఉద్విగ్నత, నాటకీయత ఇందులో ప్రత్యేకతలు.రామకవి కథలో నిజాం విముక్తి చరిత్ర ప్రతిఘట్టం, ప్రతి అడుగును వర్ణించారు. ఇదొక చారిత్రక ఆధారమే.

"పోలీసు

శ్రీ జయ వీర భారతికే జయము దిగ్విజయము
నైజాం భూమిని నడిచిన గాధను చెప్పెదము వినుడీ
జయము జయము మన భారత మాతకు జయము దిగ్విజయము
సర్దార్ (వల్లభభాయ్)కి జయము జయము
స్వామీజీ (రామానంద తీర్థ)కి జయము దిగ్విజయము
భారతదేశము సర్వ స్వతంత్రత బడయుట కొరకయ్యా
పోరాటములు ఎన్నో చేసిన ఫలితమ్ము గానూ
భారతదేశమునూ వప్ప చెప్పుచూ ఇంగ్లీషోరు నిష్క్రమించినారు
ఐతే తెల్లలు భారతభూమిని ముక్కలే చేశారో,
పాకీస్తానని హిందుస్తానని రెంటితో పోనీకా,
సంస్థానాలను చిన్నముక్కలీ రెంటిలో బెట్టారు.
ఐనా మన సర్దార్ పటేల్ కృషి ఫలవంతంబయ్యే
భారతభూమిని గల సంస్థానాలే బుద్ధి తెచ్చుకొనెరా
కాశ్మీరొక్కటి నైజామొక్కటి మిగిలి పోయెనంటే... ఇలా సాగుతుంది. చరిత్రను, నేపథ్యాన్ని కూడా బుర్రకథ స్పృశిస్తూ, వ్యాఖ్యానిస్తూ సాగుతుంది. ఇక్కడ 'నైజామే మిగిలిపోయింది' అంటూ కథలోకి వస్తాడు కథకుడు.

సర్దార్ (వల్లభభాయి) నయమున బల్కెరాసై
ఐనను నైజాం లొంగడే, అన్యాయంబును విడువడే.
అందుకు తోడు ఇత్తేహాదుల్ముసల్మీనురా.. సై
ఎన్నియో ఆశలు జూపెరాసై, అన్నింట నవ్వాబు నమ్మెరా.. సై
కాలగతి దలపోయక విర్రవీగెరా మందుడై అంతక్రితమే
ఎన్నోరీతుల బోధ చేసినా విననట్టీ ప్రభుకూ
విప్లవమంటే ఏమిటో తెల్పగ స్టేటు కాంగ్రెసపుడూ
నడుము గట్టెరా, దేశమునకొక పిలుపునివ్వగానే
కోర్టుల నుండి లాయర్లందరూ వృత్తి వదిలినారు
విద్యార్థులు బడికేగక చదువుల్ మానివేసినారు
ప్రతీ ఇంటిపై భారత్ జండా రెపరెపలాడిందీ
ఆ ఝుండాలను ఎగురవేయగా నైజాం సర్కారూ
దాదాపిరువది వేలమందినే జైలున బెట్టారూ....

అప్పుడే, 'ఇత్తెవోదుల్ము సల్మీన్ ఏం చేసిందిరా' అని వంత అడుగుతాడు. లక్షల భారత యూనియను ముస్లింలను రప్పించి రజాకారుల పేరున ఉద్యమ మొక్కటి నిర్మించే తమకు సలామనే వారినే హిందూ మంత్రులనుజేసి మిగతా మంత్రుల తమ అనుచరులనె స్థానములిప్పించే బయట నుండి కొందర్ని ధనాశలు చూపి రప్పించడమూ ఇక్కడున్న వార్ని బయట యూనియన్ ప్రాంతాలకు వెళ్ల గొట్టడమూ, మిగతా ముస్లిమేతరులని ఝుడిపించి, బాకులు చూపి, నానా హింసలు పెట్టి లొంగ తీసుకున్నారు' అంటాడు కథకుడు.

కొంచెం ప్రజలెట జాగరూకులో
ఆ యూరంతయు కాల్చివేయుచు
లక్షల ఆస్తులు దోచి వేయుచు
మానవతులనే ఆపహరించుచు
యువకులందర్ని జైలు ద్రోయుచు
నానా హింసల పెట్టుచు నుండి రోయీ హరిహరి...
భారత జెండా కనిపడితేనే పీకి వేయువారూ
ఆగస్టు పదిహేను నలభై ఏడున స్వాతంత్ర్యపర్వాన
ఇట్టి కేసులే కొన్ని జరుగగా అడిగె నిజామూను
నిజమిది కాదని భారత సర్కారుతో బొంకాడండి.
భారతనాణెము చెల్లదంచును
కానూనొకటి చేసె నిజాము
భారత సర్కారు సంజాయిషీడుగగ
బొంకి యాత్రీకులది కాదనియెనోయి హరిహరి
ఇట్లాంటి సంఘటనలు వందలకొద్ది జరిగినూ...
మరి మనవాళ్లు ఊరుకున్నారాని 'వంత' అడిగాడు. ఇలా చెప్పాడు కథకుడు.

అరెరె సర్దారు హుంకరించెరా.. జునాఘడ్ నుండి
మెత్తటి మాటల లొంగడంచును విశ్వసించినారూ
భారత సేనలు తాత్కాలికముగా రప్పించుకున్నారు
శాంతిభద్రతలు నైజాంనెత్తిన బెట్టి వేసినారు
ఒక్క యథాతథ ఒడంబడిక చేసుకున్నారండీ...

వంత మరొక ప్రశ్నతో రజాకారుల దమనకాండను ప్రస్తావిస్తాడు కథకుడు. పేనుకు పెత్తన మొచ్చినట్టుగా మెలిగె నిజామండీ.. రజాకారుల వీర విహారము పెరిగిపోయెనండీ.... మొదటి నుండి స్టేట్ కాంగ్రెసు చెప్పినట్లు ఈ హైదరాబాదు రాష్ట్రము భారత యూనియన్‌లో చేరి తీరవలెననే చెప్పుతూ వచ్చింది. ఎందుకయ్యాంటే పరిసర రాష్ట్రాలన్నియు దీనికే బంధము గలదయ్యా...భాషా సంస్కృతి భౌగోళికముగా వేరే కాదయ్యా...బ్రిటిష్ కుట్రల ఆఖరి రూపమె ఇదయ్యా....

చర్యలు”

యథాతథపు ఒడంబడిక 1947 నవంబర్ ఆఖరివారంలో జరిగింది. ఆరునెలల కాలంలో అనుకోనన్ని ఘోరాలు జరిగినై. భారత సర్కార్ ప్రతి కూలముగానూ కానూన్లెన్నో చేయుచు, బొంకుచు కాలము గడుపుచునూ సిడ్నీ కాటన్ వంటి వ్యాపారుని చేతిలో నుంచుకొని కోట్ల డబ్బును లంచాలిస్తూ ఆటలాడు వారూ మారణాయుధముల్ మందు గుండునూ చేరవేసుకొనుచూ రజాకారులను సైన్యములను అభివృద్ధి చేసినారు. భారతదేశ గర్భము నందే బల్లెములైనారు...

ఇలాంటప్పుడు సాధ్యమైనంత వరకు రక్తపాతం లేకుండా లొంగ దీసుకుందామని విశ్వ ప్రయత్నంతో

మాటకు ముందూ సంప్రదింపులని.. తందానో
ఢిల్లీ లోపల బొంకుచు వచ్చెడి
నైజాం మంత్రివర్గము తోడ... తందానో
జూన్ ఒడంబడికను నామముతో... తందానో
జేసుకొనుటకై సిద్ధపడరా... తందానో
అప్పటికైనా లాయాఖాలీగ్రూవ్.... తందానో
ముష్లిన్‌కు దిగి నిరాకరించెరా... తందానో

అప్పుడు నైజాం రాచరికమ్ము అర్థమయ్యెనంతా రజాకారులా రాక్షస కృత్యాల్‌కని విని చూచారు. ఇక భరించలేమని వెంటనే వార్నింగిచ్చారు. చెన్నపట్నముకు పండిట్ నెహ్రూ వచ్చిన సమయాన స్టేట్ కాంగ్రెసు ఎప్పటికప్పుడు తెల్పినట్టి వివరాలన్నీ మనస్సులో వుంచుకుని ఈ నైజాం రణానికి ఒక్కపోలీసు ఆపరేషన్ మంచిదని చెప్పాడు.

ఈ రజాకార్లూ లాయఖాలీ ప్రభుత్వం ఎలా సంచరిస్తూండేవారంటే

మంచి మాటలను జెప్పుచూ.. సై
భారత సర్కారు తోడుతా.. సై
వైరములే లేకుండుచూ.. సై
యూనియనున గలుపుమని.. సై
హితవు జెప్పు వారెల్లరిన్
ఇత్తెహాద్ పత్రిక నడిపెడి వాడగు షోయబులాఖానూ
ఒక్కనాటి తన సంపాదకీయంలో నటులే వ్రాయ
ఆ జాతీయ ముస్లిమ్ యువకుని హత్యజేసినారు
ఇంకొక ఏడుగురిట్టులె ముస్లిమ్ సోదరులనగానే
వారి పెన్షనుల్ బంద్ చేసి నిర్భంధించారు

దానితో నిజాం ప్రభుత్వంలోని ఇద్దరు హిందూ మంత్రులగు జి. రామాచారి, జె.వి.జోషి గారలు కూడా ప్రజలకు జరిగే అన్యాయం చూసి తమ మంత్రి పదవులు వదిలేసినారు.

ఆచార్యుండగు భన్సాలీజీ ఈ దారుణములనూ కాంచిన వాడై నిరసన వ్రతమును పూననే పూనినాడూ. దీనితో ఈ నైజాం సమస్య అఖిల భారత సమస్యగా మారి 30 కోట్ల ప్రజలను అసంతృప్తిని రేకెత్తించింది. వెంటనే ప్రధాని నిజాంకు ఈ క్రింది విధముగా తెలిపాడు.

మా సేనలు మా బొల్లారము రావడానికయ్యే
ఏర్పాట్లన్నియు చేయగ వలయును. శాంతిని రక్షింపా
రజాకార్ల రాక్షస కృత్యాలే మీరు అణచలేరు, శాంతి భద్రతలు మా సేనలు అట నెలకొల్పగలవు. కానీ దీన్ని నిజాం అంగీకరించలేదు. మరొక వారం రోజులు గడిచినై. అప్పుడు రాజ గోపాలాచారి గారు కూడా టెలిగ్రాం ద్వారా

“ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని మా సేనల బిల్చి శాంతిభద్రతలు నెలకొల్పుటకై త్వరపడుట అవసరము. రజాకారులను రద్దు చేయ”మన్నాడు. నిజాం నవాబు అంగీకరించలేదు.

“నలభై ఎనిమిది సెప్టెంబరు పదమూడవ తేదీన.. నైజాం ప్రజల దాస్య విముక్తికి నాంది సూత్రమయ్యే.. అష్ట దిక్కుల భారత సేనలు నడువ సాగినాయీ, స్టేటు కాంగ్రెసు వాలంటీర్లు త్రోవ నడుచుచుండా విజయవాడలో కదిలిన సైన్యం వడివడిగా పరుగెత్తి బొమ్మకల్లునే ఆక్రమించెరా... మరియొక దళమపుడే కోదాడను కొట్టివేసే... రజాకారులనెదిరిస్తూ షోలాపురము నుండి నడిచెడి సైన్యము కదిలించి నల్ల దుర్గమున రజాకారులను మట్టుబెట్టినాదీ.. వైరులు గూడా బలమగు ఘర్షణ చేసినారు.. వినరా వినకర్ర వ్యూహమ్మున వచ్చెడి భారత సేనలటా. కొద్దిపాటివే సంఘర్షణలను ఈగల వలె గొడుతూ నాగపురము నుండి వచ్చెడి సేనలు ఆ రోజే బలార్షీయను స్టేషనునప్పుడే పట్టుకొనేనండీ... ఇది మొదటిరోజు వృత్తాంతము.

భారతసేనకు ఫలహారము వలె దొరకనె దొరికిందీ.. చెట్టు చెట్టును పుట్ట పుట్టనూ గాలించారండీ.. రజాకారులకు నిలువున ప్రాణాలెగిరి పోయెనండీ “యా అల్లా హముకూ కోయితో బచావురే” అంటూ ఒకటే పరుగున వెనుకకే పారిపోయినారు. తెలతెల్లారెడి వేళకు రెండవరోజున.. కథ వినరా దౌలతాబాద్‌ను దుర్గము మనసేనలకే వశమయ్యే. ఖమ్మం మెట్టున మనసేనలు నైజాము నెదిరించే .. సూర్యాపేటకు దగ్గరదగ్గర జేరుచునుండెనురా... రాజసూరునే చేరి ఉస్మానాబాద్ పట్టుకొనే బీదరోరుగల్ విమానశాలల ధ్వంసము జేయబడే.. బాంబుల వర్షము ఫెళఫెళ మ్రోతల దిసలు భయము జెందే....

మూడవరోజు సంగతులన్నీ స్థిరముగానూ వినరా, అడ కత్తెర వలె కత్తిరించిరీ ఔరంగాబాదున్...ఖమ్మం దాటీ ఓరుగల్లు దిశ నడుచుచుండెసేనా బీదర్ గూడా స్వాధీనమై పోయెను... వేగంగా సూర్యపేటను దాటి వేసెరా శూరత జూపుచునూ. నాల్గవరోజూ రజాకార్లను పట్టుకోవడం, స్వాధీనమైన నగరాలను పునరావాసంగా చేస్తూ సాగుతుండిరి. ఐదవరోజు అనగా 17వ తారీఖున షోలాపూరూ విజయవాడల నుండి బైలుదేరూ సైన్యాలన్ని ఎనభై మైళ్ళ చేరువ నుండెనురా అంతక్రితం రాత్రి, అనగా 16వ తారీఖు వరకు నైజాం సేనాధ్యక్షుడగు ఎ. అడ్రూస్‌కు దక్షిణ భారత సైన్యమును ఈ పోలీసు చర్యల వ్యూహం నడిపించే కల్నల్, రాజేంద్ర సింహజీ ఈ విధంగా సందేశం పంపాడు.

ఇప్పటికైనా మా సైన్యంబుల.. తందానో
వీర పరాక్రమ విధమును.. తందానో
మీ రజాకారుల క్షీణతగాంచి.. తందానో
ఓటమినికనే నొప్పుకొనుచు.. తందానో
నిర్నిబంధముగ లొంగండోయి.. తందానో

కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

రక్తపాతమును మాన్పగ
పలెనంటేనో హరిహరి

ఆ సందేశము నైజాం నవ్వాబు చూచినాడు. బాబో లాయఖాలీ మంత్రివర్గము రప్పించాడండీ.. ఏమి చెప్పుతా రిప్పుడటంచును ప్రశ్న వేసినారూ.. నవ్వాబే పరిపాలనమంతా చేతికి దీసుకానీ చేసిన దానికి వగ చెదననుచును చెప్పండీనాడు. రజా కారులను మీ ఇష్టముగా బంధించుమన్నాడు. శాంతిభద్రతలు మీరే సంరక్షించండన్నాడు. తాను రజ్వీచే కీలుబొమ్మగా మెలగితి నన్నాడు. తన మాటలనే త్రోసిపుచ్చుచు బంధించిరన్నాడు. దయతో ఇప్పటికేని తనను క్షమించండన్నాడు. వెంటనే నైజాం సేనలోడిన చిహ్నంబుగాను, తెల్లపతాకము నెత్తినారురా ఎల్ల సిపాయీలు. రాజేంద్రసింహుడు వెంటనే రాష్ట్రమంతటికీ మేజర్ జనరల్ చౌదరి గారిని రాష్ట్ర గవర్నరుగా నియమించాడు, శాంతిభద్రతలు నెలకొల్పంగానూ

భారతసేనలు వచ్చేరా /భాగ్య నగరిని జొచ్చేరా/ఎదురేగి అడ్రూస్‌నిల్చేరా/ భీతితో శరణుజొచ్చేరా /పరిపాలన తన చేతిలో/తీసుకొనియె గవర్నరూ...

తాత్కాలికమగు సైనిక పాలన సాగుచునున్నాదీ.. అణువణువునే శోధించుచు రజాకార్లందర్ని బంధించిరోయ్ సైనికాధికారులు శోధిస్తూను.. రాష్ట్రములోని పల్లెపల్లెలో మోదములు పొంగే.. అడుగడుగునా ఈ సైనికులకు స్వాగతమే వెలిసే... రజాకారుల పీడ విరగడై పోయింది గానీ కమ్యూనిష్టుల కార్యము మాత్రము మిగిలియె యున్నది.

అదియును కొలదికాలములోనే అంతమొందునండీ
ముందు భవిష్యత్కార్యక్రమమును బాగుగా యోచించీ
ప్రజల పెన్నిధి సమముగ వెలిసిడి స్టేటు కాంగ్రెసును
అన్ని విధాల నమ్ముటే శ్రేయస్సంచును మరువకుడి
మిలటరీ పాలన పోవుట తోడనే మీదే ప్రభుత్వమురా,
ప్రతి యువకుడును ఓటిచ్చినట్టి వాడే ప్రతినిధిరా,
ఆ ప్రతినిధులతో కూడిన సంఘం ఆలోచించునురా,
రాష్ట్ర భవిష్యత్తంతయు వారే నిర్ణయించెదరురా,
ధర్మము న్యాయము శాంతి సౌఖ్య ప్రాధాన్యముగా వెలయు,
రైతు కూలీ ప్రజా కష్టాలన్ని మాయమగు వినరా
హిందూ ముస్లిం భేద భావములు రూపునకుండవురా
హరిజనాది బాధావృత జాతికి కష్టములుండవురా
నీతి నియమములచే పరిపాలన నిత్యము శోభిల్లూ
భారతదేశ భాగ్యమయ్యి మన రాష్ట్రము వెలయునురా
రామరాజ్య సమరాష్ట్రం బొప్పీరాజిల్లును గనరా
బోలో స్వతంత్ర భారత్‌కీ జై, బోలో సర్దార్ పటేల్‌కి
జై, బోలో ఆజాద్‌కీ స్టేట్ కాంగ్రెసుకు జయము జయమ్మను స్థిర చిత్తము తోడా

స్వామీ రామానందతీర్థుని, సర్దార్ కేశవునీ, ఆచారీనీ, బొమ్మకంటి మొదలగు నాయకులా నాయకత్వమున నడిచిన మేలగు నంచును నమ్ముమురా!

జాగీర్దారీల్ అసమానత్వము రూపుమాపుటకునై హరి జనోద్ధరణ, దున్ను వానిదే భూమియనగుటకునై స్టేటు కాంగ్రెసును మరువకున్నచో చేకూరును మేలు, నమ్మిన వానికె ఫలితమ్ము సుమ్మినా మాటలు వినుమోయ్

జయ జయ జయ జయ జయ జయ జయ భారతికీ జయమౌ

తద్వారా హైదరాబాద్ స్టేట్ భారత యూనియన్‌లో చేరింది.

సర్వే జనాః సుఖినోభవంతు ★

అక్షరార్చన

ఉత్తర పదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో షహబ్‌గంజ్ ప్రాంతం. అది ముస్లింలు అధికంగా ఉండే ప్రదేశం. పాములా మెలికలు తిరిగి ఉండే కొన్ని రహదారుల వెంట నడిచి వెళితే మొత్తానికి ఆ ప్రచురణ సంస్థ దర్శనమిస్తుంది. అదే గీతా ప్రెస్. చుట్టూ హడావిడిగా ఉండే వివణులు. గీతా ప్రెస్ కార్యాలయానికి చేరుకుంటామనగా ప్రతి గోడ, స్తంభం 'హరే రామ, హరే కృష్ణ' అన్న రాతలతో కనిపిస్తాయి. ప్రెస్‌లోకి అడుగు పెట్టగానే వినవచ్చే పలకరింపు 'రామ్ రామ్' అనే. ఈ వాతావరణం ఎలా ఏర్పడింది? దానికి సమాధానం ఆ పవిత్ర ప్రచురణాలయం మేనేజర్ అశుతోష్ ఉపాధ్యాయ చెబుతారు– గీతా ప్రెస్ సనాతన ధర్మప్రబోధానికి అంకితమైంది.

సత్యం, అహింస, ధర్మనిరతి, గాంధేయ విధాన ఆచరణలకు కట్టుబడి భారతజాతి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరివర్తన వికాసానికి శతాబ్దం నుంచి అద్వితీయ సేవలందిస్తున్న ప్రచురణ సంస్థ గోరఖ్‌పూర్ గీతా ప్రెస్. 2021 సంవత్సరానికి గాను గాంధీ శాంతి పురస్కారాన్ని ఈ సంస్థకు ప్రదానం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని న్యాయ నిర్ణేతల మండలి జూన్ 18న తీర్మానించింది. సనాతన హిందూధర్మ ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేసే సదాశయంతో 1923లో ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో గీతా ప్రెస్ ఆవిర్భవించింది.

అన్ని రకాల పుస్తకాలు కలిపి దాదాపు 92 కోట్ల ప్రతులు వెలువరించిన గీతాప్రెస్ ప్రయాణం ఓ అద్భుతం. జయదయాళ్ గోయెంకా, ఘనశ్యామ్‌దాస్ నెలకొల్పిన ఈ ప్రచురణాలయం రూ. 10 అద్దె భవనంలో అంకురించింది. ఈ సంస్థను స్థాపించాలన్న ఆలోచన 1900 సం॥లో జయదయాళ్‌కు కలిగింది. ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతంలోని చిన్న పట్టణం గోరఖ్‌పూర్. గోరఖ్‌నాథ్ మఠం కేంద్రంగా అది హిందూ ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతోంది (ప్రస్తుత ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆ మఠానికి మహంత్‌గా వ్యవహరించారు). జయదయాళ్ గోయెంకా జౌళి, ప్రత్తి మిల్లు వ్యాపారిగా ఉత్తర భారతంలోని వివిధ పట్టణాలలో పర్యటిస్తూ, వివిధ మత పెద్దలు, తాత్వికులతో సత్సంబంధాలు కలిగి ఉండేవారు. అప్పటికే ఆధ్యాత్మిక సత్సంఘాలకు వెళ్లే అలవాటు ఉన్న జయదయాళ్ భగవద్గీత హిందీ అనువాదం తేవాలని ఒక ప్రచురణకర్తతో ప్రయత్నించి విఫలులయ్యారు.హిందూధర్మ మహోన్నత తత్వ విచారణకు మూలకందమైన భగవద్గీత అప్పటికి కూడా హిందీలో ఆవిష్కృతం కాలేదు. పైగా ఆ రోజులలో కేవలం ఉత్తర భారత హిందూ ప్రాంతాలకే గీతా ప్రెస్ సేవలు పరిమితమైనాయి. నెమ్మదిగా భగవద్గీత

అందుబాటులోకి వచ్చింది.

సహచర వ్యాపారస్థుడు ఘనశ్యామ్‌దాస్ ప్రోత్సాహంతో గీతా ప్రెస్ అనతికాలంలోనే ప్రాచుర్యం పొందింది. హిందూ ఆధ్యాత్మిక సునంవన్నతకు ఆలవాలమైన, మార్వారీ వ్యాపారవేత్తలకు కేంద్రస్థానమైన గోరఖ్‌పూర్ దీనికి కేంద్రమైంది. క్రమేపీ 'హనుమాన్‌ప్రసాద్ పొద్దార్' సంపాదకత్వంలో హిందీలో 'కల్యాణ్-కల్పతరు' పత్రిక ప్రారంభమైంది.యావద్భారతం నుంచి వచ్చిన రచనలే కాకుండా, ప్రపంచంలోని వివిధ మతాల తత్వవేత్తల, మేధావుల రచనలను కూడా ప్రచురించి 'కళ్యాణ్ కల్పతరు' ఆస్తికత్వ భావజాల మహోన్నతను చాటుతూ విజయధ్వజం ఎగురవేసింది. 1800 వివిధ మత, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు సంబంధించిన 910 మిలియన్ (దాదాపు 92 కోట్లు) ప్రతులకు పైగా ప్రచురించింది. 15 భాషలలో మాసపత్రికగా విశేష ప్రతిష్ఠ పొందిన 'కల్యాణ కల్పతరు' సంపాదకులు హనుమాన్ ప్రసాద్ పొద్దార్, ఆ పత్రికలో వర్ణచిత్రాలను ఎందుకు ప్రచురించవలసి వచ్చిందో ఎడిటోరియల్‌లో ఒక సందర్భంలో స్పష్టం చేశారు. ఇది దాని సారాంశం.

త్రేతాయుగం నాటి శ్రీరామచంద్రుడు లేదా యుగాల కాలక్రమణంలోని దేవ, దేవీ స్వరూపాలకు భౌతికంగా రూపకల్పన చేయడం మానవ మాత్రులకు సాధ్యం కాని అంశం. గతంలో రాళ్లు, చెక్కవంటి పదార్థాలపై దేవ,దేవీ చిహ్నాలు, విగ్రహరూపాల సృజన, దేవాలయాల ఆవిర్భావం ఆస్తికత్వ ప్రదీప్తికి ఆలవాలమైనాయి. అక్షర జ్ఞానంలేని వారికి కూడా విగ్రహారాధన, భగవద్భక్తికి నేటికీ అవే ఆధారంగా విరాజిల్లుతున్నాయి. శిల్పాలు, కుడ్యచిత్రాల నుంచి ఆవిర్భవించిన దేవదేవీమూర్తుల చిత్రాలలో, ఈ ఆధునిక (పత్ర) ప్రింటింగ్ యుగంలోను భగవద్భక్తి సాధికారత, సాంఘిక దురాచారాల నిర్మూలన, ఇందులో ప్రధానంగా అంటరానితనం, కుల వివక్ష మీద కూడా గీతా ప్రెస్ దృష్టి పెట్టింది. 'కల్యాణ్' ద్వారా ఈ అక్షరోద్యమం సాగింది. ఇందులో ఆ అంశాలకు సంబంధించిన కథలు, కవితలు, ఇతర రచనలకు కూడా మంచి ప్రాధాన్యం ఇచ్చేవారు. స్వాతంత్ర్యోద్యమానికి కావలసిన కరపత్రాలు కూడా ముద్రించే బాధ్యతను గీతా ప్రెస్ తీసుకునేది.

పోద్దార్ తరువాత వారి వారసులు ఇదే ధ్యేయాన్ని గౌరవించారు. అయితే మారుతున్న కాలం, అవసరాల మేరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆశ్రయించారు. ఇప్పుడు డిజిటల్ సౌకర్యాలను కూడా ఉపయోగించుకుంటున్నారు. కల్యాణ్ ప్రస్తుత సర్క్యులేషన్ రెండు లక్షలు. సనాతన ధర్మ బోధనలను దేశంలో ఉన్న పేదలలోనే పేదలకు సయితం చేర్చడమే తమ పత్రిక లక్ష్యమని మేనేజర్ లాల్ మణి

అందరికీ ఆధ్యాత్మిక జ్ఞానం అందించడమే ధ్యేయంగా...

అనన్య సేవలందించింది. 162.1 మిలియన్ పైగా ప్రతులు శ్రీమద్భగవద్గీత; ఇంకా పురాణాలు, ఉపనిషత్‌ల 26.8 మిలియన్ పైగా ప్రతులు గీతా ప్రెస్ నుంచి వెలువడినాయి. హిందూధర్మ విశిష్టతను విశ్వవ్యాప్తంగా బృహత్తరంగా తేటతెల్లం చేశాయి. ప్రస్తుత అత్యాధునిక ప్రింటింగ్ ప్రెస్‌లో ప్రతీరోజు 70,000 గ్రంథాలు వెలుగు చూస్తున్నాయి. 41 శాతం ప్రచురణలు హిందీలోను, 5 శాతం ఇంగ్లిష్‌లో వస్తున్నాయి. జాతీయ స్థాయిలో తమిళం, తెలుగు, ఒరియా, నేపాలీ భాషల చదువరులకు అందుబాటులో గీతా ప్రెస్ గ్రంథాలు ఉన్నాయి. 11మంది ధర్మకర్తలతో నడుస్తున్న ఈ సంస్థకు ప్రస్తుతం దేవీదయాళ్ అగర్వాల్ ప్రధాన సారథి. 1955లో నాటి దేశాధ్యక్షుడు డా॥ రాజేంద్రప్రసాద్ ప్రారంభించిన ప్రెస్ కార్యాలయంలో ఇప్పుడు 450 మంది ఉద్యోగులు సేవలందిస్తున్నారు. 2023- గాంధీ శాంతి పురస్కారానికి ఎంపికైన గీతాప్రెస్‌కు జాతిపిత మహాత్ముని రాజకీయ, మత నైతికత, సామాజిక ఆశయ సాధనతో సాన్నిహిత్యం ఉంది.

1934 జనవరిలో భారతీయ ఆధ్యాత్మిక విలసిల్లడానికి గీతాప్రెస్ ప్రచురణలపైన అచ్చువేసిన చిత్రపటాలు కారణం అంటే సత్యదూరం కాదు. ఆ వర్ణ చిత్రాలు ఆకర్షణీయమై, ఆరాధనీయమై శోభాయమానంగా వెలుగొందాయి. ఇలాంటి ధోరణి శతాబ్ది క్రితమే గీతా ప్రెస్ నాంది పలికింది.

గీతా ప్రెస్ ప్రచురణలు హిందూ ధర్మ ప్రచారానికి పరిమితం కాలేదు. సంస్థ స్థాపన కాలం నాటికి స్పష్టంగా కనిపిస్తున్న మార్పు అవసరాన్ని స్థాపకులు గుర్తించారు. మతం, ఆధ్యాత్మిక చింతనలతో పాటు సామాజిక, సాంస్కృతిక అంశాల మీద జాతిలో కొత్త దృష్టి నాటి అవసరం. దానిని గీతా ప్రెస్ నెరవేర్చింది. మత సామరస్యం, మహిళా

జయసూర్య
సీనియర్ జర్నలిస్ట్

తివారీ చెప్పారు. గీతా ప్రెస్ ప్రజాదరణ, మద్దతు ఉన్న ప్రచురణ సంస్థ. దాని విజయ రహస్యం ఇదే. అందుకు ఉదాహరణ- కరోనా కాలం. అప్పుడు దేశంలో చాలా ప్రచురణ సంస్థలు నష్టాల పాలయ్యాయి. కానీ గీతా ప్రెస్‌కు మాత్రం రూ. 77 కోట్లు లాభాలు వచ్చాయి.

గత ఏడాది రికార్డు స్థాయిలో రూ.111 కోట్ల మేర అమ్మకాలు జరిగాయి. కల్యాణ్ పత్రిక ఆశయమే గీతా ప్రెస్ ప్రచురణలలోను కనిపిస్తుంది. రామాయణం, హనుమాన్ చాలీసా, శివ చాలీసా పుస్తకాలు కేవలం రెండు రూపాయలకే (చిన్నవి) సంస్థ అందుబాటులోకి తెచ్చింది. అది కూడా 15 భాషలలో అందిస్తున్నారు. ఎంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వారు స్వీకరించినా జంతు సంబంధమైన ఉత్పత్తులు ఉన్న పదార్థాలను మాత్రం తమ అచ్చుపనికి వారు అనుమతించడం లేదు. ఈ ప్రచురణ సంస్థ పాకెట్ పరిమాణం పుస్తకాలు నుంచి, ఉద్గ్రంథాల వరకు రోజుకు 70,000 ప్రతులు వెలువరిస్తుంది. నెలకు 500 మెట్రిక్ టన్నుల కాగితం అవసరమవుతుంది. ఇప్పటికీ వ్యాపార ప్రకటనలు తీసుకోవడం ఇక్కడ నిషిద్ధమే. ★



బీఆర్ఎస్ కోవర్టు రాజ

సీఎం కేసీఆర్ రాజకీయ చతురత గురించి ఏకాస్త రాజకీయ పరిజ్ఞానం ఉన్నవాళ్లను అడిగినా ఠక్కున చెప్పేస్తారు. తెలంగాణ రాష్ట్ర సమితిని ఉద్యమ పార్టీగా నడిపించిన నాటి నుంచి ప్రత్యేక రాష్ట్రం సిద్ధించి ఫక్తు రాజకీయ పార్టీగా రూపాంతరం చెందించాక ఆయన సాగించిన ఎత్తుగడలు, అమలు చేసిన వ్యూహాలను కథలుగా చెప్పుకుంటారు. రాజకీయ విలువలను పక్కనబెట్టి నియంతృత్వ ధోరణితో ముందుకెళ్తున్న తీరుపై విపక్షాలే కాదు, రాష్ట్రంలోని సామాజిక, ప్రజాసంస్థలు కూడా తీవ్రస్థాయిలో దుమ్మెత్తి పోశాయి, పోస్తూనే ఉన్నాయి. శాసనసభకు జరిగిన రెండు ఎన్నికల్లోనూ సెంటిమెంట్‌ను అస్త్రంగా వాడుకొని గద్దెనెక్కారు కేసీఆర్. ఆ సెంటిమెంట్‌తోనే విపక్షాలను కనుచూపు మేరలో కానరాకుండా చేశారు. సెంటిమెంట్ అస్త్రంతో ప్రజలు, ఓటర్లు కూడా కేసీఆర్‌కు, ఆయన పార్టీకి అండగా నిలిచారు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. సెంటిమెంట్ పటాపంచలైంది. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ.. ఇప్పుడు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా పేరు మార్చుకుంది. ఎలక్షన్ కమిషన్ ఫార్మాలిటీస్ కూడా పూర్తయ్యాయి.

కేసీఆర్ ఇటీవల కాలంలో వారంలో దాదాపు మూడు రోజులు రాష్ట్రం వదిలి పక్క రాష్ట్రాలకు.. ముఖ్యంగా మహారాష్ట్ర బాట పడుతున్నారు. అంటే, తెలంగాణ అనే ప్రాంతీయ సెంటిమెంట్‌కు తిలోదకాలిచ్చేశారు. బీఆర్ఎస్‌గా మారిన టీఆర్ఎస్ తెలంగాణ సెంటిమెంట్‌ను అంతగా రక్తి కట్టించే అవకాశం లేదు. దీనిపై రాజకీయ నాయకులకే కాదు.. తెలంగాణ ప్రజలకు కూడా క్లారిటీ వచ్చేసింది. ఈ నేపథ్యంలో ఈసారి బీఆర్ఎస్ గెలుపు నినాదం ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది. అయితే, కేసీఆర్ వ్యూహ తంత్రాలు తెలిసిన వాళ్లు మాత్రం ఈ వాదనలన్నీ కొట్టిపారేస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావం నాటి నుంచి అసలు విపక్షం అనేది లేకుండా చేసేందుకు కేసీఆర్ అనుసరించిన విధానాలను ఏకరువు పెడుతూ, మరోసారి వాటిని గుర్తుచేస్తున్నారు. గతంలో ఎన్నికల సమయంలోనే ఓటర్ల నాడిని పట్టుకొని ఎన్నికల గోదాలోకి దూకినట్లే, ఈసారి కూడా అలాంటి మైండ్ గేమ్ మొదలెట్టారని చెప్పుకుంటున్నారు.

ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో త్రిముఖ పోటీ నెలకొంది. అధికార పార్టీ బీఆర్ఎస్‌కు తోడు.. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీ కూడా నువ్వా.. నేనా అంటూ ఎదురేగుతున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు అనుకూల వాతావరణం ఎలా సృష్టించాలన్న యోచనలో కేసీఆర్ నిమగ్నమయ్యారని చెప్పుకుంటున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు కాకుండా.. ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసేందుకే ఎత్తుగడలు వేస్తున్నారని ఆయన సన్నిహితులు అంటున్నారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన మొదట్లో పునరేకీకరణ అంటూ నినాదాన్ని ఎత్తుకొని.. ప్రతిపక్షాలను దాదాపు లేకుండా చేసేశారు. ప్రజల్లో సెంటిమెంట్‌ను రగిల్చి, నాయకుల్లో పునరేకీకరణ నినాదం తీసుకొచ్చి కాంగ్రెస్ పార్టీని బలహీనం చేసేశారు. తెలుగు దేశం పార్టీని నిర్వీర్యం చేసేశారు. ఇక, 2018 ఎన్నికల తర్వాత అయితే కాంగ్రెస్ పార్టీ ఏకావికలమై పోయింది. హస్తం పార్టీ బలహీనం కావడం, అదే సమయంలో బీజేపీ కార్యకలాపాలు పెరిగి ఆ పార్టీ పుంజుకుంది. ఇలాగే కొనసాగితే వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు తథ్యమనుకున్న కేసీఆర్.. తన రాజకీయ చతురతతో, అధికార అండతో ఆ పార్టీ దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. మరోవైపు.. ఇటీవల జరిగిన కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా పుంజుకోవడం మొదలెట్టింది. దీంతో, అటు బీజేపీని, ఇటు కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు కేసీఆర్ కుయుక్తులు పన్నుతున్నారన్న చర్చ మొదలయ్యింది.

ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌లోని ఇద్దరు నాయకులు బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. రాజకీయ వేడిని పెంచుతున్నాయి. ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విపక్షాల విషయంలో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి.'కాంగ్రెస్ పార్టీ వాళ్లను ఏమీ అనవద్దు. వాళ్లు మన వాళ్లే. మనమే కొందరిని ఆ పార్టీలోకి పంపించాం. ఎన్నికలయ్యాక వాళ్లు మళ్లీ మన పార్టీలోకే వస్తారు' అని బాల్క సుమన్ బహిరంగ సభలో వ్యాఖ్యానించడం తీవ్ర చర్చనీయాంశమైంది. గతంలో కాంగ్రెస్‌లో ఉన్న వెంకటేష్ నేత (పెద్దపల్లి ఎంపీ) తిరిగి బీఆర్ఎస్‌లోకే వచ్చారని కూడా ప్రస్తావించారు. పక్కనే ఉన్న వెంకటేష్ రెండు చేతులు పైకెత్తి 'విన్' సింబల్ చూపెట్టారు. ఇక్కడ వెంకటేష్ నేత విషయానికి వస్తే.. గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున చెన్నూరులో బాల్క సుమన్‌పై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాతి పరిణామాలతో బీఆర్ఎస్‌లో చేరారు. అయితే బాల్క సుమన్ చేసిన

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత విపక్షాలను దెబ్బకొట్టడానికి కేసీఆర్ తొలి నుంచీ ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారు. 2014 ఎన్నికల తర్వాత ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌తోపాటు మిగిలిన ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయడానికి రాజకీయ పునరేకీకరణ అనే నినాదాన్ని తెరపైకి తెచ్చారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలతోపాటు టీడీపీ శాసన సభ్యులనూ టీఆర్ఎస్‌లో విలీనం చేసుకున్నారు. అప్పటి పరిణామాలతో తెలంగాణ రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీకి ప్రాధాన్యం లేకుండా చేసిన కేసీఆర్.. అదే వ్యూహాన్ని 2018 ఎన్నికల తర్వాత మరోసారి కాంగ్రెస్‌పై ప్రయోగించారు.

సుజాత గోపగోని, 6302164068

కీయాలు!

ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర చర్చకు దారి దీశాయి. కేసీఆర్ కోవర్టు రాజకీయాలు చేస్తున్నారని ఈటల రాజేందర్ సహా పలువురు నేతలు కొంతకాలంగా ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. 30 మంది కాంగ్రెస్ అభ్యర్థులకు కేసీఆర్ ఫండింగ్ చేస్తున్నారని బీజేపీ ఎంపీ బండి సంజయ్ కూడా ఆరోపణలు చేస్తున్నారు. గతంలో చోటుచేసుకున్న పరిణామాల దృష్ట్యా.. బాల్క సుమన్ వ్యాఖ్యలు కాంగ్రెస్‌ను కూడా ఒకింత కలవరానికి గురిచేసేలా ఉన్నాయి. ఇక, ఓ సందర్భంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు కుక్కల్లా మొరగకుండా, వారిని పిల్లుల్లా మార్చేందుకే కేసీఆర్ బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌లో కీలక నేతలు చేసిన ఈ వ్యాఖ్యలను రాజకీయ విశ్లేషకులు సీరియస్‌గా ప్రస్తావిస్తున్నారు. ప్రతిపక్షాలను దెబ్బకొట్టడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసే వ్యూహాలు, ప్రతిపక్ష ఎమ్మెల్యేల పట్ల ఆయన వైఖరి ఏమిటనేది ఈ వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతున్నాయని అంటున్నారు. తెలంగాణ రాజకీయ పునరేకీకరణ కోసం కాకుండా, ప్రతిపక్షాలను చంపేసి.. తన పార్టీని బలోపేతం చేసుకోవడానికే కేసీఆర్ పునరేకీకరణ ఎత్తులు వేశారని అర్థమవుతోందంటున్నారు. తొలుత కాంగ్రెస్‌ను, ఆ తర్వాత బీజేపీని బలహీనం చేయడానికి కేసీఆర్ అమలు చేసిన వ్యూహాలను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. తన వ్యూహాలతో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా నిర్వీర్యం అయిందని కేసీఆర్ భావించారు. కానీ, రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం, కర్ణాటక ఎన్నికల్లో విజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ మళ్లీ పుంజుకోవడం గమనార్హం. అందుకే, ఇప్పుడు మళ్లీ కేసీఆర్ తన వ్యూహాలకు పదును పెట్టారని, బాల్క సుమన్ వంటి నేతల వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత విపక్షాలను దెబ్బకొట్టడానికి కేసీఆర్ తొలి నుంచీ ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారు. 2014 ఎన్నికల తర్వాత ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌తోపాటు మిగిలిన ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయడానికి రాజకీయ పునరేకీకరణ అనే నినాదాన్ని తెరపైకి తెచ్చారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలతోపాటు టీడీపీ శాసన సభ్యులనూ టీఆర్ఎస్‌లో విలీనం చేసుకున్నారు. అప్పటి పరిణామాలతో తెలంగాణ రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీకి ప్రాధాన్యం లేకుండా చేసిన కేసీఆర్.. అదే వ్యూహాన్ని 2018 ఎన్నికల తర్వాత మరోసారి కాంగ్రెస్‌పై ప్రయోగించారు. ఆ పార్టీ తరఫున గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలను తమ పార్టీలో విలీనం చేసుకుని సీఎల్పీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారు. దీంతో కాంగ్రెస్ తరఫున గెలిచిన వాళ్లు బీఆర్ఎస్‌లో చేరతారనే ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా ఆ పార్టీ విశ్వసనీయతనే దెబ్బతీశారు. వరుస పరిణామాలతో కాంగ్రెస్ పార్టీ నిర్వీర్యమైంది.

అయితే, 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాలు కొత్తమలుపు తిరిగాయి. ఆ ఎన్నికల్లో బీజేపీ నాలుగు ఎంపీ సీట్లను గెలుచుకుంది. ఆ తర్వాత పార్టీ రాష్ట్ర శాఖ పగ్గాలు అందుకున్న బండి సంజయ్.. దూకుడుగా వ్యవహరించారు. నాలుగు ఎంపీ సీట్లను సాధించి ఊపు మీద ఉన్న బీజేపీకి సంజయ్ దూకుడు ఇంకా కలిసివచ్చింది. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల విశ్వసనీయతను కేసీఆర్ దెబ్బతీయడం వల్ల ఏర్పడిన శూన్యతను బీజేపీ కొంతమేర ఆక్రమించగలిగింది.

ప్రభుత్వ వ్యతిరేక ఓటు కాంగ్రెస్, బీజేపీ మధ్య చీలిపోతే అంతిమంగా తన పార్టీకే ప్రయోజనం కలిగిస్తుందని భావించిన కేసీఆర్.. బీజేపీనే లక్ష్యంగా చేసుకుని ఆ పార్టీ గ్రాఫ్‌ను మరింత పెంచారు. ఈ క్రమంలో బండి సంజయ్ నాయకత్వంలో దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ సిటింగ్ సీట్లనే కైవసం చేసుకున్న బీజేపీ.. జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ గట్టి పోటీ ఇచ్చింది. మునుగోడు ఉప ఎన్నికలోనూ పోటాపోటీగా నిలిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రధాన పోటీదారుగా అవతరించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ బలహీనం కావడంతో ఇక పోటీ బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే అన్న అభిప్రాయం ప్రతి ఒక్కరిలో ఏర్పడింది. తదనంతర పరిణామాల్లో ఢిల్లీలో చోటుచేసుకున్న లిక్కర్ స్కామ్‌లో కేసీఆర్ కూతురు కవిత పేరు తెరపైకి వచ్చింది. అదే సమయంలో నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు జరిగిన ప్రయత్నంపై స్టింగ్ ఆపరేషన్ చేసిన కేసీఆర్ ప్రభుత్వం.. దీని వెనక బీజేపీ కీలక నేత ఒకరు ఉన్నారని ఆరోపించింది. అటు లిక్కర్ స్కామ్, ఇటు స్టింగ్ ఆపరేషన్‌ల నేపథ్యంలో బీజేపీ, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడిచింది. ఇక్కడే కేసీఆర్ కొంత వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి ఎదురైంది. ఆ సమయంలో ఢిల్లీకి వెళ్లిన కేసీఆర్.. బీజేపీ జాతీయ నాయకత్వంతో సయోధ్య కుదుర్చుకున్నారన్న ప్రచారం జరిగింది. అయితే బీజేపీ జాతీయ నాయకత్వంతో కేసీఆర్ సయోధ్యలో భాగంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తప్పించారన్న ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. కానీ, బీజేపీ నేతల దూకుడు ఏమాత్రం తగ్గలేదు.

రాష్ట్రంలో ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ రెండూ బలహీనంగా ఉన్నాయని, ఇక తమకు ఎదురు లేదని భావించిన బీఆర్ఎస్ నేతలకు కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత పరిణామాలు షాక్ ఇచ్చాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించి కమలం పార్టీని గద్దె దించింది. ఈ ప్రభావం పొరుగు రాష్ట్రమైన తెలంగాణపై బలంగా పడింది. బీఆర్ఎస్ వ్యతిరేక వర్గాలన్నీ కాంగ్రెస్ పార్టీనే ప్రత్యామ్నాయంగా చూడటం మొదలుపెట్టాయి. అదే సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనంటూ కాంగ్రెస్ పార్టీ ప్రచారం ముమ్మరం చేసింది. ఇది ప్రజల్లోకి, ముఖ్యంగా మైనారిటీ వర్గాల్లోకి వేగంగా వెళ్లడం మొదలైంది. దీంతో కాంగ్రెస్ వేగంగా పుంజుకుంది. ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతూ వస్తోందనీ అంటున్నారు. బీఆర్ఎస్‌లోని అసంతృప్త, వ్యతిరేక వర్గాలు ప్రతిపక్షాల వైపు మొగ్గు తున్న క్రమంలో వచ్చే ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. అందుకే, ఇప్పుడు మరోసారి బీజేపీని, కాంగ్రెస్‌ను దెబ్బకొట్టడానికి కేసీఆర్ పావులు కదుపుతున్నారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.కానీ, కేసీఆర్ అంచనాలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన కుదరడం లేదని, ఇందుకు ఇటీవలి సర్వేలే నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు వివరిస్తున్నారు. ★

వేయిపడగలు అంత

వేయిపడగలలో అంతరార్థమేమిటి? ఒక గ్రంథమేయుద్దేశ్యముతో వ్రాయబడుతుందో అదే దాని అంతరార్థం. ఆ ఉద్దేశం కనుక్కోవటము యెట్టా గా! అసలు మొదట కవి నేర్పుకలవాడైతే తన యుద్దే శాన్ని తన కావ్యంలో సువ్యక్తం చేస్తాడు. సువ్యక్తం చేయటమంటే వాచ్యంగా చెప్పటం కాదు. వాచ్యంగా చెబితే యది యుత్తమ కావ్యమే కాదు. నేర్పుగల పాఠకుఁడు జాగ్రత్తగా ఊహిస్తే యది అతనికి తెలిపేట్టు వ్రాస్తాడు. పూర్వం నుంచి మనదేశంలో నేర్పు గల కవి తన ప్రధానోద్దేశాన్ని కావ్యంలో యేర్ప రచేందుకు కొన్ని మార్గాలు వున్నై. వాటికి పారి భాషికంగా లింగములన్నారు. కావ్యము దేనితో ఉపక్రమిస్తున్నాఁడు అంటే మొదలు పెడుతున్నాడు. దేనితో ఉపసంహరిస్తున్నాడు. అంటే కావ్యం చివఱ దేనిని చెప్పాడు? సామాన్యంగా నేర్పరియైన రచయిత కావ్యానికి మొదటా చివరా కావ్యంలో తాను

చెప్పదలచికొన్న అంతరార్థాన్ని నిక్షేపిస్తాడు. దానిని బట్టే ప్రధానంగా ఆ కావ్యంలో ఉన్న అర్థం తెలు స్తుంది. ఇట్లా మొదటా చివరా నిర్దేశించిన వాటిని బట్టి కావ్యార్థము కొంత తెలుస్తుంది. మఱిన్నీ యీ విషయాన్నే తనకావ్యంలో బహుస్థలాల్లో చెబుతూ వుంటాడు. ఇవి మూడు ప్రధానంగా కావ్యం యొక్క అంతరార్థాన్ని తెలియజేస్తాయి. నేర్పు లేని కవి యిల్లా చేసుకోలేడు. దేనితోనో మొదలు పెడతాడు. మఱేదో చివరికి తేలుస్తాడు. మధ్య అతని యిష్టము వచ్చినట్లు వ్రాస్తాడు. దీనినే మృచ్ఛకటికంలో శూద్రక మహారాజు విదూషకుని చేత ఆక్షేపింపచేశాడు. యేమనంటే –

కుకవి కావ్యము వలె బీజంలో ఒకటి నిర్వ
హణములో ఒకటియని. కావ్య ప్రయోజనం
సరే. ఒక్కొక్కప్పుడీ ప్రయోజనం

యింకొక దాని మీద ఆరోపితమై యుంటుంది. ఇంచుమించుగా ఒక రూపకాలం కారమల్లే వుంటుంది. అచ్చంగా రూపక మైతే తెలుస్తుంది. ఏక దేశ రూపక మైతే మఱికొంచెం కష్టమవుతుంది. ఇల్లా కాకుండా కొన్నిచోట్ల వ్యాజంగా ఉంటుంది. అప్పుడు సామాన్య పాఠకునికి అందదు. ఈ లక్షణాలన్నీ వేయిపడగలలో ఉండటం మూలంగా కొందఱికి చప్పున అవగతం కాకపోవటంలో దోషమేమిన్నీ లేదు. తక్కినవన్నీ యెలా వున్నా యిందులో పసరిక అన్న పాత్ర కొంత మందికి అర్థం కావటం కష్టం కలిగిం చింది. కవి యెప్పుడూ ఆలోచిస్తే అర్థమయ్యేట్లే వ్రాస్తాడు. ఇందులో రావేశ్వరశాస్త్రి నాలుగు వివాహాలు చేసు కొన్నాడు. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర కన్యలను. ఇది సాంకేతిక మైన విషయము. యదార్థ విషయము కాదు. శాస్త్రమంగీక రించిన విషయమైనా కవి దానిని ఉద్దేశింపలేదు. ఈ గ్రంథంలో ప్రతిచోటా ధర్మమును గుఱించే చెప్పబడుతూ వచ్చింది. పుస్తకము పేరే వేయిపడగలు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి యా దేవత. ఈ తెలుగు దేశంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని పాముగా ఆరా ధిస్తారు. ఆయన ఆదిశేషువు. ఆదిశేషువునకు వేయిపడగలున్నై. ఆ వేయిపడగల మీద భూమిని వహిస్తున్నాడని మన పురాణములు చెబుతున్నై. భూమిని సుబ్రహ్మణ్యే శ్వరుడు మోస్తున్నాడన్న మాట పౌరాణికమైన మాట గాని ఖగోళ విషయం కాదు. అనగా సహస్ర ముఖంగా ధర్మం ఉంటుంది. ఆ ధర్మము చేత భూమి పాలించబడుతుంది అన్న యర్థమే. సర్వత్రా ధర్మమే వుంటే అది సహస్ర ముఖంగా వున్నదని చెబుతాం. అది వేయిపడగలు. సుబ్బన్నపేట యొక్క గ్రామాధికారి నాల్గు పడగల పామును చూస్తాడు, అది చాతుర్వర్ణ్య ధర్మము. అరుంధతికి రెండు పడగలు కనిపిస్తాయి. అది దాంపత్య ధర్మము. చివఱికి ఒక పడగే కనిపిస్తుంది. అది అంతా కలిపి ఏకరూపమైన ధర్మము. ఈ విషయం జాగ్రత్తగా చదివే పాఠకుడికి కావ్యం మొత్తం మీద తెలుస్తుంది. రావేశ్వరశాస్త్రి నాలుగు వర్ణములలో నుండి వివాహం చేసుకొన్నాడంటే యిదంతా వట్టి సాంకేతికము, ఈ దేశంలో ప్రధాన మతము వేద మతము. వేదాలు నాలుగు, వర్ణాలు నాలుగు. వర్ణాలు వేదధర్మాన్ని అనుసరించేవే కదా. అనాదిలో సంఘాన్ని పూర్వ ఋషులు నిర్మించినపుడు వేదమును రక్షించేందుకు బ్రాహ్మణుని నియ మించారు. అన్ని వర్ణాల యందు అతడు వేద ధర్మాన్ని రక్షించాలి. అనగా అన్ని వర్ణాలవారు తమతమ వర్ణానుకూలంగా తమ ఆధారాల ప్రకారం తమ విధులననుసరించి వేదధర్మాన్ని పాలిస్తే సంఘము సువ్యవస్థితంగా వుంటుంది. ధర్మం సహస్రముఖంగా వర్ధిల్లుతుంది. వేయిపడగలు భద్రంగా ఉంటాయి. ఇందులో వున్న సుబ్బన్నపేట ఒక్క యూరు కాదు. దేశానికంతటికీ అది చిహ్నము. జమీందారు కాదు. చాలామంది యిందులో వున్న జమిందారీ జమీం దారియని అది జమీందారీ విధానాన్ని సముద్ధరిస్తున్న పుస్తకమనీ అనుకోటం జరిగింది. ఇక్కడ జమీందారు రాజస్థానీయుడు. రాజనగా ఒక్క వ్యక్తే రాజు కాదు. దేశాన్ని పాలించే వాళ్ళందరూ కలసి ఒక రాజు. ఒకరాజు రాజ్యం చేసినప్పుడు కూడా ఆ రాజు ఒక్కడే చేయలేడు. దేశం మొత్తం మీద కొన్ని వేలమంది రాజుననుసరించేవారు ఉంటే, వాళ్ళ ద్వారా రాజు పాలించాడు. వేయి వ్యవహారాలలోను యితరుల చేత తెగతెంపులు కాని ఒక వ్యవహారం వుంటే దానిని

రార్థము

రాజు తీర్చేవాడేమోకాని తక్కినవన్నీ రాజాధికారులే చేసేవారు. ఒక నియందనుగ్రహముంటే ఆ రాజు వానిని శిక్షించటం మానివేయవచ్చు, ప్రజాస్వామి కంలో కూడా రాష్ట్రాధ్యక్షుడు నూటికి కోటికి అట్టి క్షమాపణ చేయటం వున్నది. ఒకరాజు పాలించట మని కొందరు పాలించటమని ప్రజలే పాలించు కోటమనీ యివన్నీ వేర్లేకాని యదార్థానికి అన్ని దేశాలూ యెపుడూ చాలా కొంచెం భేదాలతో ఒకటే మోస్తరుగా పాలించబడుతూ వుంటవి. కనుక యిక్కడ జమీందారంటే పాలకవర్గము అని యర్థము. విజాతీయమైన భావాలకి లొంగిపోయి సంప్ర దాయము స్వజాతి లక్షణం మఱుచిపోయిన పాలక వర్గం యిక్కడ జమీందారు చేత ఉద్దేశింపబడినది. జమీందారు రంగారావు కొడుకు హరప్ప జమీందారే కాని అతనియందు ధర్మము సురక్షితమైందని చెప్ప బడినది. ఎందుచేతనంటే అతడు దైవభక్తుడు. విద్య లను రక్షిద్దామనేవాడు. దేశం యొక్క సంప్ర దాయము లందభిమానం కలవాడు. సాధువు; నియమ వంతుడు. తన డబ్బు తీసికెళ్ళి గుఱ్ఱపు పందాలమీద బెట్టడు. పోయి మద్రాసులో మకాము వేయఁడు. గుర్రపు పందాలంటే గుర్రపు పందాలు కావు, విజా తీయ సంస్కృతి వ్యామోహానికది చిహ్నం. మదరా సంటే మదరాసు కాదు. అనాదినుంచీ యీ దేశం గ్రామనాగరికత కలది. మదరాసు పట్టణ నాగరికతకు చిహ్నము. లక్షలాది పల్లెటూళ్ళు ప్రధాన వృత్తి వ్యవ సాయము కల యీ దేశము ప్రధానంగా పరిశ్రమలు కల దేశాల యొక్క నాగరికత నవలం బించి చెడి పోతున్నదని తాత్పర్యము. అధికారులకు ప్రజలకు సంబంధంలేదు. ధనవంతులూ అధి కారులూ రాజ్యం చేస్తున్నారు. ఈ విషయం ఈ కావ్యంలో నిందింప బడింది. ధర్మారావు పేదవాడు. చదువుకొన్నవాడు. సాధువు. పూర్వ సంప్రదాయము లందిష్టము కలవాడు. అనగా ఆ భావములకు ప్రతినిధి. కావ్యము నందున్న వ్యక్తి సామాన్యంగా ఆ వ్యక్తి కాదు. ఆతడే భావాలకి ఆధారభూతుడవుతాడో ఆ భావాలకు లక్ష్యభూతుడుగా అనుకోవాలి.

కావ్యాలు సామాన్యంగా రెండు విధాలు. మొదటిది రసప్రధానమైన కావ్యము. రెండవది భావ ప్రధానమైన కావ్యము. రసప్రధానమైన కావ్యములో అక్కడక్కడ భావప్రధానమైన భాగాలుండవచ్చు. భావప్రధానమైన కావ్యంలో కూడా చాలచోట్ల రససాక్షాత్కారం కావచ్చు. ఇక్కడ భావమంటే ఒక ధర్మమని అర్థం. కావ్యంలో చెప్పబడే భావం కాదు. ఒక ధర్మాన్ని ప్రధానంగా బోధించేందుకోసం ఒక కావ్యం వ్రాయబడుతుంది. ఆ కావ్యంలో వున్న పాత్రలు ఒకానొక ధర్మానికి సాంకేతిక పురుషులుగా ఉంటారు. ఈ పేదవాడైన ధర్మారావు, సంప్రదాయ సిద్ధమైన విద్యాసంస్కృతుల యందు అభిమానం కలిగిన ధర్మారావు జమీందారు చేత తక్కిన సంఘం చేత యెల్లా నిరాదరింపబడ్డాడో యీ కావ్యంలో ప్రధా నంగా కనిపిస్తూ వుంటుంది. అనగా పాలక వర్గం, ధనికులు సంప్రదాయాన్ని, దేశీయ పాండిత్యాన్ని, దేశీయమైన సంస్కారాన్ని నిరాద రిస్తున్నారని దీని తాత్పర్యము.

సుబ్బన్నపేట యీ దేశానికంతటికీ లక్ష్య భూత మైన గ్రామంగా చెప్పబడింది. అందుకనే ఆ వూరు పేరు సుబ్బన్నపేట. సుబ్రహ్మణ్య శబ్దానికి సుబ్బన్న వికృతి. సుబ్రహ్మణ్యేశ్వరుడు వేయిపడగల స్వామి, వేయి ముఖాలయిన ధర్మానికి చిహ్నం. వేయి ముఖా లుగా ధర్మం పరిపాలింపబడ్డ యీ దేశము సుబ్బన్న పేటగా చెప్పబడింది. అంతేకాని ఒక ఊరుకాదు. ఇది ఒక జమీందారీ కాదు. ఈ సుబ్బన్నపేట మొదలు పెట్టడానికి ఒక ఆవూ, ఒక పాము ఆ ఆవుపాలు త్రాగుతూండటంతో మొదలైన కథ ఉంది. ఇలాంటి కథలు యీ దేశంలో అనేకచోట్ల ఉన్నై. కొంచెం మార్పులతో వుంటవి. అందుచేత దేశం యొక్క స్వరూపం చెప్పటం ఏమిటయ్యా. యీ దేశము యొక్క స్వరూపం అంటే యీ దేశము యొక్క సంస్కారం యొక్క పునాది అది. ఆధిదైవికము అన్న విషయము. అంతేగాని యిది నిజంగా పాము కాదు పాము పడగలూ కాదు. ఒకానొక పండితుడు 'యీ

కావ్యాలు సామాన్యంగా రెండు విధాలు. మొదటిది రసప్రధానమైన కావ్యము. రెండవది భావ ప్రధానమైన కావ్యము. రసప్రధానమైన కావ్యములో అక్కడక్కడ భావప్రధానమైన భాగాలుండవచ్చు. భావప్రధానమైన కావ్యంలో కూడా చాలచోట్ల రససాక్షాత్కారం కావచ్చు. ఇక్కడ భావమంటే ఒక ధర్మమని అర్థం. కావ్యంలో చెప్పబడే భావం కాదు. ఒక ధర్మాన్ని ప్రధానంగా బోధించేందుకోసం ఒక కావ్యం వ్రాయబడుతుంది. ఆ కావ్యంలో వున్న పాత్రలు ఒకానొక ధర్మానికి సాంకేతిక పురుషులుగా ఉంటారు. ఈ పేదవాడైన ధర్మారావు, సంప్రదాయ సిద్ధమైన విద్యాసంస్కృతుల యందు అభిమానం కలిగిన ధర్మారావు జమీందారు చేత తక్కిన సంఘంచేత యెల్లా నిరాదరింపబడ్డాడో యీ కావ్యంలో ప్రధానంగా కనిపిస్తూ వుంటుంది.

పుస్తకంలో పడగలూ లేవు పామూ లేదు' అన్నాడట. చమత్కారంగా అన్నాడు నిజమే. ఉన్నది ధర్మము, సంప్రదాయము, భారత జాతి యొక్క సంస్కారము. ఇందులో రంగరాజమ్మ క్షత్రియ స్త్రీ. ఆమె రామేశ్వర శాస్త్రి యొక్క భార్య, మహా పతివ్రత. రసజ్ఞురాలు, జీవితము ననుభవించు వైభవము నెఱిగిన మనిషి, ఆమె వేదధర్మముననుష్ఠించుచు లోకము ననుభ వించిన క్షత్రియులకు చిహ్నము. ఆమె చనిపోవుచు రామేశ్వరశాస్త్రినే భావించెను. ఈ దేశమునందు క్షత్రియులు అనగా రాజ్యమును పాలించెడివారు. వారు కులము చేత క్షత్రియులు కానక్కరలేదు. ఈ దేశము యొక్క సంప్రదాయము వేదధర్మమూ పాలించుచూ, భావించుచూ పూర్వము నుండిరని దీని యర్థము. ఊరికే యొక పతివ్రత జీవిత కత వలె కనిపించును. ఈ కావ్యము నందు ప్రధానముగా సహస్రముఖమైన వేద ధర్మము ప్రతిపాదింపబడెనని తెలుసుకోవటం జరిగితే, ఈ గ్రంథంలో వున్న తక్కిన సర్వ విషయాలూ యిల్లా సువ్యక్తమౌతవి. ప్రధానంగా పసిరిక ఒకడు కనిపిస్తున్నాడు. ఇతడు మంగమ్మ బిడ్డ. చూస్తే పామల్లే వుంటాడు. ఈలలు వేస్తాడు. గాలిలో తేలిపోతాడు. రామేశ్వరశాస్త్రి చాతుర్వర్ణ్యానికి చిహ్నము అయితే, పసిరిక వ్యవసాయానికి చిహ్నం కదా. అయితే కావ్యంలో ఇలాంటి విషయాలు అంత అధునాతన నాగరికతా కాలంలో కూడా పత్రికలలో పడుతూనే వున్నవి... జరుగుతూనే వున్నవి. అందులో ఆశ్చర్యం లేదు కాని, ప్రధానంగా పసిరిక కృషికి చిహ్నం. అది అచ్చమైన పంచభూతముల బహిఃప్రకృతి మీద ఆధారపడి వున్నది. వాన కురవాలి, గాలి వీచాలి, ఎండలు కాయాలి, పంటలు పండాలి, పాములూ పిట్టలూ యథేచ్ఛంగా సంచరించాలి. ఇది వ్యవసాయం యొక్క స్వరూపం. ఇదంతా ఒక మనుష్యుని ఆకారంగా చేసి, వాణ్ణి పసిరిక అన్నాము, ఇంతే భేదము, ఈ వ్యవసాయము రెండు రకాలు. పండించే పొలం వాన ఆధారంతో పండితే దాన్ని

దేవమాతృకలంటారు. ఆనకట్టలు కట్టి కాల్వలు తవ్వి పండిస్తే దానిని అదేవమాతృకలంటారు. భారవి తన కిరాతార్జునీయంలో దుర్యోధనుడు అదేవ మాతృకల క్రింద పంటలు పండించి ప్రజలను తన వశం చేసుకొన్నాడని వ్రాయ బడింది. ఇతరుల రాజ్యంకాజేసిన రాజు ప్రజలను వశంచేసుకొనేందుకు ఆదేవ మాతృకలను వృద్ధి చేస్తాడు. బాహుళ్యం మీద అదే చేస్తాడు. జనులందరు వానికి వశులవుతారు. ఈ శబ్దాలలో దేవుడన్న మాటకు మేఘుడని అర్థం. పల్లపుటూళ్ల పంటలవారు బోలెడంత విశ్రాంతి కలవాళ్లు. తేలికగా పండుతూ వుంటే బోలెడంత విశ్రాంతి వుంటే ధర్మాన్ని పాడుచేస్తారు. మూడువందల అరవై రోజులు పొలంలో పాటుపడ వలసినవాడు రాజకీయ, మత, సాంఘికాభి ప్రాయములమీదకు దండెత్తేందుకు వాడికి విశ్రాంతియేది? అటువంటప్పుడు ధర్మం ఆజ్ఞల చేత పాలింపబడవలసి వస్తుంది. అందుకని పసిరిక గ్రామాధికారి చేతిన వున్న గడి యారం, ఫౌంటేను పెన్, చొక్కా, మొదలయినవి పెట్టుకొని వెళ్లే టప్పటికి పాము లతణ్ణి కరచినవి. ఈ రెండు నాగరికతలు అంత భిన్నములు. రెండూ రెండుగా రక్షింపబడితేనే ధర్మం రక్షింపబడుతుంది అని అర్థము. ఒక వృత్తిని మనుష్యుల యొక్క కామక్రోధాలు యెలా పాడుచేస్తాయో దేవదాసి చేత సూచితమైనది. అన్ని సిద్ధాంతాలు మొట్టమొదట మంచివే, మనుష్యుల కామ క్రోధాదుల చేత కాలము మీద వాటి లక్ష్యాలు చెడతవి. దానికి ప్రథమోదాహరణ దేవదాసి వృత్తి. ఈ అర్థాన్ని చెప్పేందుకు గిరిక సృష్టించబడ్డది. ఎంత క్రొత్త సిద్ధాంతమైనా అంతే. ప్రజాస్వామికము మంచిదే. ఆచరణలో యెంత దోషభూ యిష్టంవున్నది. అట్లాగే హిందూ ధర్మమున్నూ. అనాదిలో సర్వజగత్తు యొక్క క్షేమంతో సంప్రతిష్టింపబడ్డ ధర్మం. మానవునకు అధికార వాంఛ,స్వార్థము, పుట్టుకతో వున్నవి. సర్వధర్మాన్ని నాశనం చేస్తాడు. స్వార్థపరుల చేత యీ రీతిగా నాశనం చేయబడ్డ ధర్మాన్ని మరికొందరు స్వార్థపరులు అసలా ధర్మం యొక్క మూల స్వరూపమే చెడ్డదియని చెప్పి, తన స్వార్థానికి ఉపయోగపడే అధర్మాన్ని ధర్మంగా ప్రతిష్టిస్తారు. ఇది లోకవృత్తము. ఈ విషయం దేవదాసి కథలోని వ్యంగ్యము.

ఈ రీతిగా ఈ కావ్యంలో వున్న బహు విషయాలు స్వజాతికి సంబంధించిన, భారతీయ సంస్కృతికి సంబంధించిన, వేద ధర్మమునకు సంబంధించిన బహు విషయాలల్లో ఉండే గుణాలను చూపించి యెల్లా దుర్వ్యాఖ్యానం చేయబడ్డవో నిరూపించటానికి వ్రాయబడ్డది. అందుకనే కావ్యం చివర "ఆహా! ఏమి కాలము! యేమి మార్పు" అని ౯౬౫ (865)వ పేజీలో ప్రారంభింపఁబడి రుక్మిణమ్మా రావుగారు, కేశవరావుగారు, దేవదాసి, గణాచారి అందరు పోయినారని వ్రాయబడి వున్నది. వారెవరెవ్వరు దేనికి దేనికి చిహ్నములో అక్కడే వ్రాయబడి వున్నది. ఆ చివరి రెండు పుటలు చదివినచో వేయిపడగల యంతరార్థము తెలియును. అంతయు సూచనగా నిచ్చటనేయున్నది. ఈ రీతిగా సహస్రముఖ ధర్మము నాశనమైనదని "ఆహా యింకనేమి మిగిలినది, యేమి మిగిలినది" అన్న యావేదన చేత చెప్పబడి చివరకు ధర్మారావరుంధతిని చూచి యిట్లన్నాడు "ఔను, నీవు మిగిలితివి, ఇది నా జాతి శక్తి – నా యదృష్టము" అని. అనగా ఈ దేశమునందు సర్వధర్మము నశించవచ్చును – కాని, దాంపత్య ధర్మము, పాతివ్రత్యము యెన్ని బిల్లులు పెట్టినను పోదని తాత్పర్యము. వట్టి లౌకికమైనది, వట్టి వికారమైనది యైన బుద్ధిగల యొకాయన ఈ కావ్యము చదివియున్నారు గదా "ధర్మారావునకు రెండవ యరుంధతిని పెండ్లి చేయించుటను గూర్చి చివరకు సంకర వివాహము చేయింతువేమి" యన్నాడు. కొందరి బుద్ధిలో అది పెండ్లి కానిచో, స్త్రీ పురుషుల మధ్య వయస్తారతమ్యము ప్రేమ క్రింద గొప్ప చేయఁబడి వివాహమన్నచో తప్పుగా పరిగణింపబడుచున్నది. ఇది యాధునికుల నాగరికతా సంపత్తి. ధర్మము యొక్క స్వరూపము తెలియకపోయినచో, నీ కావ్య మర్మమర్థము కాదు– యదభి ముఖముగఁ జెప్పిరో యల్లదాని తదభిముఖముఁగ జూచిన ధర్మ మొప్పు నప ముఖమ్ముగ జూచిన నఖిల దోష కలితముగదోచు ధర్మసంఘాతమెల్ల.

18.3.1955 జాగృతి వారపత్రిక

ఓటు అనేది వజ్రాయుధం. అలాంటి ఆయుధాన్ని కూడా తుప్పు పట్టించడానికి సిద్ధపడుతున్నాయి రాజకీయ పక్షాలు. ఓటు అనే ఆయుధానికి పదను పెడుతున్నామని అవి చెప్పుకుంటున్నా, అవి ఆ హక్కును పరిహాసం చేయాలనుకుంటున్న మాటే నిజమనిపిస్తుంది. రాజ్యాంగం ప్రసాదించిన ఓటును పౌరులు దక్కించుకోవాలన్నా భవిష్యత్‌లో పైరవీ చేయాల్సిన పరిస్థితులను సృష్టించేందుకు రాజకీయ పక్షాల అధీనంలోని వ్యవస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఎవరి కాలంలో చేరినవి అయితేనేం? ఆంధ్రప్రదేశ్‌లో 60 లక్షల దొంగ ఓట్లు ఉన్నాయన్న ఆరోపణ ప్రజాస్వామిక ప్రియులను కలత పెట్టేదే. ఇన్ని ఓట్లు ప్రజాస్వామ్యాన్ని ఎంత తీవ్రంగా వెన్నుపోటు పొడవగలవో అర్థం చేసుకోవడం కష్టం కాదు. దొంగ ఓట్లు దేశ సమగ్రతకు, శాంతి భద్రతలకు ముప్పు తెచ్చే స్థాయికి చేరుకుంటున్న తరుణంలో ఇలాంటి వార్తలు మరింత కలవరం కలిగిస్తాయి. దేశ సరిహద్దు రాష్ట్రాలలో కనిపిస్తున్న అశాంతికి మూలమవుతున్న కారణాలలో విధ్వంసక శక్తులను ఓటర్లుగా నమోదు చేయడం కూడా ఒకటి. అంటే ఈ ధోరణి ఇలాగే కొనసాగితే, అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమైతే దేశ సరిహద్దులలోని రాష్ట్రాలలో ఉండే తీవ్ర పరిస్థితులు ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రంలో కూడా ప్రవేశిస్తాయి. అందుకే ఈ అంశం పెద్ద చర్చనీయాంశమైంది.

సామాన్య ఓటరును ప్రలోభాలకు గురి చేయడం స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఉన్నదే. కానీ కాలక్రమేణే అది విశ్వరూపం దాల్చింది. ఒకే చిరునామా ఆధారంగా వందల ఓట్లు ఎలా వస్తున్నాయి? దీనికి సమాధానం ఉండదు. కానీ నిజమైన ఓటరు ఆ హక్కును సాధించుకోవాలంటే మాత్రం సవా లక్ష ఆధారాలు చూపించాలి. అలాగే ఒకే ఓటరుకు రెండుమూడు ప్రాంతాల్లో ఓటు హక్కు ఎలా వచ్చింది? ఎన్నికల సంఘం ఓటు పట్ల చైతన్యం కలిగించడానికి, ఆ హక్కు కల్పించడానికి అవగాహనా ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజల్లో కదలిక తీసుకురావడానికి ప్రత్యేక బడ్జెట్ పెట్టుకుని మరీ ప్రచారం చేస్తున్నది. దీని ఫలితాలు ఎట్లా ఉన్నాయో, అవి ప్రజాస్వామిక వ్యవస్థను కాపాడగలుగుతున్నాయా, లేదా అన్న అంశాలు ఇంకా తెలియదు.

ఇంతకీ ఓటు, దాని విలువ పునాదిగా ఉండే ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రభుత్వ యంత్రాంగం దొంగ ఓట్లు ఏరివేయడానికి ఎందుకు వెనుకాడుతోంది? చాలా పార్టీల వైఖరిని కాస్త పరిశీలిస్తే ఇందుకు సమాధానం దొరుకుతుంది. ప్రజాస్వామ్యాన్ని ఆధారం చేసుకుని అధికారంలోకి వచ్చిన పార్టీలు అదే ప్రజాస్వామ్యాన్ని నిర్లజ్జగా ఖూనీ చేయడమే ఇక్కడి విషాదం. ఈ వివాదంలోని కీలకాంశం కూడా అదే.

ఆంధ్రప్రదేశ్‌లోని రెండు ప్రధాన ప్రాంతీయ పార్టీలు కూడా దొంగ ఓట్ల మీద విమర్శలూ, ప్రతి విమర్శలూ చేసుకుంటున్నాయి. అయితే ఈ దశలో పరిస్థితిని అదుపుచేసి, ఆరోపణలను నిగ్గుతేల్చి, తగిన చర్యలకు ఉపక్రమించ వలసిన అధికారులు మౌనం పాటిస్తున్నారు. ఒక రకంగా ఇది ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేయడమే. అధికారులు వెరిఫికేషన్ పేరుతో నిజమైన ఓట్లు తొలగిస్తున్నారే తప్ప, దొంగ ఓట్ల జోలికి మాత్రం పోవడం లేదని రాజకీయ పక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. ఈ విధంగా ఎన్నికల సంవత్సరంలో ఓటు కూడా రాజకీయంలో ప్రధాన అంశంగా తయారైంది. అందువల్లనే ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు ప్రస్తుతం తమను సమర్థించే వారి ఓటు ఉందో లేదో తనిఖీ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఓటు రాజకీయం కొత్త కోణాలను చూస్తోంది. ఎన్నికల సంఘానికి వందల కొద్దీ ఫిర్యాదులు అందుతున్నాయి. కానీ ఆ ఫిర్యాదుల విషయంలో అధికారులు

కె. మురళీకృష్ణంరాజు

ఓటు మీద రాజకీయ ముద్ర

ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ పరిస్థితి చూస్తుంటే ప్రజాస్వామ్యాన్ని నిర్దేశించే ఓటు విలువను, పవిత్రతను చాలా రాజకీయ పార్టీలు వాటి శైలిలో తూట్లు పొడిచే పనిలోనే ఉన్నాయని అర్థమవుతుంది. ఇందుకోసం ఒక్కొక్క రాజకీయ పార్టీ ఒక్కొక్క విధంగా ఓటు నమోదు కార్యక్రమంలో విన్యాసాలు చేస్తున్నది. ఈ పనిని సమర్థంగా చేయడానికి క్షేత్రస్థాయి కార్యకర్తలకు బరువైన బాధ్యతలు అప్పచెబుతున్నారు, ఆయా పార్టీల నాయకులు.

ఆంధ్రప్రదేశ్‌లో ఓటరు నమోదు కార్యక్రమం ఏ పరిస్థితికి వచ్చిందంటే, భవిష్యత్ అంతా నిజమైన ఓటరుకూ, దొంగ ఓటరుకూ మధ్య పోరాటంగా మారిపోయే పరిస్థితులు కనపడుతున్నాయి. సంక్షేమ కార్యక్రమాల అమలు కంటే, తమవైన ఓట్లు, వాటి రక్షణ అనే అంశం పైనే రాజకీయ పార్టీలు ప్రధానంగా దృష్టి సారిస్తున్నాయి. రాష్ట్రంలో ఓటు రాజకీయం రోజురోజుకు వేడెక్కడం దీని ఫలితమే. నిజానికి ఇవాళ్టి ఓట్ల రాజకీయం, ఓటర్లను ప్రలోభ పెట్టే అంశాలు చిత్రవిచిత్రమైన మలుపులు తిరుగుతున్నాయి. ఓటు బ్యాంక్ రాజకీయాలు, అందులో కీలకంగా ఉండే తాయిలాలు మొత్తం ప్రజాస్వామ్యం పరమార్థాన్ని వంచిస్తున్నాయి. కాలక్రమంలో ఓటర్లు కూడా తెలివి మీరారు. ఏ పార్టీ తాయిలాలు పంచినా చక్కగా తీసుకుంటూ, తాము చేయదల్చింది చేస్తున్నారు.

2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పసుపు కుంకుమ కింద తాయిలాలు హడావిడిగా పంచింది. కానీ తాయిలం ఓటు రూపం సంతరించుకోలేదు. ఈ పరిస్థితులను గమనించి సొసైటీల ఎన్నికలు, అదేవిధంగా విద్యాలయాల ట్రస్టీలు మాదిరిగా తమకు అనుకూలంగా ఉన్నవారికి ఓటు రాయించుకునేందుకు ప్రణాళికలు రచించడమే కాదు, అమలు చేసేందుకు సిద్ధపడుతున్నాయి. ఓటరు నమోదుకు ఆయా జిల్లాల్లో జిల్లా కలెక్టర్‌లు ప్రచారం చేసినట్లుగా ఈ వ్యవహారం నడవదు. అందుకు భిన్నంగా ఒక్కొక్క ఇంటిలో వందల ఓట్లు నమోదు అవుతున్నాయి. ఈ విధంగా ఓట్లు నమోదు కావడం సరే, అన్నేసి ఓట్లు ఒకే చోట కుప్పగా ఉన్నా, అధికారుల పరిశీలనలో ఎందుకు కనపడడంలేదు అనేది సామాన్య ప్రజలకు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారుతోంది.

ఓటరుగా నమోదు చేసుకునే ప్రక్రియలో అనేక నిబంధనలు ఉన్నాయి. అయితే ఓటు బ్యాంకుల నిర్మాణంలో, అస్మదీయుల ఓట్లు రక్షించుకుంటూ, తస్మదీయుల ఓట్లు గాలికి ఎగిరిపోయేటట్టు రాజకీయ పక్షాలు విన్యాసాలు చేస్తూ ఉంటే ఈ నిబంధనలు ఎందుకు అడ్డుపడడం లేదన్నదే అర్థంకాని ప్రశ్న. అనంతపురం జిల్లా ఉరవకొండలో ఓటరు జాబితా వ్యవహారంలో గతంలో జిల్లా పరిషత్ సీఈఓగా పనిచేసిన స్వరూపరాణి, ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లా పరిషత్ సీఈఓ భాస్కర్‌రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. అయితే ఇవి 2021లో 1796 ఓట్లు తొలగింపు అంశం మీద మాత్రమే తీసుకున్న చర్యలు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కూడా ఇదే తంతు నడుస్తోంది. భీమవరం అసెంబ్లీ నియోజక వర్గం యనమదుర్రు గ్రామంలో ఒకే ఇంట్లో 200 ఓట్లు నమోదైన సంగతి బయటపడింది. కానీ ఇంతవరకు ఇందుకు ఎవరు బాధ్యులో అధికారులు ప్రకటించలేదు. ఇలా ఎందుకు జరిగిందో తెలియాలంటే తలలు పట్టుకోవలసిన పనిలేదు. రాష్ట్రంలో ఉన్న అధికార పార్టీ కనుసన్నల్లో మాత్రమే ఇది జరుగుతుండడంతో ఎవరు ఎన్ని ఆరోపించినా పట్టించుకోనవసరం లేదనే విధంగా అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందనేది సర్వత్రా వినిపిస్తున్న అభిప్రాయం. బీజేపీ మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తాను గతంలో ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గంలో 60 వేల ఓట్లు అదనంగా ఉన్నాయని స్వయంగా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి చెప్పారు.

దొంగ ఓట్లు నమోదు చేసిన వారిపై క్రియాశీలకంగా కఠిన చర్యలు తీసుకోకపోతే ఓటు హక్కు అపహాస్యం కాక తప్పదు. అతిపెద్ద భారత ప్రజాస్వామ్య వ్యవస్థను దొంగ ఓట్లతో ఖూనీ చేసేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ఈ విధంగా ప్రయత్నిస్తుంటే భవిష్యత్‌లో ఆ వ్యవస్థ మీద తీవ్ర అపనమ్మకం ఏర్పడుతుంది. కొన్ని విపక్షాలు పోలింగ్ సరళి మీద కూడా వికృత వ్యాఖ్యానాలు చేయడం ఇటీవల రివాజుగా మారింది. తమ పార్టీ నెగ్గితే అది ప్రజల విజయం. ఓడితే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలతో జరిగిన కుట్రగా అభివర్ణించడం మామూలైంది. ఈ ఆరోపణల వెనుక ఉన్న హేతుబద్ధత ఎంతో ప్రజలు అర్థం చేసుకున్నారు కాబట్టి ఓటింగ్ యంత్రాలపై వారిలో నమ్మకం సడలలేదు. ఇదీ మేలే.

రాష్ట్రంలో మొత్తం 60 లక్షల దొంగ ఓట్లు ఉన్నాయని, ఇవన్నీ గత తెలుగు దేశం పాలనలో చేర్పించినవేనని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. కానీ అధికార పార్టీ రాష్ట్రంలో దొంగ ఓట్ల నమోదును కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తున్నదని తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దొంగ ఓట్లపై తాము కూడా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని మంత్రి పెద్దిరెడ్డి వెల్లడించారు. చంద్రబాబు పోటీ చేసే కుప్పం నియోజకవర్గంలో ఇప్పటివరకు 12 వేల దొంగ ఓట్లు గుర్తించామని, ఇంకా 25 వేల వరకు ఉన్నాయని మంత్రి చెబుతున్నారు.

వైసీపీ ప్రభుత్వం సృష్టి వాలంటీర్ వ్యవస్థ దొంగ ఓట్ల వివాదంలో భాగస్వామి అన్న ఆరోపణ కాస్త తీవ్రమైనదే. ఓటర్ల జాబితాలో ఎవరి పేర్లు ఉండాలి! ఎవరి పేర్లు తొలగించాలి! అనే అంశం వాలంటీరు వ్యవస్థ నిర్వహిస్తున్నదన్న ఆరోపణ వచ్చింది. కానీ తమ ఓటు ఉన్నదో లేదో పోలింగ్ బూత్ వరకు వెళితే కాని తెలియని పరిస్థితి ఈ వాలంటీర్ వ్యవస్థతోనే వచ్చిందని కూడా ఆరోపణలు ఉన్నాయి. అదంతా అధికార పార్టీ వ్యవహారమని చెప్పుకున్నా, ఇంత జరుగుతుంటే అధికార యంత్రాంగం ఏం చేస్తున్నదనే ప్రశ్న వచ్చింది. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధికారులే నకిలీ ఓట్ల నిరోధంలో అధికార దండాన్ని ప్రభావవంతంగా వినియోగించక పోవడంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అనేక అనుమానాలు కలుగుతున్నాయి.

వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్

కథ

ఒక వర్షాకాలపు

ఎం. రమేశ్‌కుమార్

శేఖర్‌కి విసుగ్గా ఉంది. కావలసిన బస్‌తప్ప అన్నీ వస్తున్నాయ్. వాన రాకడ ప్రాణం పోకడ ఎవరికీ తెలీదంటారు గానీ కావాల్సిన బస్సు రాకడ కూడా ఎవరికీ తెలీదేమో.. అసహనంగా అనుకున్నాడు. వర్షం బాగా పెరిగి కుంభవృష్టిగా కురుస్తోంది. ఆ వర్షాన్ని చూస్తూంటే లోకమంతా జలమయమవు తోందా అన్నట్టని పిస్తోంది. షెల్టర్‌లో ఒక చివర పాత కాలపు పెట్టె పట్టుకుని కూర్చున్న ముసలమ్మను గమనించాడు అతడు.

ఆవిడ చీర కట్టు, ఒద్దికగా కూర్చున్న తీరు చూస్తుంటే సాంప్రదాయకమైన కుటుంబం నుంచే వచ్చినట్టు అనిపిస్తోంది. చాలాసేపట్నుంచి అక్కడే కూర్చుని ఉందామె. మరి ఏ బస్ కోసం చూస్తోందో.. అనుకున్నాడు.

మరో ఇరవై నిమిషాల సమయం దొర్లిపోయింది. శేఖర్‌కి విసుగ్గా ఉంది. పోనీ ఏదో ఆటోలో వెళ్దామంటే తను వెళ్లాల్సిన స్టాప్ చాలా దూరం. ఆ రూట్ బస్సుకు అది చివరి స్టాప్. ఆటోలు కూడా డైరెక్టుగా అక్కడికి వెళ్లవు. ఏదైనా ప్రత్యేకంగా కట్టించుకొని వెళ్లాలి. ఈ టైములో అయితే కనీసం ఏ నూట యాభై లేదా రెండొందలు అడుగుతారు. అంత మొత్తం ఇచ్చి వెళ్లడం శేఖర్‌కి ఇష్టం లేదు. సరే చూద్దాం అనుకుని అలాగే కూర్చున్నాడు. మామ్మ ఇంకా నుదిటి మీద చెయ్యిడ్డం పెట్టుకొని అలా చూస్తూనే వుంది. 'అసలీవిడ ఏ బస్ కోసం చూస్తోంది..? బస్ కోసమయితే ముందుకొచ్చి చూసుకోవాలి కదా.. అసలు ముందు కెళ్లినాగానీ ఆ బస్ ఏ వైపు వెళ్లేదో సరిగ్గా కనిపించడంలేదు. మరి ఈవిడ అక్కడే కూర్చుం దేమిటి? బహుశా ఎవరో వస్తారని చూస్తోందేమో..! పాపం ఎంతసేపట్నుంచీ అలా చూస్తోందో..? ఓ పక్క వర్షపు జల్లు కొడుతున్నా ఆవిడ పట్టించుకోవడం లేదు..' అనుకుని "మామ్మగారూ.. అక్కడ వాన జల్లు కొడుతున్నట్టుంది. కాస్త ఇలా లోపలికి జరిగి కూర్చోండి.." ఆవిడకు వినిపించేటట్టు అన్నాడు. ఆవిడ నన్నేనా.. అన్నట్టు ఒకసారి చూసి "లేదు బాబూ.. వాడొస్తే నన్ను చూడకుండా గబుక్కున లోపలకెళిపోతాడు.. ఇక్కడయితేనే వాడికి కనిపిస్తాను" చెప్పింది.

అసలు వచ్చేది ఎవరు..? ఈవిణ్ణి చూడకుండా ఏ లోపలికి వెళ్లిపోతాడు..? శేఖర్‌కు ఏమీ అర్థం కాలేదు.

అదేదో ఆవిడనే అడిగితే పోలా.. అనుకుని తను కూర్చున్న చోటు నుండి మామ్మ కూర్చున్న వైపు వచ్చి కూర్చుని "ఇంతకీ ఎవరొస్తున్నారు మామ్మగారూ?" అడిగాడు.

"నా కొడుకు బాబూ.. ఇప్పుడు వస్తాడు. అసలీ పాటికే రావాలి. ఆలస్యం అయిపోయినట్టుంది. అయినా వస్తాడు బాబూ.. ఎక్కడో చిక్కడిపోయి నట్టున్నాడు" చెప్పింది.

శేఖర్‌కి మామ్మతో మాట్లాడదామనిపించింది. బస్ ఎలాగూ రావడం లేదు. కాసేపు ఈవిడతో మాట్లాడితే కాలక్షేపంగా అయినా ఉంటుంది అనుకున్నాడు.

"మీ అబ్బాయి ఎక్కణ్ణుంచి రావాలి..?" అడిగాడు.

"బాబూ ఆ పేర్లు అవీ నాకు తెలీదు గానీ పని మీద ఎటో వెళ్లాడు. .. వచ్చేస్తాడు.. అందుకే ఇక్కడే కూచున్నాను"

"సరే.. ఇంతకీ మీరిక్కడకు ఎలా వచ్చారు? మీ అబ్బాయి తీసుకొచ్చాడా..? లేక మీ ఇల్లు ఇక్కడేనా?"

"అది కాదు బాబూ.. ఇద్దరం కలిసే వచ్చాం. ఎక్కడికో వెళ్లాలని తీసుకొచ్చాడు. తీరా ఇక్కడికొచ్చాక ఏదో అర్జెంటు పనిబడింది. 'నువ్విక్కడే ఉండమ్మా.. నేనెళ్లి వచ్చేస్తాను.. మళ్లా ఇద్దరం వెళ్లిపోదాం..' అని చెప్పి అదుగో.. ఇక్కడే.. ఆ పక్కనున్న మాకు తెలిసి నోళ్లింటి దగ్గర నన్నుంచి అటెల్లాడు. చాలా సేపయింది.. ఇంకా రాలేదని ఇక్కడకొచ్చి చూస్తున్నాను"

"ఓహో... అలాగా.." అన్నాడు శేఖర్.

అంతసేపూ తన పక్కనే నిల్చున్న కుర్రాడొకడు ఫోన్లో మాట్లాడుతూ వచ్చి ఫోన్ కట్ చేశాక "సార్.. మీరు భవానీపురం వైపు వెళ్లాలా?" అడిగాడు.

"అవును.. అయితే?"

"నేను కూడా అటే వెళ్లాలి సార్.. ఇప్పుడే మా ఫ్రెండ్ ఫోన్ చేశాడు. ఆ వైపు కల్వర్టు కొట్టుకుపోయి దారి మీద నుంచి నీళ్లు పారుతున్నాయట. అందువల్ల అటెళ్లే బస్సులు ఆపేశారట. చాలాసేపట్నుంచి మీరు కూడా నిల్చున్నారు కదా.. మీరూ ఆ బస్ కోసమే చూస్తున్నారేమో అని చెప్పాను" అని చెప్పి ముందు కెళ్ళిపోయాడా కుర్రాడు.

'అరె.. ఇప్పుడేం చెయ్యాలి..?' శేఖర్‌కి కాసేపు ఏమీ అర్థం కాలేదు. భవానీపురంలో ఉన్న తమ్ముడింటికి వెళ్లి రేపు తెల్లవారుజామున అక్కణ్ణుంచి పెళ్లి వారు అరేంజ్ చేసిన బస్సులో మరో ఊరికి పెళ్లికి వెళ్లాల్సుంది. బాగా దగ్గర బంధువుల పెళ్లి. కానీ తను వెళ్తున్న కారణం మరోటి ఉంది. చాలా ముఖ్యమైనది అది!

తమ్ముడితో మాట్లాడాలి.. అమ్మ గురించి! అవును.. అమ్మ గురించి మాట్లాడాలి. అమ్మ మొదట్నుంచీ తన దగ్గిరే ఉంటోంది. తను ఉన్న ఊళ్లోనే స్థిరపడ్డాడు. మొదట్నుంచీ అలవాటైన ఊరు, ఇల్లు కాబట్టి అమ్మ ఎప్పుడూ తనదగ్గిరే ఉంది. ఎప్పుడైనా తమ్ముణ్ణి చూడాలనిపిస్తే అక్కడికి వెళ్లి ఓ వారం పదిరోజులుండి వచ్చేస్తుంది. అయితే ఇప్పుడు తన భార్య చాలారోజుల్నుంచీ ఓ విషయం శతపోరు పెట్టి చెప్తోంది. అదేంటంటే అమ్మకి వయసైపోతోంది. ముందు ముందు పరిస్థితి ఎలా ఉంటుందో తెలీదు. ఇప్పటికే ప్రతినెలా మందుల కోసం చాలా డబ్బులు ఖర్చు చేయాల్సివస్తోంది. మరి ఇలాంటప్పుడు మీ తమ్ముడికి కూడా బాధ్యత ఉండాలి కదా.. అందుకని ఆవిణ్ణి అక్కడ కూడా కొంతకాలం ఉంచమనండి. అక్కడికీ, ఇక్కడికీ తిరుగుతూ ఉంటే ఎవరి దగ్గర ఉంటే వాళ్లు చూసుకుంటారు. మందులకీ అవీ ఎంతవుతోందో మీ తమ్ముడికి కూడా తెలుస్తుంది. అదీగాక రేప్పొద్దున్న ఆవిడ ఆరోగ్యం కోసం ఏదైనా పెద్ద ఖర్చు పెట్టవలసి వస్తే అప్పుడు నేను కూడా ఎంతో కొంత సాయం చెయ్యాలి అనే ఊహ అతనికి వస్తుంది. అంచేత మీరు ఎలాగూ ఈ రాత్రికి అక్కడికి వెళ్తున్నారు కాబట్టి ఇదే అవకాశంగా తీసుకుని మీ తమ్ముడికి, మరదలికి ఈ విషయం నెమ్మదిగా తెలియజెయ్యండి. ఇందులో మనం చేస్తున్న తప్పేమీ లేదు.. బాధ్యత అనేది ఇద్దరికీ ఉండాలి కదా..! వాళ్లింటి దగ్గర కూడా కొంతకాలం ఉంటుంది. మీరు చెప్పకపోతే వాళ్లకి ఈ విషయం ఎప్పటికి తెలుస్తుంది..? ఇదంతా చెప్పి తనను ఈ రాత్రికే అక్కడికి వెళ్లమని బైల్దేరదీసింది భార్య. సరే.. ఇప్పుడు వెళితే పెళ్లికి వెళ్లినట్టుంటుంది.. పన్లో పనిగా రాత్రికి తమ్ముడినీ, మరదలినీ కూర్చోబెట్టి ఈ విషయం గురించి వాళ్లకి చెప్పడం కూడా కుదురుతుంది.. ఇదీ మంచిదే! అనుకున్నాడు తను. అసలీ విషయాన్ని వాళ్లు నొచ్చుకోకుండా ఎలా చెప్పాలా అని ఒకటికి రెండుసార్లు మనసులో అనుకున్నాడు కూడా.

కల్వర్టు కొట్టేసిందంటున్నారు గాబట్టి ఇప్పుడు అటువైపు వెళ్లే పరిస్థితి లేదు. ఏం చెయ్యాలి..? శేఖర్ సెల్ తీసి తమ్ముడికి ఫోన్ చేశాడు. అటువైపు తమ్ముడు ఎత్తగానే.. "ఒరేయ్.. ఇప్పుడు నేను మీ ఇంటికి రావడం కుదిరేట్టు లేదు.. పెళ్లికి కూడా హాజరు కాలేనేమో.." అని ఇంకా ఏదో చెప్పబోతుండగా "ఏవైందన్నయ్యా..?" అట్నుంచి అడిగాడు

సాయంత్రం



తమ్ముడు.

''అదికాదురా..'' అంటుండగా ఫోన్ కట్టయ్యింది. చూస్తే ఎందువల్లనో గానీ సిగ్నల్ పూర్తిగా పోయింది. సరే.. కాసేపాగి చెప్దాంలే.. ఇప్పటికైతే ఇంక ఇంటికెళ్లి పోవడం బెస్ట్.. అనుకున్నాడు. అతడికి ఎదురుగా మామ్మ కనిపించింది. ఆవిడింకా అలాగే ఎదురుచూస్తోంది. అతడికి ఓ సందేహం వచ్చింది. మామ్మ కొడుకు కూడా బహుశా ఆ వైపు నుంచే రావాలేమో..? అందుకే ఇంతవరకూ రాలేకపోయాడేమో..? అని.

"మామ్మగారూ.. భవానీపురం వైపు రోడ్ మీదకు నీళ్లు రావడం వల్ల బస్ లు ఆపేశారట. బహుశా మీ అబ్బాయి కూడా అట్నుంచే రావాలేమో.. ఇంక ఇప్పుడు రాలేడనుకుంటాను.. మీరు చుట్టాలింటికి వెళ్లిపొండి. అక్కడే ఉంటే రేపు వచ్చి తీసుకెళ్తాడు" అన్నాడు.

మామ్మ నవ్వింది. "లేదు బాబూ.. మావాడి సంగతి నీకు తెలీదు. బస్సులాగి పోతే ఏదో ఒకటి పట్టుకుని వొచ్చేస్తాడు.. అంతేగానీ వాడు ఇక్కడ నన్నొదిలేసి ఉండిపోడు" ఆవిడ మాటల్లో కొడుకు పట్ల అంతులేని ఆత్మవిశ్వాసం తొంగి చూసింది.

ఈవిడ చెప్పేది నిజమే కావచ్చు. ఇప్పుడే ఆ కొడుకు వచ్చి ఈవిణ్ణి తీసుకెళ్తాడేమో.. అది సరేగానీ అంతవరకూ మాత్రం ఈ వర్షంలో ఈవిడ ఇక్కడుండాల్సిన అవసరమేముంది..? ఆ చుట్టాలింట్లో ఉంటే అక్కడికే వస్తాడు కదా! అనుకొని ఆ మాటే ఆవిడకు చెప్పబోతుండగా టార్చిలైట్ పట్టుకొని చూసుకుంటూ ఓ మనిషి అక్కడకు వచ్చాడు. ఆవిణ్ణి చూడగానే.. "అనుకున్నాను.. గేటు దగ్గరే ఉండేదానివి.. ఇక్కడకి వచ్చేసి కాపలా కాస్తున్నావా? పద..'

"మీ అబ్బాయి ఫోన్ చేశాడు. ఇప్పుడు రాలేనని చెప్పాడు. రేపు వస్తాడట.. పద పద.. లోపలికి పద" అన్నాడు.

అంత పెద్దావిణ్ణి పట్టుకుని అతను ఏకవచనంలో మాట్లాడటం శేఖర్‌కు ఏ మాత్రం నచ్చలేదు.

"పాపం.. ఈ పెద్దావిడ ఎంతోసేపట్నుంచీ ఇక్కడే వాళ్లబ్బాయి కోసం చూస్తోంది.. మీరెవరు..? ఈవిడకు ఏమౌతారు?" అడిగాడు.

"ఓహో ఈవిణ్ణి మీరు గమనిస్తున్నారా.. ఈవిడ గురించి మీకేం తెలీదు కదా.. చెప్పమంటారా?"

అడిగాడతను.

"చెప్పండి..? ఎవరీవిడ..? అసలు మీరెవరు?" అడిగాడు శేఖర్.

"నేను ఈ పక్కనే ఉన్న వృద్ధాశ్రమం వాచ్‌మెన్‌ని సార్.. నా పేరు వెంకటయ్య. ఈవిడో పిచ్చితల్లి. కొడుకుని అతిగా ప్రేమించి మోసపోయిన వెర్రితల్లి. ఈవిడకు పెళ్లయిన పద్దెనిమిది సంవత్సరాలకు లేక లేక కలిగాడు కొడుకు. ఎన్ని నోములు నోచిందో, ఎన్ని వ్రతాలు చేసిందో, బిడ్డకోసం ఎంతగా తపస్సు చేసిందో ఈవిడకే తెలియాలి. అలా కలిగిన ఆ బిడ్డకు పదేళ్లు రాకముందే ఈవిడ భర్త గతించాడు. ఆ తర్వాత ఈవిడ ఎన్నో పాట్లు, ఎన్నెన్నో అగచాట్లు పడి, అవమానాలను ఎదుర్కొని ఆ బిడ్డను పెంచి పెద్ద చేసింది. వాడు పెద్దయి ఓ ఉద్యోగం సంపాదించుకున్నాక పెళ్లి చేసింది. ఆ తర్వాత కొద్దికాలానికే ఆ కొడుకు ఈవిణ్ణి తీసుకుని ఈ పక్కనున్న మా వృద్ధాశ్రమానికి వచ్చాడు. 'నాకు తెలిసిన ఓ దిక్కు మొక్కు లేని ఆవిణ్ణి తీసుకొచ్చాను. ఇక్కడ ఉంచాలంటే ఎంత డబ్బు కట్టాలి..?' అని అడిగి తెలుసుకుని ఆ డబ్బు కట్టేసి తల్లిని ఇక్కడ అప్పజెప్పేశాడు.

ఈ పిచ్చితల్లికి మాత్రం తను ఏదో పని మీద అర్జెంటుగా వెళ్లాల్సి ఉందని.. ఈ ఆశ్రమం మన చుట్టాలదే అనీ అందాకా వాళ్లింట్లో ఉండమనీ, తను పని చూసుకుని వచ్చి తీసుకెళ్తాననీ చెప్పి వెళ్లాడు. ఆ తరువాత గానీ ఈవిడ అతని తల్లే అన్న విషయం మాకు తెలియలేదు. అతనిచ్చిన ఫోన్ నెంబర్లు, అడ్రసు ఏవీ సరైనవి కావు. ఈవిడకు కష్టపడడం తప్ప ఏమీ తెలీని అమాయకురాలు పాపం. కొడుకు ఇలా ఇక్కడ వదిలేసి పోయాడని తెలియగానే ఈవిడకు మతి చలించింది. ఆ రోజు నుంచీ అంటే ఇప్పటికి దాదాపు మూడు సంవత్సరాల నుంచీ రోజూ పెట్టె పట్టుకుని ఆ గేటు దగ్గర ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎదురుచూడడం.. ఎవరు అడిగినా 'నా కొడుకొచ్చేస్తాడు.. వచ్చి ఇప్పుడే నన్ను తీసుకెళ్లిపోతాడు..' అని చెప్పడం.. ఇదే వరస! టైముకి భోజనం అదీ ఆయా వచ్చి తీసుకెళ్లి పెడుతుంది. అదయ్యాక మళ్లీ ఈవిడ గేటు దగ్గరికే వచ్చేసి ఎదురు చూస్తుంటుంది.. ఈ రోజు ఉదయం నుంచీ వర్షం పడుతోంది కదా.. అందుకని గేటు దగ్గర కాకుండా పెట్టె పట్టుకొని సరాసరి ఈ షెల్టర్‌లోకి వచ్చేసింది.. అదీ ఈ పిచ్చితల్లి కథ!"

నిర్ఘాంతపోయి చూస్తున్న శేఖర్ తేరుకోకముందే వెంకటయ్య ఆవిడకు ఏదో నచ్చచెప్పి తీసుకు వెళ్లిపోయాడు.

శేఖర్ అలాగే నిలబడి ఉండిపోయాడు.. హోరుమని వీస్తోంది గాలి..!

అతడు ఆలోచిస్తున్నాడు.. ఇంకా ఆశ్చర్యంగానే ఉంది అతడికి! ఇంత దుర్మార్గమైన కొడుకులు కూడా ఉంటారా..? అంత కఠినమైన మనసు ఎలా వచ్చింది అతనికి..!? లోకానికే మాయని మచ్చలు కదా అలాంటివాళ్లు!

ఫెటిల్లున ఒక మెరుపు మెరిసింది. దేదీప్య మానమైన ఆ మెరుపు వెలుతురులో శేఖర్ మనసులో ఉన్న ఒక వెలుగు చూడని ప్రదేశమేదో కాంతితో నిండిపోయింది. ఆ వెనుకే సత్యాన్ని గుర్తించమని జాగృతం చేస్తోందా అన్నట్టు ఫెళ ఫెళమంటూ ఒక ఉరుము!

అవును.. అలా అయితే మరిప్పుడు తనేం చెయ్యబోయాడు..? అంత ఘోరంగా కాకపోయినా తను కూడా ఎంతోకొంత స్వార్థంతో ఆలోచించలేదా? తమ్ముడికి ఈ మధ్యనే ఉద్యోగం వచ్చిందనీ, ఇంకా ఇప్పుడిప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాడనీ తనకు తెలుసు. వాడు కూడా చెడ్డవాడేమీ కాదని.. అమ్మకీ, తనకీ కూడా ఎంతో గౌరవం ఇస్తాడనీ తెలుసు. అవసరం అయితే అమ్మ విషయంలో ఏదైనా చెయ్యడానికి వాడు వెనకాడడనీ.. ఆ ఆలోచన వాడిలో కూడా ఉందనీ తెలుసు.

అదీగాక అమ్మ మొదట్నుంచీ తాముంటున్న ఆ ఇంట్లోనే నాన్న జ్ఞాపకాలు తడుముకుంటూ బ్రతుకుతోందనీ, అందువల్ల ఎక్కడకు వెళ్లినా ఎక్కువ రోజులు ఉండలేదని కూడా తెలుసు. ఇన్ని విషయాలు తెలిసిన తను మాత్రం ఏం చేశాడు..? అవన్నీ ఎక్కడో మనసు మూలలోకి నెట్టేశాడు.

భార్య మాటలు విని అనవసరంగా తొందరపడి.. ఇప్పుడే ఏదోరకంగా అమ్మ బాధ్యత కొంత తమ్ముడి మీదకు నెట్టేస్తే సరి అనుకున్నాడు. శేఖర్ మనసులో ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చాయి. అప్పుడు మోగింది సెల్.. తమ్ముడు చేస్తున్నాడు.

"అన్నయ్యా.. ఇందాకేదో చెప్తున్నావు. కట్ అయిపోయింది. మళ్లీ చేసినా నీకు కాల్ వెళ్లలేదు.."

"అదేరా.. మీ వైపు కల్వర్ట్ కొట్టుకుపోయి పైనుంచి నుంచి నీళ్లు పారుతున్నా యట.. అందువల్ల నాకు మరిప్పుడు రావడం కుదరదు. పరిస్థితి ఎలా ఉంటుందో తెలీదు కాబట్టి రేపు పెళ్లికి కూడా నేను రాలేకపోవచ్చు"

"అవుననన్నయ్యా.. అక్కడ కల్వర్ట్ కొట్టుకుపోయిన సంగతి నాకూ ఇప్పుడే తెలిసింది.. మరి నువ్వు ఇంటికి వెళ్లిపోయావా?" అడిగాడు తమ్ముడు.

"లేదు.. ఇంకా బస్టాప్‌లోనే ఉన్నాను.. ఏదో ఆటో పట్టుకుని వెనక్కి వెళ్లిపోతాన్లే.."

"రాత్రికి ఇంటికి వస్తాను ఏదో ముఖ్యమైన విషయం మాట్లాడాలి అన్నావు. ఇంతకీ ఆ విషయ మేమిటో చెప్పనేలేదు. దేనిగురించి అన్నయ్యా..?"

రెండు క్షణాల గ్యాప్ తర్వాత శేఖర్ మాట్లాడాడు "అదా.. మరేం లేదురా! మనం కలిసి మాట్లాడుకొని చాలా రోజులైంది. ఫోన్లలో ఏదో అలో పోలోమంటూ మాట్లాడుకోవడమే తప్పించి ఒక దగ్గర కూచుని కాసేపు సరదాగా మాట్లాడుకోవడమే కుదరట్లేదు. అందుకే రాత్రికి మీ ఇంటికి వస్తే అంతా కూర్చుని కాసేపు సరదాగా మాట్లాడుకోవచ్చు అనుకున్నాను. అంతే..! ఈ వర్షం పుణ్యమా అని అది కూడా కుదర్లేదు"

"నిజమే.. ఈ పెళ్లి హడావిడి అయిపోయిన తర్వాత వదిన్నీ, పిల్లల్నీ తీసుకొని నువ్వోసారి రా అన్నయ్యా.. మేం ఇంట్లో దిగినప్పుడే వచ్చారు. ఆ తర్వాత అంతా కలిసి రానేలేదు. మీరు వస్తే రెండ్రోజులు హాయిగా కలిసి గడపొచ్చు" అన్నాడు తమ్ముడు.

"సరే.. అలాగే వస్తాం.. ఇంక ఉంటాను మరి.." చెప్పాడు శేఖర్. ఫోన్ కట్ చేశాక బైటికి చూశాడు. హోరుగాలి తగ్గింది. వాన వెలిసింది. ప్రకృతి కూడా ఇప్పుడు శేఖర్ మనసులాగే ప్రశాంతంగా ఉంది!

సరిగ్గా అప్పుడే ఇంటి వైపు వెళ్లే ఆటో రావడంతో దాన్ని ఆపి ఎక్కి ఇంటికి బైల్దేరాడు శేఖర్. ★

బీవీకే (విశాఖ)లో భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవం

విశాఖపట్నం (ద్వారకానగర్) బీవీకే కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయక్రీడా దినోత్సవం (ఆగస్ట్ 29) వైభవంగా నిర్వహించారు. భాషా దినోత్సవానికి డా.జె.వి.ఎస్.ఎన్.మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని గిడుగు రామమూర్తి భాషా సేవను కొనియాడారు. క్రీడా దినోత్సవ ముఖ్య అతిథిగా వచ్చిన మల్లిరెడ్డి ఉమాశంకర్‌బాబు క్రీడల గొప్ప తనాన్ని తెలియచేసారు. సభ అనంతరం కళాశాల సభా మందిరంలో 'భువనవిజయం' సాహితీ రూపకాన్ని అధ్యాపకులు విద్యార్థులు కలసి రసరమ్యంగా ప్రదర్శించారు. కరెస్పాండెంట్ వై.శ్రీధర్, ప్రధానాచార్యులు డి.వి.ఎల్.ఎన్. జోగిరాజు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

'ఆనంద'డోలికల్లో భారత చదరంగం!

భారత చదరంగ క్రీడలో సూపర్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఎవరు? అన్న ప్రశ్నకు జవాబు దొరికింది. ఒకరు కాదు..ఇద్దరు కాదు మెరికల్లాంటి నలుగురు కుర్ర గ్రాండ్ మాస్టర్లు వారసులుగా దొరికారు. వారి విజయాలు చూసి భారతమాత 'ఆనంద' డోలికల్లో తేలిపోతోంది....



మేధో క్రీడ చదరంగంలో భారత కుర్ర గ్రాండ్ మాస్టర్ల సంచలన విజయాల పరంపర కొనసాగుతోంది. గత నాలుగు దశాబ్దాలుగా భారత చదరంగ పతాకాన్ని విశ్వస్థాయిలో రెపరెపలాడిస్తున్న 53 సంవత్సరాల దిగ్గజ గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్‌కు ఏకంగా నలుగురు వారసులు దొరికారు.

ఆనంద్ నుంచి ప్రజ్ఞానంద్ వరకూ...

విశ్వనాథన్ ఆనంద్ 18 ఏళ్ల వయసులో గ్రాండ్ మాస్టర్ హోదా సంపాదించడంతో పాటు ఐదుసార్లు విశ్వవిజేతగా నిలవడం ద్వారా భారత 'చదరంగ ఎవరెస్టు'గా నిలిచిపోతే ఆ దిగ్గజ గ్రాండ్‌మాస్టర్‌కు వారసులుగా 18 సంవత్సరాల ప్రజ్ఞానంద్, 17 ఏళ్ళ గుకేశ్, విధిత్ గుజరాతీ, అర్జున్ ఇరగేసీ తెరమీదకు వచ్చారు. అంతర్జాతీయ పోటీలలో అపురూప విజయాలు సాధిస్తూ ఆనంద్‌నే ఆనందడోలికల్లో ముంచెత్తుతున్నారు.

అజర్ బైజాన్ రాజధాని బకూ వేదికగా ముగిసిన ప్రపంచకప్ చదరంగ పోటీలు-2030 క్వార్టర్ ఫైనల్స్‌కు తొలిసారిగా నలుగురు (ప్రజ్ఞానంద్, గుకేశ్, విధిత్ గుజరాతీ, అర్జున్ ఇరగేసీ) కుర్ర గ్రాండ్ మాస్టర్లు చేరి చరిత్ర సృష్టించారు. ఈ ఘనత భారత చదరంగ క్రీడకే గర్వకారణమంటూ విశ్వనాథన్ ఆనంద్ మురిసిపోతున్నాడు.

12 ఏళ్ల వయసుకే గ్రాండ్ మాస్టర్ హోదా!

ఆనంద్ వారసులుగా వచ్చిన నలుగురు నవతరం ఆటగాళ్లలో ప్రపంచకప్ రన్నరప్ ప్రజ్ఞానంద్ గురించే ముందుగా చెప్పుకోవాలి. తమిళనాడు లోని తెలుగు మూలాలున్న ఓ కుటుంబం నుంచి చిచ్చర పిడుగులా దూసుకొచ్చిన ప్రజ్ఞానంద్ కేవలం 12 ఏళ్ల చిరుప్రాయంలోనే గ్రాండ్ మాస్టర్ హోదాతో చరిత్ర సృష్టించాడు. ప్రతిభకు వయసుతో ఏమాత్రం సంబంధం లేదని చాటి చెప్పాడు.

క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

తెలివితేటలు, సమయస్ఫూర్తి, నేర్పు ఓర్పుతో ఎత్తులు పైఎత్తులతో సాగిపోయే చదరంగ క్రీడలో గ్రాండ్ మాస్టర్ హోదా సాధించడం ఓ పెద్దపరీక్ష. ఐదేళ్ల వయసు నుంచే చదరంగం ఆడుతూ ఎన్నో సంచలన విజయాలు సాధించిన విశ్వనాథన్ ఆనంద్ లాంటి ఆటగాడే... 18 ఏళ్ల వయసులో కానీ గ్రాండ్ మాస్టర్ హోదా సాధించలేకపోయాడు. అలాంటి ఘనతను చిచ్చర పిడుగు ప్రజ్ఞానంద ఆయనకు కంటే ఆరేళ్ల తక్కువ వయసులోనే సాధించి... తన పేరును సార్థకం చేసుకొన్నాడు.

అమ్మ స్ఫూర్తి... అక్కప్రేరణ.....

విజయవంతమైన ప్రతి పురుషుడి వెనుక ఓ స్త్రీమూర్తి ఉన్నట్లే.. విజేతగా నిలిచిన క్రీడాకారుడి వెనుక ఓ మాతృమూర్తి తప్పక ఉండి తీరుతుంది. దానికి ప్రజ్ఞానంద్ ఏమాత్రం మినహాయింపు కాదు. పిల్లల్ని టీవీకి దూరంగా ఉంచాలన్న లక్ష్యంతో రమేశ్, నాగలక్ష్మి దంపతులు తమ ఇద్దరి పిల్లల్ని చదరంగ క్రీడలో ప్రవేశపెట్టారు. అక్క వైశాలితో కలసి చెస్ ఓనమాలు దిద్దుకొన్న ప్రజ్ఞానంద్ ఆ తర్వాత మరి వెనుదిరిగి చూసింది లేదు.

తన ఆరాధ్యదైవం విశ్వనాథన్ ఆనంద్ ఆటతీరు, వ్యూహాలను అనుసరిస్తూ... శిక్షకుడు ఆర్బీ రమేశ్ పర్యవేక్షణలో 12 సంవత్సరాల 10 నెలల 14 రోజుల వయసులోనే గ్రాండ్ మాస్టర్ హోదా సాధించడం ద్వారా ప్రపంచ చెస్ చరిత్రలోనే ఈ ఘనత సాధించిన రెండో అతిపిన్న వయస్కుడైన గ్రాండ్ మాస్టర్ గా రికార్డుల్లో చోటు సంపాదించాడు.

ప్రపంచకప్ రన్నరప్‌గా...

బకూలో ముగిసిన ప్రపంచకప్ టోర్నీలో ప్రపంచ రెండోర్యాంక్ నకమురా, మూడోర్యాంక్ ఫాబియనో కరునాలపై సంచలన విజయాలతో ఫైనల్స్ చేరిన ప్రజ్ఞానంద్ టైటిల్ పోరులో ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ ఆటగాడు, ఐదుసార్లు విశ్వవిజేత మాగ్నస్ కార్ల్‌సన్‌ను ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించాడు. చివరకు ర్యాపిడ్ రౌండ్లో ఓడి రన్నరప్ ట్రోఫీతో పాటు 80వేల డాలర్ల ప్రైజ్ మనీ అందుకొన్నాడు. 18 ఏళ్లకే ప్రపంచకప్ రన్నరప్ గా నిలిచిన రెండో గ్రాండ్ మాస్టర్‌గా నిలిచాడు. భారత చదరంగ చరిత్రలో ఆనంద్ తర్వాత ఈ విజయం ప్రజ్ఞానంద్ మాత్రమే సాధించాడు.

తన కుమారుడితో పాటు ఓ కుక్కరు, ఇండక్షన్ స్టౌవ్ పట్టుకుని ప్రపంచ దేశాలు తిరిగే ప్రజ్ఞానంద్ తల్లి నాగలక్ష్మి ఆనందానికి అవధులే లేకుండా పోయాయి. అమ్మ లేక పోతే తాను లేనని, విదేశాలలో సైతం అమ్మ వండిపెట్టే రసం అన్నం తినటమే తన విజయ రహస్యమంటూ ప్రజ్ఞానంద్ ప్రకటించాడు. తాను సాధించిన ప్రపంచ పతకాన్ని అమ్మకు, తన కుటుంబ సభ్యులకు అంకిత మిచ్చాడు.

త్వరలో జరిగే ఆసియాక్రీడల చదరంగంలో సైతం వ్యక్తిగత, టీమ్ విభాగాలలో మాత్రదేశానికి ప్రజ్ఞానంద్ బంగారు పతకాలు సాధించాలని కోరుకొందాం.!

కృష్ణారావు చొప్పరపు

బల్లెం విసురుడులో బాహుబలి, భారత బంగారు కొండ, ప్రపంచ నంబర్ వన్ నీరజ్ చోప్రా విశ్వవిజేతగా నిలిచాడు. తన జీవితలక్ష్యాన్ని సాకారం చేసుకోడం ద్వారా దేశానికే గర్వకారణమయ్యాడు. భారత గోల్డెన్ స్టార్ నీరజ్ చోప్రా జీవిత లక్ష్యం నెరవేరింది. రెండో ప్రయత్నంలోనే ప్రపంచ టైటిల్ చేజిక్కింది. 2023 ప్రపంచ అథ్లెటిక్స్ పోటీలలో బంగారు పతకం నీరజ్‌ను ముద్దాడింది.

భారత 'బంగారుకొండ' నీరజ్ చోప్రా

అంతర్జాతీయ ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీల జావలిన్ త్రోలో నీరజ్ చోప్రా జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆసియా, కామన్వెల్త్ గేమ్స్, ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధించిన ఆయన రెండో ప్రయత్నంలో ప్రపంచ చాంపియన్‌గా నిలవడం ద్వారా స్వర్ణ పతకాన్ని సాధించగలిగాడు.

25 ఏళ్లకే ప్రపంచ, ఒలింపిక్స్ స్వర్ణాలు..

నీరజ్ చోప్రా 25 ఏళ్ల వయసుకే ప్రపంచ, ఒలింపిక్స్, ఆసియా, కామన్వెల్త్ గేమ్స్ బంగారు పతకాలతో పాటు, గోల్డెన్ మీట్ గోల్డ్ మెడల్ విజేతగా నిలవడం అరుదైన రికార్డుగా మిగిలిపోతుంది. భారత క్రీడాచరిత్రలో వ్యక్తిగత విభాగంలో విశ్వవిజేతగా నిలిచిన రెండో అథ్లెట్‌గా రికార్డుల్లో చేరాడు. షూటర్ అభినవ్ భింద్రా తొలి అథ్లెట్ కాగా..నీరజ్ ఆ తర్వాతి స్థానంలో నిలిచాడు. అయితే...అథ్లెటిక్స్‌లో ప్రపంచ బంగారు పతకం సాధించిన తొలి క్రీడాకారుడు నీరజ్ మాత్రమే. 2008 బీజింగ్ ఒలింపిక్స్ షూటింగ్‌లో బంగారు పతకం సాధించిన అభినవ్ పిస్టల్‌ను ఒలింపిక్ మ్యూజియంలో ఉంచారు.. ఆ మ్యూజియంలో చోటు సంపాదించిన తొలి భారత అథ్లెట్ అభినవ్ కాగా... రెండో అథ్లెట్‌గా నీరజ్ చోప్రా నిలిచాడు.

హంగెరీ రాజధాని బుడాపెస్ట్ వేదికగా జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్- 2023 పురుషుల జావలిన్ త్రోలో నీరజ్ చోప్రా అలవోకగా బంగారు పతకంతో విశ్వవిజేతగా అవతరించాడు. క్వాలిఫైయింగ్ రౌండ్లో 88.77 మీటర్ల రికార్డుతో ఫైనల్స్‌కు అర్హతను సాధించి 88.17 మీటర్ల రికార్డుతోనే స్వర్ణపతకం సాధించడం విశేషం.

పాకిస్తాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ 87.82 మీటర్ల రికార్డుతో రజత, చెక్ రిపబ్లిక్‌కు చెందిన జాకబ్ వాడ్లిచ్ 86.67 మీటర్ల రికార్డుతో కాంస్య పతకాలు దక్కించుకొన్నారు.

2016 నుంచి 2023 వరకూ...

2016లో దక్షిణాసియా క్రీడల బంగారు పతకంతో బోణీ కొట్టిన నీరజ్ చోప్రా, 2017లో ఆసియా ట్రాక్ అండ్ ఫీల్డ్ మీట్ స్వర్ణపతకం, 2018లో కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణం, 2020లో టోక్యో ఒలింపిక్స్ స్వర్ణం, 2022లో ప్రపంచ పోటీల రజతం, డైమండ్ లీగ్ బంగారు పతకం సాధించి, తాజాగా, ప్రపంచ మీట్ స్వర్ణ పతకాన్ని అందుకోగలిగాడు. రానున్న పోటీలలో 90 మీటర్ల లక్ష్యం సాధించాలన్న పట్టుదలతో ఉన్నాడు.

58 లక్షల ప్రైజ్ మనీ...

ప్రపంచ జావలిన్ త్రో టైటిల్‌తో పాటు బంగారు పతకం సాధించిన నీరజ్ చోప్రాకు 70వేల డాలర్లు (58 లక్షల రూపాయల) ప్రైజ్ మనీగా దక్కింది. రజత విజేత, పాక్ అథ్లెట్ అర్షద్‌కు 29 లక్షలు, చెక్ రిపబ్లిక్‌కు చెందిన కాంస్య విజేత జాకోబ్ వాడ్లెచ్‌కు 18 లక్షల రూపాయలు దక్కాయి. అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్ ప్రకారం, నీరజ్ మొత్తం 1470 పాయింట్లతో ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ సాధించాడు.

10 మాసాలలో టాప్ ర్యాంక్...

గతేడాది ఆగస్టు 30 నాటికి ప్రపంచ రెండోర్యాంకుకు చేరుకొన్న నీరజ్ కేవలం 10 మాసాల కాలంలోనే టాప్ ర్యాంక్ అందుకోగలిగాడు. జ్యూరిచ్ వేదికగా గతేడాది జరిగిన డైమండ్ లీగ్ ఫైనల్లో బంగారు పతకం సాధించడం ద్వారా విలువైన ర్యాంకింగ్ పాయింట్లు తన ఖాతాలో వేసుకొన్నాడు. ప్రస్తుత ప్రపంచ టైటిల్‌తో నీరజ్ ర్యాంకింగ్ పాయింట్లు మరిన్ని పెరిగాయి.

రికార్డులే రికార్డులు!

హరియాణాలోని పానిపట్ జిల్లా, ఖాంద్రా గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన నీరజ్‌కు 11 ఏళ్ల వయసులో జావెలిన్ త్రో పట్ల ఆసక్తి పెంచుకొన్నాడు. జైవీర్ అనే అథ్లెట్.. జావెలిన్ ప్రాక్టీస్ చేయడాన్ని చూసి నీరజ్‌కు ఆ క్రీడ నేర్చుకోవాలనే ఆసక్తి కలిగింది. పంచ్‌కులలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా స్పోర్ట్స్ హాస్టల్‌లో ఉంటూ జావెలిన్‌లో శిక్షణ తీసుకున్నాడు. ప్రస్తుతం భారత సైనికదళాలలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్(జేసీవో)గా విధులు నిర్వర్తిస్తున్నాడు. స్వతంత్ర భారత ఒలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో భారత్‌కు పతకం మాత్రమే కాదు..తొలి బంగారు పతకం, ప్రపంచ పోటీలలో స్వర్ణ, రజతాలు అందించిన మొనగాడిగా నీరజ్ చోప్రా చరిత్రలో మిగిలిపోతాడు.

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌లో సైతం బంగారు పతకం సాధించడమే లక్ష్యంగా నీరజ్ తన సాధన కొనసాగించనున్నాడు. ఆతని కోసం కేంద్ర క్రీడామంత్రిత్వశాఖ కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ సైతం నీరజ్ ను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు.

వచ్చే ఆసియా క్రీడలతో పాటు..పారిస్ ఒలింపిక్స్‌లోనూ నీరజ్ తిరుగులేని చాంపియన్‌గా నిలుస్తాడనడంలో ఏమాత్రం సందేహం లేదు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

భారతీయత కోసం మరొక పోరాటం

'పరతంత్రంపై స్వతంత్ర పోరాటం' ఆవిష్కరణ సభలో బ్రహ్మశ్రీ సామవేదం

స్వాతంత్ర్యం సిద్ధించిన ఆగస్టు నెలలో, చంద్రయాన్ విజయవంతం అయిన సమయంలో 'పరతంత్రంపై స్వతంత్ర పోరాటం' పుస్తకం వెలువడ డం గొప్ప సంఘటన అని 'ఋషిపీఠం' వ్యవస్థాపక సంపాదకులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ, నిరాడంబరంగా జరుగుతున్నప్పటికీ ఈ ఆవిష్కరణోత్సవం విశిష్ట మైనదేనని అన్నారు. నిజానికి ఇలాంటి కార్యక్రమా లను మరింత ఆర్భాటంగా నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యక్ష ప్రసారం చేయాలని అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్య అమృతోత్సవాల సందర్భంగా 'భారత ఋషిపీఠం' పత్రిక 2021 ఆగష్టు నుండి ధారావాహికగా ప్రచురించిన వ్యాసాల సంకలనం 'పరతంత్రంపై స్వతంత్ర పోరాటం'. ఋషిపీఠం చారిటబుల్ ట్రస్ట్, భారతీయ ఇతిహాస సంకలనసమితి, చేతనా ప్రవంతి సంయుక్త ఆధ్వ ర్యంలో హైదరాబాద్‌లోని కొత్తపేట బాబు జగ్జీజీవన్‌రామ్ భవన్‌లో ఆగస్ట్ 26న ఈ కార్యక్రమం జరిగింది.

స్వామి వివేకానంద, మహర్షి అరబిందో వంటి గొప్ప ఆధ్యాత్మికవేత్తల మార్గదర్శనం, వారి స్ఫూర్తితో ప్రేరణ పొందిన నేతాజీ సుభాశ్‌చంద్ర బోస్ ముందుండి నడిపించిన ఈ స్వాతంత్ర్య పోరాటం ప్రపంచంలోనే అద్భుతమైనది అని సామవేదం అన్నారు. ఇలాంటి చరిత్ర ఉన్న దేశంలో నేటి తరం నాయకుడు ఒకడు భారతమాత అని అనడం గౌరవప్రదం కాదు అని అభ్యంతరం చెప్పడం, వందేమాతరం గీతం గురించి తప్పుగా మాట్లాడడం దౌర్భాగ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. వందేమాతరం, భారత్‌మాతాకి జై నినాదాలు దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిన నినాదాలని గుర్తు చేశారు.

రాబోయే అమృతకాలంలో మరొక స్వతంత్ర ఉ ద్యమం జరగాలని అది భారతీయతకు ప్రతీక కావాలన్నారు. హిందుత్వం అనేది భారతీయతకు పర్యాయ పదమేనని, అరబిందో అన్నట్లు భారతీయత అనేది స్వాతంత్ర్యానికి నిజమైన ఆత్మ అని శర్మ చెప్పారు. భారతమాతను తల్లిగా, సజీవశక్తిగా అరవిందుడు భావించాడని, మన మహర్షులు, భూమిని తల్లి/ మాతగా భావించారనీ, అంతేతప్ప భారతమాత ఆస్తి వాటా కాదని శర్మ అన్నారు.

'అరబిందో, కావ్యకంఠ వశిష్ట గణపతి ముని వంటి ఎందరో భారతహితమే జీవిత కర్తవ్యమంటూ దేశంకోసం పాటుపడ్డారు. భారతీయతను బోధిం చడం, సాంస్కృతిక వారసత్వాన్ని ముందు తరాల వారికి అందివ్వడమే ఒక తప్పుగా చిత్రీకరిస్తున్న ఈ సమయంలో మరో స్వతంత్ర్య పోరాటం జరగాలి. అది పూర్తి భారతీయతనే సాధించడమే కావాలి' అని ఆయన పిలుపునిచ్చారు. మన ప్రాచీన గ్రంథాలు మతపరమైన పుస్తకాలు కాదనీ, అవి మన జాతీయ



చిత్రంలో : చక్రధర్‌రెడ్డి, రాంపల్లి మల్లికార్జున్, భరత్‌కుమార్, సామవేదం, నరసింహమూర్తి

వారసత్వమనీ, మహిళలకు ఓటు హక్కు కూడా ఇవ్వనివారు భారతీయ మహిళలను అణచివేస్తున్నట్టు నకిలీ కథనాలను సృష్టించారనీ ఈ ధోరణిని తిప్పి కొట్టాలని శర్మ కోరారు. దేశం కోసం చప్పట్లు కొడితే సరిపోదు, దేశం కోసం పని చేయడం మన ఆకాంక్ష కావాలన్నారు. మనం కృషి చేస్తే, భగవంతుడు దిశానిర్దేశం చేస్తాడని తెలిపారు. శత్రువుల నుంచి దేశానికి భద్రత కల్పించేందుకు చిన్నదైనా, పెద్దదైనా మనం చేయగలిగినదంతా చేయాలి. ఉదుతలా కృషి చేస్తే భగవాన్ శ్రీరాముని అనుగ్రహం మనం పొందు తామని భవిష్యత్తులో భారతీయత రాజ్యమేలు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

భారత్ నుంచి విడిపోయిన దేశాల్లో హిందూ ఆలయాల కూల్చివేత, హిందువులపై దాడులు నిరా టంకంగా జరుగుతున్నాయని, ఇలాంటి విషయాలను సైతం మన మీడియా ప్రజల దృష్టికి తీసుకొని రావడంలో విఫలం అవుతున్నదని, అది కొంతమంది చేతులలో కీలుబొమ్మగా మారి పోయిందని విమర్శించారు.

మోక్షం కంటే గొప్పది భారతీయత కోసం జీవిం చడమేనని, దేశ క్షేమమే మన లక్ష్యం కావాలన్నారు. దేశం స్వాతంత్ర్యం పొందిన రోజే, దేశం ముక్క లైందని, ఇప్పటికీ ఈ శక్తులు పాశ్చాత్య శక్తుల సహా యంతో ఈ దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నా యన్నారు. అఖండభారతం మన లక్ష్యమే, కానీ ఉన్న దేశాన్ని విచ్ఛినం చేసే శక్తులు మన మధ్యనే ఉన్నాయని వాటితో జాగ్రత్తగా ఉండాలని వారు సూచించారు. ఒకవైపు భగవంతుని ప్రార్థిస్తూనే, దేశ అభివృద్ధిలో మనం దేశహితం కోసం మన ప్రయత్న లోపం లేకుండా చిత్తశుద్ధితో పనిచేస్తే దైవశక్తి ఆశీస్సులు కూడా ఉంటాయన్నారు.

లక్షలాది మంది యువకులు దేశభక్తితో తమ ప్రాణాలను త్యాగం చేసేందుకు ముందుకు రావడం ఒక్క భారత్‌లోనే జరిగిందని మరే దేశానికి ఇలాంటి చరిత్ర లేదని కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా హాజరైన రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్, దక్షిణ మధ్య సహ క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ అన్నారు.

దేశ విభజనను ఆస్తి పంపకంగా భావించిన కొంతమంది కుహనా మేధావులు, అందుకు అంగీకరించిన సంస్థలు, వ్యక్తులు మనకు తెలుసు నని, అలాంటి విషాద సమయంలో జరిగిన హిందువుల, సిక్కుల ఊచకోత, వారి మృతదేహాలతో అమృత్‌సర్‌కు రైళ్లు రావడం మర్చిపోవద్దు అని అన్నారు. రాబోయే అమృతకాలంలో దేశం కోసం మరణించడమా, జీవించి సాధించడమా అనేది ఆలోచిస్తూ సవాళ్లను, సమస్యలకు ఎదుర్కొంటూ వాటి పరిష్కారం దిశగా మన జీవనం ఉండాలని కోరారు.

16 వ్యాసాలతో కూడిన ఈ పుస్తకాన్ని రాంపల్లి మల్లికార్జునరావు పరిచయం చేశారు. .

కార్యక్రమానికి హాజరైన వ్యాసకర్తలు వల్లీశ్వర్, విజయసారథి, వేదుల నరసింహం, సురేందర్, దేవికారాణి ఈ పుస్తకాన్ని షణ్ముఖశర్మ చేతుల మీదుగా అందుకున్నారు. ★

తెలుసుకుందాం

శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం - అమ్మపల్లి

హైదరాబాద్‌కు సమీపంలో గల శంషాబాద్ ప్రాంతం, అమ్మపల్లిలో ఈ ఆలయం కొలువుదీరింది. 13వ శతాబ్దంలో వేంగీ చాళుక్యులు దీనిని నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. సీతమ్మవారు కొలువై ఉన్న కారణంగానే ఈ ఊరికి 'అమ్మపల్లి' అనే పేరు వచ్చిందని చెపుతారు. ఏటా శ్రీరామనవమి, శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. సీతారామలక్ష్మణుల ప్రతిమలు శిలా మకరతోరణాలను కలిగి ఉండటం ఇక్కడి ప్రత్యేకత.

కథ

కుందేలు నేర్పిన గుణపాఠం

ఒక అందమైన అరణ్యంలో ఒక చిన్న కుందేలు ఉండేది. అది అడవిలో ఉన్న వేర్లను, ఆకులను తింటూ ఆడుతూ, పాడుతూ హాయిగా కాలం గడిపేది.

అదే అడవిలో ఒక ఎలుగుబంటి కూడా ఉండేది. దానికి చాలా అహంకారం. 'నేను ఎంతో బలమైన జంతువును, అందరూ నా మాటే వినాలి' అనుకునేది. చిన్న జంతువులను కష్టపెట్టేది.

వసంతకాలం వచ్చింది. అడవంతా పచ్చని చిగుళ్లతో కళకళలాడుతోంది.

కుందేలుకు ఊయల ఊగాలని కోరిక కలిగింది. అది ఒక చెక్క ముక్కను తాళ్లతో ఒక చెట్టుకొమ్మకు కట్టి ఊయల ఏర్పాటు చేసుకుంది. చిరుగాలిలో హాయిగా ఊగడం మొదలుపెట్టింది.

ఇంతలో అక్కడికి ఆ ఎలుగుబంటి వచ్చింది. దానికి కుందేలు ఊయల ఊగడం చూసి ఈర్ష్య కలిగింది.

ఊయల మీద నుండి కుందేలును తోసేసి తను కూర్చుని ఊగడం మొదలుపెట్టింది.

కింద పడటంతో కుందేలుకు దెబ్బలు తగిలాయి.

ఇలా అడగకుండా తన ఊయల మీద

పద్యం

నిండు నదులు పాఱు నిచ్చి గంభీరమై
వెట్టివాగు పాఱు వేగబొల్లి
అల్పుడాఢ్యుడు రీతి నధికుండు నాఢ్యుడునా?
విశ్వదాభిరామ! వినుర వేమ!

భావం : ఓ వేమనా! గొప్ప నదులు నిదానంగానూ, గంభీరంగానూ ప్రవహించును. కానీ చిన్న వాగు, అతి వేగంగా గట్లుదాటి పొర్లి ప్రవహించును. అట్లే యోగ్యుడు నిదానంగా, గంభీరంగా మాట్లాడును. నీచుడు వాగుచూ ఉండును.

శ్లోకం

'దానమేవ కలౌయుగే'

'తపః పరం కృతయుగే త్రేతాయాం జ్ఞాన ముచ్యతే
ద్వాపరే యజ్ఞ మిత్యాహుః దాన మేవ కలౌ యుగే'

భావం : కృతయుగంలో తపస్సు,త్రేతాయుగంలో జ్ఞానం, ద్వాపర యుగంలో యజ్ఞం, కలి యుగంలో దానం ఉత్కృష్టమైనవి

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

ఇరుగు	నాలి
ఇల్లు	పాట
కూలి	పొరుగు
చదువు	బెళుకు
తళుకు	వాకిలి
పని	సంధ్య

ణఢ-డఢ; ఝఢఢ-ఝఢఢ; ఝఢ-ఝఢ; ఘఢఢ-ఘఢఢ; ఢఢ-ఢఢ; ఘఢ-ఘఢ; ఢఢఢ-ఢఢఢ;

సమాధానాలు : ణఢఢఢఢ-ఢఢఢ;

నిర్వహణ : నయనశ్రీ

భారత స్వాతంత్ర్య సమరయోధులు

ఇందుమతి పాటంకర్

ప్రఇందుమతి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు దినకరరావు నికమ్ కుమార్తె. సెప్టెంబర్ 15, 1925న మహారాష్ట్రలోని కాసేగావ్‌లో ఈమె జన్మించారు. తండ్రి స్ఫూర్తితో 1942లో ఉద్యమంలో చేరారు. మహిళలను సంఘటితం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర సేవాదళ్‌ను విస్తరించారు. పోరాట యోధులకు ఆయుధాలు (పిస్టల్స్, రివాల్వర్లు) సమకూర్చారు. జూలై 14, 2017న 91 ఏళ్ల వయస్సులో తుదిశ్వాస విడిచారు.

జనరల్ నాలెడ్జ్

1. ఇస్రో ప్రధాన కార్యాలయం ఎక్కడుంది?
2. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?
3. లిబియా దేశ రాజధాని ఏది?

సమాధానాలు : 1. బెంగళూరు; 2. ఏప్రిల్ 7; 3. ట్రిపోలి

మెదడుకు మేత

తోకలేని పిట్ట తొంభై ఆమడలు పోతోంది?

సమాధానం : ఉమ్మెత్త

మంచిమాట

స్నేహితులు, తోటిమానవులు.. అందరి పట్లా.. న్యాయంగా, ధర్మంగా, సమానంగా ప్రవర్తించడం అన్ని సద్గుణాలలోనూ ఉత్తమైనది..

వచ్చి కూర్చున్న ఎలుగుబంటి మీద కోపం వచ్చింది. ఎలుగుబంటికి గుణపాఠం చెప్పాలనుకుంది.

తన స్నేహితులైన ఎలుకల దగ్గరకు వెళ్లింది. జరిగిన విషయం చెప్పింది.

ఆ ఎలుకలని తనతో ఎలుగుబంటి ఊయలూగుతున్న చెట్టు దగ్గరకు తీసుకు వెళ్లింది. ఎలుకలు మెల్లిగా చెట్టుపైకి ఎక్కాయి. ఊయల కట్టిన కొమ్మ మీదికి వెళ్లి తాడును కొరికాయి.

ఊయల తాడు తెగి ఎలుగుబంటి 'ధామ్' అని కింద పడింది. దాని నడ్డి విరిగింది.

దాంతో ఎలుగుబంటికి బుద్ధొచ్చింది. మళ్లీ ఎప్పుడూ చిన్న చిన్న జంతువులను కష్టపెట్టే ప్రయత్నం చేయలేదు. ★

వారఫలాలు

04-10 సెప్టెంబర్ 2023

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

కొన్ని కార్యక్రమాలు సజావుగా సాగు తాయి. రాబడి అనూహ్యంగా పెరుగుతుంది. గృహ, వాహనయోగాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు మరింత లాభాలు అందుతాయి.రచయితలు, పరిశోధకులకు అవకాశాలు మరిన్ని దక్కుతాయి. 9,10తేదీల్లో కష్టానికి ఫలితం కనిపించదు. ఆస్తి వివాదాలు. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

కొన్ని కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. ఆలోచనలు కలసివస్తాయి. ఆశించిన ఆదాయం సమకూరుతుంది. వ్యాపారులు పెట్టుబడులు సకాలంలో అందుకుంటారు. విద్యార్థులకు అంచనాలు నిజమవుతాయి. రాజకీయ వేత్తలకు మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది. కళాకారులు, క్రీడాకారులకు ఉత్సాహవంతమైన కాలం. 4,5తేదీల్లో శారీరక రుగ్మతలు. దూరప్రయాణాలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ముఖ్యమైన కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి ముఖ్య సమాచారం అందుతుంది. భూవివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. ఉద్యోగులకు పని ఒత్తిడుల నుంచి విముక్తి. రాజకీయవేత్తలకు చిక్కులు తొలగుతాయి. క్రీడాకారులు, పరిశోధకుల ఆశలు ఫలిస్తాయి. 6,7 తేదీలలో వృథాఖర్చులు. అంగారక స్తోత్రం పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

కొత్త కార్యక్రమాలు సజావుగా పూర్తి చేస్తారు. అదనపు ఆదాయం సమకూరి ఉత్సాహంగా గడుపుతారు. కొన్ని వివాదాలు చాకచక్యంగా పరిష్కరించుకుంటారు. భూములు, ఆభరణాలు కొంటారు. వ్యాపారులకు ఆశించిన లాభాలు అందుతాయి. ఉద్యోగులకు కొన్ని మార్పులు సంభవం. రాజకీయ వేత్తలకు ఒక కీలక సమాచారం అందుతుంది. 7,8 తేదీల్లో శారీరక రుగ్మతలు. దూరప్రయాణాలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఆదాయం విషయంలో సమస్యలు తీరతాయి. పరిస్థితులు మరింతగా అనుకూలిస్తాయి. కొత్త కాంట్రాక్టులు దక్కుతాయి. ఇంటి నిర్మాణ యత్నాలలో కదలికలు ఉంటాయి. భూముల విషయంలో అగ్రిమెంట్లు కుదురుతాయి. పారిశ్రామిక వేత్తల కృషి ఫలిస్తుంది. కళాకారులు, రచయితల యత్నాలు ఫలిస్తాయి. 4,5తేదీల్లో అనుకోని ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. శివాష్టకం పఠించండి.

కన్య: ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

ముఖ్యమైన కార్యక్రమాలలో అవాంతరాలు అధిగమిస్తారు. అనుకున్న ఆదాయం సమకూరుతుంది. శారీరక రుగ్మతలనుంచి ఉపశమనం లభిస్తుంది. ఉద్యోగార్థుల యత్నాలు సఫలం. రచయితలకు సంతోష కరమైన విషయాలు తెలుస్తాయి. 6,7తేదీల్లో ఖర్చులు. కుటుంబబాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారులకు పెట్టుబడులు సమకూరుతాయి. హనుమాన్ ఛాలీసా పఠించండి.

తుల: చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

ముఖ్యమైన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేస్తారు. భూ వివాదాల నుంచి బయట పడతారు. నిరుద్యోగులకు ఉద్యోగలాభం. శుభ కార్యాలు నిర్వహిస్తారు. ఉద్యోగులకు పరిస్థితులు అనుకూలిస్తాయి. రాజకీయవేత్తలకు కొత్త పదవులు. కళాకారులు, రచయితలకు కీలక సమాచారం అందుతుంది. 6,7 తేదీల్లో సన్నిహితులతో విభేదాలు. ఆకస్మిక ప్రయాణాలు. నృసింహస్తోత్రాలు పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఇంటి నిర్మాణాల్లో అవాంతరాలు అధిగమిస్తారు. అనుకున్న ఆదాయం సమకూరి అప్పులు చేస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు విధుల్లో ప్రోత్సాహకరంగా ఉంటాయి. రాజకీయ వేత్తలకు శుభవార్తలు. పరిశోధకులు, క్రీడా కారులకు అంచనాలు ఫలిస్తాయి. 8,9తేదీల్లో వృథా ఖర్చులు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

బంధువుల చేయూతతో కీలక వ్యవహారాలలో ముందడుగు వేస్తారు. అయితే శ్రమ తప్పకపోవచ్చు. రాబడి కంటే ఖర్చులు పెరిగి సతమతమవుతాయి. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడం మంచిది. ఉద్యోగులకు పనిఒత్తిడులు. కళాకారులకు ఒత్తిడులు తప్పవు. రచయితలు, పరిశోధకులకు పరీక్షాకాలంగా ఉంటుంది. 5,6తేదీల్లో ఊహించని శుభవార్తలు. వాహనసౌఖ్యం. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

కొత్త కార్యక్రమాలను అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు దక్కుతాయి. గృహ నిర్మాణయత్నాలలో కొంత పురోగతి సాధిస్తారు. ఉద్యోగులకు క్లిష్ట సమస్యలు తీరతాయి. పారిశ్రామికవేత్తలకు సమస్యల నుంచి విముక్తి. రచయితలు, కళాకారులకు అనుకూల పరిస్థితులు. 4,5 తేదీల్లో బంధువులతో అకారణంగా విభేదాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఆస్తి, కోర్టు వివాదాల నుంచి గట్టెక్కుతారు. ఇంటాబయటా పరిస్థితులు అనుకూలిస్తాయి. విద్యార్థులకు మరింత ఉత్సాహం. శుభకార్యాలలో చురుగ్గా పాల్గొంటారు. వ్యాపారులకు మరింతగా లాభాలు అందుతాయి. కళాకారులు, రాజకీయవేత్తల యత్నాలు సఫలం. క్రీడాకారులు, పరిశోధకులకు విశేష గుర్తింపు. 6,7 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. హనుమాన్‌ఛాలీసా పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఆదాయం కొంత తగ్గి కొత్త అప్పులు చేస్తారు. కొన్ని ముఖ్య కార్యక్రమాలలో జాప్యం. ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. విద్యార్థులు, నిరుద్యోగులకు శ్రమ పెరుగుతుంది. వ్యాపారులకు సాదాసీదాగా ఉంటుంది. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు. రాజకీయవేత్తలు, పారిశ్రామికవర్గాలకు కొత్త సమస్యలు. కళాకారులు, రచయితలకు చికాకులు. 7,8తేదీల్లో శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధనలాభం. దుర్గాస్తోత్రాలు పఠించండి.

పదరసం-431

ఆధారాలు

అడ్డం

1. ఘటోత్కుచుడి తల్లి (3)
2. అవిశ్రాతం (4)
5. గొప్పలే..మరోలా (3)
6. న్యాయవాదుల సంఘం (2)
7. మాతృమూర్తి (3)
10. బతుకుతెరువు (3)
12. సుప్తం (2)
13. చూర్ణం, తాంబూలంలో వాడేది (3)
15. శ్రాద్ధకార్యం, పగలు
17 కృషి, వ్యవసాయం (2)
18. నిడివి చెల్లాచెదరు (3)
20. నీరు, ఉదకం (2)
21. సంధ్యావందనంలో జపించే మంత్రం (3)
23. హానే.. అటునుంచి (2)
26. సందేహం (2)
27. ఉపదేశం, మంచిమాట (4)
29. అలవాటు,ఆనవాయితి (3)
31 తప్పెట, ఒక చర్మవాద్యం (2)
32. పోగు, కుప్ప (2)
34. విరాటుని కొలువులో భీముడి పేరు (4)
35. సిరాతో రాసే పరికరం (3)

నిలువు

1. హిమవంతుని తనయ (3)
2. రాయలవారు తిమ్మరుసును ఇలా పిలిచేవారట (3)
3. వెల, మూల్యం (3)
4. 'నీవెక్క బోయే రైలు జీవితకాలంలేటు 'అన్న కవి (3)
6. దాస్యత్వం (3)
8. గొణుగు, సణగు (3)
9. నేటికి ముందు రోజు (2)
11. వశిష్ఠుని హోమధేనువు (3)
14. రోకలి (3)
16. వేగంగా....(3)
17. తమిళ భోజనం (3)
18. దీని రాతకు తిరుగే లేదట (2)
19. పుత్రులు కాదు (4)
22. కీర్తి, ప్రతిష్ఠ (2)
23. బాసట, సహాయం (3)
24. పెరుగు గారెలు (4)
25. అట్లు పోసే సాధనం (2)
28. శబ్దం, సడి (3)
29. అంగద జనకుడు (2)
30. జంట, రెండు (2)
32. రావడం (3)
33. రాయి (2)



పదరసం - 431

పేరు : .....

చిరునామా:.....

.....

పిన్‌కోడ్ : ..... మొబైల్ : .....

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

సమాధానాలను పైగడులలో పూరించి,కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 సెప్టెంబర్ 18లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

పదరసం - 427 సమాధానాలు



విజేతలు: చెరకు పల్లవీ మహేశ్, బోగారం సుప్రియ, తొయ్యేటి వెంకట సూర్యం, టి.విశాలాక్షి, దాసం లక్ష్మణరావు, కె.అల్లీరాణి, మేడవరపు నరసింహం,వై.రాధాకిషన్, జి.కోటేశ్వరమ్మ, నాయని రాములు, శ్రీరాములు విజయ్‌కుమార్, టి.గిరీశ్, గాజుల భవాని, భాస్కర్, గద్దం కవిత, ప్రదీప్‌కుమార్, జె.సత్యనారాయణ, ఎ.రజని, వి.రాము, రంగా రావు, వై.హనుమంతరావు, జనమంచి ముకుందము, డి.ఎన్.స్వర్ణలత, అనుపమ, దేవలక్ష్మి, టి.విశ్వనాథ్, పి.శాంతకుమారి, ఎస్.లక్ష్మిదేవి, టి.నాగజ్యోతి, యాదాటి జానకి, శ్రీధర్, సూర్యప్రభ, యర్రమిల్లి ప్రభాకర రావు, బి.రామచంద్రరామూర్తి, ఎస్.క్రిష్ణమూర్తి, వై.విజయలక్ష్మి, టి. మరియ, కె.సత్యప్రసాద్, వి.పద్మారంగనాథ్, తత్వాది మాధవి ప్రసాద్, వి.చంద్రకళ, గుండ్లవల్లి, కొన్నె ప్రశాంత్, గట్టు విజయలక్ష్మి, చిటకొండూరు పురుషోత్తం, లీలశ్రీ బరాబరి, బండుకింది రాధిక, బూర్ల సూజనకుమారి, రుద్రభట్ల సుగుణ రాజారాం,బాచరాజు విజయలక్ష్మి, రాయపెద్ది అప్పాశేషాశాస్త్రి, కవిత

ఈ వారం విజేత : బవండ్ల అంజయ్య, ఆమన్‌గల్, తెలంగాణ

జాతీయ సినీ అవార్డులలో ప్రతిసారీ తెలుగు సినిమాలకు అన్యాయం జరుగుతూనే ఉంది! ఇది గత కొన్నేళ్లుగా అవార్డులు ప్రకటించిన ప్రతిసారీ అందరూ పెదవి విరుస్తూ చెబుతూ వచ్చిన మాట. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. అంతర్జాతీయ యవనికపై 'ఆర్.ఆర్.ఆర్.' మూవీ ఆస్కార్ అవార్డును భారతదేశం తరఫున తొలిసారి అందుకున్న యేడాదే... అదే చిత్రం జాతీయ సినీ అవార్డులలో అత్యధికంగా ఆరు కేటగిరిలకు ఎంపికై జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. ఇది తెలుగు వారు గర్వించదగ్గ విషయం. అంతేకాదు... జాతీయ సినీ అవార్డులలో ఉత్తమ నటుడు కేటగిరీని ప్రారంభించిన తర్వాత తొలిసారి ఆ విభాగంలో అవార్డును అందుకున్న అల్లు అర్జున్ చరిత్ర సృష్టించాడు.

జాతీయ సినీ అవార్డులలో మనదే అగ్రస్థానం!

కొన్నేళ్లుగా జాతీయ స్థాయిలో అవార్డుల కమిటీలు తెలుగు సినిమాలపై శీతకన్ను వేశాయి. కమర్షియల్ అంశాలకు ప్రాధాన్యమిచ్చే సినిమాలకు అవార్డులు ఎలా ఇస్తామనే సాకు చూపి పక్కన పెట్టేశాయి. చిత్రం ఏమంటే... సామాజికాంశాలతోనూ, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే చిత్రాలను తీసినప్పుడు కూడా ఒకటి రెండు అవార్డులను ఇచ్చి చేతులు దులిపేసుకునేవి. గతంలో 'శంకరాభరణం', 'మేఘసందేశం' చిత్రాలకు మాత్రమే తెలుగులో నాలుగు కేటగిరిల్లో అవార్డులు దక్కాయి. అయితే 'బాహుబలి' చిత్రాన్ని రాజమౌళి పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసి ఘన విజయాన్ని అందుకున్న తర్వాత తెలుగు సినిమాలను నిర్లక్ష్యం చేయలేని పరిస్థితి నెలకొంది. అలా ఈసారి 'ఆర్.ఆర్.ఆర్.' కు ఆరు అవార్డులతో పాటు... మరో ఐదు అవార్డులు వివిధ కేటగిరిల్లో తెలుగు సినిమాలకు దక్కాయి.

చిత్రం ఏమంటే.. ఈసారి తెలుగు సినిమాలకు ఇన్ని అవార్డులు రావడం కొందరికి కంటగింపుగా ఉంది. మరీ ముఖ్యంగా తమిళ చిత్రసీమలోని వామపక్షీయులు తమకు అన్యాయం జరిగిందని గగ్గోలు పెడుతున్నారు. కొంతకాలంగా ఓ వర్గం దర్శక నిర్మాతలు తమిళ సినిమాల ద్వారా 'లాల్ – నీల్' భావజాలాన్ని ప్రచారం చేసే పనిలో పడ్డారు. పనికట్టుకుని అలాంటి చిత్రాలను తీసి జనం మీద రుద్దుతున్నారు. సమాజంలోని కుల వైషమ్యాలను రూపుమాపాల్సింది పోయి... వాటిని ఆధారం చేసుకుని మనుష్యుల మధ్య మరింత దూరం పెరిగే పని మొదలు పెట్టారు. పేరుకు అట్టడుగు వర్గాలను ఉద్ధరించే చిత్రాలను, వారి సమస్యలను సమాజానికి తెలియచేసే సినిమాలను తీస్తున్నామని చెబుతూనే, హిందుధర్మం నుండి వారిని ఏదో విధంగా వేరు చేయాలనే కుతంత్రానికి పాల్పడుతున్నారు. అలాంటి సినిమాలకు ఈసారి జాతీయ సినీ అవార్డులలో చోటు దక్కలేదు. కారణం ఏదైనా 'జై భీమ్', సార్పట్టు పెరంబరై, కర్ణన్' వంటి సినిమాలను కమిటీ పక్కన పెట్టింది. ఆయా సినిమాల దర్శక నిర్మాతలు దీనిపై పెదవి విప్పకపోయినా... వారి అనుయాయులు, వామపక్షీయులు సోషల్ మీడియా వేదికగా దీనిని ప్రశ్నిస్తున్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ పాత్ర చేసిన అల్లు అర్జున్‌కు అవార్డు ఇచ్చి, మానవ హక్కుల లాయర్‌గా నటించిన సూర్యకు అవార్డు ఇవ్వకపోవడం దారుణం కదా! అంటున్నారు. నిజానికి జ్యూరీ ఉత్తమ నటుడు కేటగిరికి వచ్చేసరికి ఆ నటుడు తనకిచ్చిన పాత్రకు ఎంతవరకూ న్యాయం చేశాడు అని ఆలోచిస్తుంది తప్పితే... సమాజంపై దాని ప్రభావం ఏమిటనేది చూడదు. ఉత్తమచిత్రం కేటగిరిలో అలాంటి విచక్షణను జ్యూరీ చూపించింది. అందుకే ఆర్. మాధవన్ మొదటిసారి దర్శకత్వం వహించి, నటించిన 'రాకెట్రీ' సినిమాను ఎంపిక చేసింది. మన మధ్య మనతో ఉండి, కొందరు వ్యక్తుల వల్ల మాసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ఇస్రో శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'రాకెట్రీ'. దానికి సముచిత గౌరవాన్ని జ్యూరీ కల్పించింది. కానీ వీటిని చూడకుండా... తమ సిద్ధాంతాలను ప్రచారం చేసే చిత్రాలకు రాలేదనే విమర్శనే కొందరు చేస్తున్నారు. ఇదే సందర్భంలో గుర్తు చేసుకోవాల్సింది ఏమంటే... 1987లో జాతీయ అవార్డులలో 'స్వయంకృషి' సినిమా ద్వారా చిరంజీవి, 'నాయగన్' చిత్రం ద్వారా కమల్ హాసన్ ఉత్తమ నటుడు కేటగిరికి పోటీ పడ్డారు. అప్పటి జ్యూరీ చర్మకారుడిగా ఉదాత్తమైన పాత్రను పోషించిన చిరంజీవికి కాదని, ముంబై అండర్ వరల్డ్ డాన్‌గా నటించిన కమల్ హాసన్‌ను ఉత్తమ నటుడిగా ఎంపిక చేసింది. చిరంజీవి కంటే... కమల్ ఆ పాత్రకు బాగా న్యాయం చేశాడని వారికి అనిపించి ఉండొచ్చు.

ఇక దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ లాంటి వారు 'ది కశ్మీర్ ఫైల్స్'కు జాతీయ సమగ్రత చిత్రం అవార్డు ఇవ్వడం మీద అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హిందువులను వెనకేసుకుని వచ్చి, వేరే మతం వారిని అది కించపరిచిందని చెబుతున్నారు. నిజానికి ఆ సినిమాలో కశ్మీరీ పండిట్ల పట్ల ఉగ్రవాదులు ఎలాంటి దారుణాలకు ఒడిగట్టారనేదే చూపడం జరిగింది. అలాంటి సినిమాలలో నటించిన వారికి మరిన్ని అవార్డులు రావాల్సింది. కానీ రాలేదు. కేవలం పల్లవిజోషికి మాత్రం ఉత్తమ సహాయనటి అవార్డు దక్కింది. ఈ నందర్భంగా గుర్తు చేసుకోవాల్సింది ఏమంటే... 1987లో హిందువుల మనోభావాలను దారుణంగా దెబ్బతీసిన 'తమస్' చిత్రానికి అప్పటి జ్యూరీ బెస్ట్ నేషనల్ ఇంటిగ్రేషన్ మూవీ అవార్డును కట్టబెట్టింది. అప్పుడు ఎవరూ దాని గురించి విమర్శలు చేయలేదు. కానీ ఇప్పుడు 'కశ్మీర్ ఫైల్స్'కు అవార్డు ఇవ్వగానే సన్నాయి నొక్కులు మొదలు పెట్టారు. ఏదేమైనా... ఇవాళ తెలుగు సినిమా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తన సత్తాను చాటుతోంది. ఇది వాస్తవం!!

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

వరల్డ్ రికార్డుల పుస్తకంలో విరిసిన శ్రీనగర్ తులిప్

ఇంద్రధనుస్సులు నేల మీదకు దిగి వచ్చినట్టే అనిపిస్తాయి శ్రీనగర్‌లో కనిపించే తులిప్ పూలతోటలు. ఒక్కసారిగా 15 లక్షల తులిప్ పూలు పుష్పిస్తాయి అక్కడ. ఇప్పుడు ఆ అద్భుతం వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (యుకె)లో విరిసింది. జబర్వాన్ పర్వత శ్రేణుల పాదాల దగ్గర ఉండే ఈ తోటలలో 68 రకాల తులిప్ పూలను చూడవచ్చు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సీఈఓ సంతోష్ శుక్లా ఈ మధ్యనే అందుకు సంబంధించిన పత్రాన్ని అందించారు. జేకే పరిపాలనా వ్యవహారాల కార్యదర్శి (పూలు, తోటల పెంపకం, పార్కుల నిర్వహణ) ఫయాజ్ షేక్ అందుకున్నారు. వరల్డ్ బుక్ సంపాదకుడు దిలీప్ ఎన్ పండిట్, తులిప్ తోటల కార్మికులు, ఇతర అధికారులు కూడా ఆ సందర్భంగా హాజరయ్యారు. ఇందిరా గాంధీ స్మారక తులిప్ తోటలు పేరుతో వీటిని పిలుస్తారు. 2006లో నాటి ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్ ఈ తోటల పెంపకం ఆరంభించారు.

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 46

ASWINI®

మీ జుట్టు రాలటం మరియు చుండ్రులను నియంత్రించటం...

మాకు ఛాలెంజ్

కుమారి శ్రీలత గారు ఎంతో కాలంగా జుట్టు రాలే సమస్యతో బాధ పడుతుండేవారు. ఆమె చాలా ప్రొడక్టులు వాడారు కానీ ఏ ఫలితమూ కనిపించలేదు. చివరకు ఆమె అశ్వినీవారి జుట్టు రాలడాన్ని నియంత్రించడం అనే ఛాలెంజ్‌ను స్వీకరించారు. మరి ఫలితం...

"అశ్వినీ వాడినాక చుండ్రు ఇంకా జుట్టు రాలడం, మునుపటికంటే బాగా తగ్గింది...*"

కుమారి శ్రీలత,
మెదక్, తెలంగాణ.

అశ్వినీ®

హెూమియో ఆర్నిక హెయిర్ ఆయిల్

Only pure cocnut oil base
No mineral oil used
No preservative added



*Consumer's personal opinion

Customer Care Executive (Toll free) 1-800-8435599
customercare@aswini.com | www.aswini.com